www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 25-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 259 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.10:57 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.11:58 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.6:35-8:19, తె.4:13-5:56, దుర్ముహూర్తం: ఉ.8:42-9:26, రా.9:49-10:39, అమృతఘడియలు: సా.5:00-6:45, రాహుకాలం: మ3:00-4:30, సూర్యోదయం: 6:29, సూర్యాస్తమయం: 5:34 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వ్యాక్సిన్‌కు కరోనా వైరస్ మస్కా!

వైరస్ స్పైక్ ప్రొటీన్‌లో నిరంతర మార్పులతో అయోమయంలో పడిపోయిన యాంటీబాడీస్

ఘనపదార్థంగా ఉన్నప్పుడే దానిపై ప్రభావం


ద్రవరూపంలో ఉన్నప్పుడు పనిచేయని వైనం

రెండేళ్ల అధ్యయనంలో నిర్ధారించిన ఏయూ



విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం విరుచుకుపడిన కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత వ్యాక్సిన్‌ను అందించాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ కంపెనీలు కొవిడ్ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చాయి. అయితే.. ఈ వ్యాక్సిన్లు కరోనా వైరస్‌కు

మిగతా 12వ పేజీలో...



సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

సూర్యకాంత్ అను నేను..

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్‌తో రాష్ట్రపతి ప్రమాణం

ఉప రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్ తదితరులు హాజరు

15 నెలలపాటు సీజేఐగా కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్

బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 17 కేసుల విచారణ

అత్యవసర కేసులను ఇకపై లిఖితపూర్వకంగానే సమర్పించాలి

పెండింగ్ కేసులు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి: జస్టిస్ సూర్యకాంత్

రాష్ట్రపతి భవన్‌లోనే అధికారిక వాహనాన్ని వదిలి వెళ్లిన మాజీ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి

న్యూఢిల్లీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత 53వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ గణతంత్ర మండపంలో.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో.. 'దైవసాక్షిగా..' అంటూ నూతన సీజేఐ ప్రమాణం చేశారు. అనంతరం తన అక్క, అన్న పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మాజీ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ వేడుకలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తోపాటు కేంద్రమంత్రులు

మిగతా 11వ పేజీలో...

మార్కాపురం, మదనపల్లె..

2 కొత్త జిల్లాలు!

కొత్త రెవెన్యూ డివిజన్లుగా నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిర

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

ముఖ్యమంత్రితో భేటీ-నివేదిక సమర్పణ

కొత్త జిల్లాల్లో 21 చొప్పున మండలాలు

అన్నమయ్య జిల్లా కేంద్రం రాజంపేటకు మార్పు

పశ్చిమ గోదావరికి నరసాపురం

ఆదోనిలో కొత్త మండలంగా పెద్దహరివాణం

అద్దంకి నియోజకవర్గం తిరిగి ప్రకాశంలోకి!

డివిజన్లు, మండలాల పునర్వ్యవస్థీకరణ

పోలవరం ముంపు మండలాలతో.. ప్రత్యేక అథారిటీ ఏర్పాటుపై వెనుకడుగు

అలా వద్దని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

ఏ జిల్లాలో ఉంచాలో నేడు కీలక నిర్ణయం

రెవెన్యూ శాఖ నివేదికపై చర్చించి చంద్రబాబుతో మళ్లీ సబ్‌కమిటీ భేటీ

ఆయన ఆమోదముద్ర పడిన వెంటనే ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు జారీ

అభ్యంతరాలు, సూచనలకు నెల గడువు



ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై సచివాలయంలో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పుడున్న 26 జిల్లాలకు కొత్తగా మరో రెండు అదనంగా చేరనున్నాయి. మార్కాపురం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. ఉపసంఘం సభ్యులు సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నివేదికను సమర్పించారు. నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిరలను కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలవరం ముంపు మండలాలతో తొలుత ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా ముఖ్యమంత్రి సూచనలతో ఉపసంఘం వెనక్కి తగ్గింది. ఈ అంశంపై మరోసారి సమావేశమై తగిన నిర్ణయం తీసుకుని ఆయనకు నివేదించనుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా దీనిపై

మిగతా 14వ పేజీలో...

జూన్‌లోగా 1.4 కోట్ల స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు

మెరుగైన సంక్షేమం, సేవల కోసమే.. కార్డులో సమస్త సమాచారమూ ఉండాలి

ఆర్టీజీఎస్ డేటా లేక్ నుంచి తీసుకోవాలి: సీఎం చంద్రబాబు 13



బాలీవుడ్ హీమ్యాన్ ఇక లేరు

దిగ్గజ నటుడు ధర్మేంద్ర తుదిశ్వాస

అనారోగ్యంతో ఇంట్లోనే మృతి

ముంబైలో పూర్తయిన అంత్యక్రియలు

ఆరున్నర దశాబ్దాల సినీ ప్రస్థానంలో 300కు పైగా చిత్రాల్లో నటన

'బాలీవుడ్ హీమ్యాన్' అనే బిరుదుతో ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం

ముర్ము, మోదీ, చంద్రబాబు సంతాపం

'హీమ్యాన్ ఆఫ్ ద హిందీ సినిమా'గా పేరొందిన దిగ్గజ నటుడు, నిర్మాత, పార్లమెంట్ మాజీ సభ్యుడు.. ధర్మేంద్ర (89) ఇక లేరు. కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లే శ్మశానవాటికకు తరలించారు. ఆయన కన్నుమూశారన్న విషయం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,

మిగతా 2వ పేజీలో...

విలువలకు తొలి బడి కుటుంబం!

కుటుంబసభ్యులు, గురువులను గౌరవించాలి

అమ్మకు చెప్పలేని పని ఎన్నడూ చేయొద్దు

ఏ అంశంలోనైనా స్వీయ నియంత్రణ అవసరం

గొప్పవారి జీవిత చరిత్రలను విద్యార్థులు చదవాలి

'విలువల సదస్సు'లో చాగంటి కోటేశ్వరరావు వెల్లడి

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబం నుంచే విలువలను నేర్చుకునే క్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, తోబుట్టువులు, గురువులతో గౌరవంగా మెలగడం అలవర్చుకోవాలన్నారు. కుటుంబాన్ని గౌరవించినవారే సమాజాన్ని కూడా గౌరవించగలరని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సోమవారం విజయవాడలో నిర్వహించిన 'విలువల విద్యా సదస్సు'లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. "కుటుంబం దేవుడు ఇచ్చిన గొప్ప వరం. ఎంతటి వ్యక్తి అయినా తల్లిని గౌరవించాలి. పాఠశాలకు వెళ్లే సమయంలో తల్లికి నమస్కరించాలి. తల్లికి చెప్పలేని పనులు ఎవరూ చేయకూడదు. మనం చేసే ప్రతి పనీ అమ్మకు చెప్పుకొనేలా ఉండాలి. ప్రధాని మోదీ అంతటి వ్యక్తి తల్లి గురించి

మిగతా 13వ పేజీలో...



విజయవాడలో జరిగిన 'విలువల విద్యా సదస్సు'లో చిన్నారులతో కలిసి చదువుల తల్లికి నమస్కరిస్తున్న చాగంటి, లోకేశ్

విజయానికి దగ్గరి దారి లేదు

అలా పైకి ఎదిగినా ఆ స్థానం నిలబడదు

ఓడిన చోటే భారీ మెజారిటీతో గెలిచా

నైతిక విలువలతోనే సమాజ మార్పు

విలువల సదస్సులో మంత్రి లోకేశ్

అన్ని జిల్లాల్లో సదస్సులు పెడతామని వెల్లడి



మరో రూ. 21,793 కోట్ల పెట్టుబడులు!

93,088 మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఓకే

సీఎస్ విజయానంద్ అధ్యక్షతన సమావేశం

ప్రోత్సాహక మండలి ఆమోదించాక 28న క్యాబినెట్ ముందుకు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రూ.21,793 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 93,088 మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొంది. సోమవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన 17వ ఎస్ఐపీసీ సమావేశం జరిగింది. ఈ భేటీలో

మిగతా 13వ పేజీలో...

అందరి నమ్మకాన్నీ వమ్ము చేశారు

గత టీటీడీ బోర్డు, అధికారులు.. భక్తుల హృదయాలను విచ్ఛిన్నం చేశారు

నాటి ప్రభుత్వంలో ప్రతి భక్తుడూ మోసపోయాడు

తిరుమల ఆలయం.. భక్తికి మూలం: పవన్

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని టీటీడీ బోర్డు, అధికారులు భక్తుల హృదయాలను విచ్ఛిన్నం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు. "తిరుమల కేవలం ఒక ఆలయం కాదు.. మన భక్తికి మూలం. ప్రగాఢ నమ్మకం, ప్రార్థనలతో తిరుమల వెళ్తాం. గత ప్రభుత్వ హయాంలో అంచనా ప్రకారం 10.97 కోట్ల మంది భక్తులు సందర్శించారు. దాదాపు ప్రతి రోజూ 60 వేలమంది భక్తులు పవిత్ర మందిరాన్ని

మిగతా 12వ పేజీలో...



ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి శ్రీకారం

ప్రదక్షిణ మండపం, రోడ్డు నిర్మాణానికి గతేడాది హామీ

ఏలూరు జిల్లాలో పవన్ కల్యాణ్ సుడిగాలి పర్యటన



ఏపీ మీదుగా బుల్లెట్ రైలు

చెన్నై - హైదరాబాద్ వయా తిరుపతి 3

ప్రయాణ సమయం 2.20 గంటలు తగ్గే చాన్స్

తమిళనాడుకు ప్రతిపాదనలు అందజేసిన దక్షిణ మధ్య రైల్వే



జీఏడీ టవర్స్ నిర్మాణంలో భాగంగా ఓవైపు భూమిని తొలుస్తూ.. మరోవైపు కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఐకానిక్ భవనాల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. అలాగే జడ్జీలు, ప్రిన్సిపల్ సెక్రటరీ భవనాల పనులూ 3 నెలల్లో కొలిక్కి రానున్నాయి. మంచినీటి పైపులైన్ల పనులు వేగం పుంజుకున్నాయి. రెండు నెలల కిందటే ఐకానిక్ భవనాల పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినా.. వర్షాలు, మొంథా తుఫాను ప్రభావంతో పనులు నెమ్మదించాయి. ప్రస్తుతం అనుకూల పరిస్థితులు ఉండటంతో పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి.

రాజధాని చకచకా

ఊపందుకున్న ఐకానిక్ భవనాల నిర్మాణం 14

రేయింబవళ్లు జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల పనులు

5 టవర్లలో ఏకకాలంలో పనుల కొనసాగింపు

ఆరు నెలల్లో బేస్‌మెంట్ దాటి బయటకు

జడ్జీలు, ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల్లోనూ పురోగతి

మరో మూడు నెలల్లో ఇంటీరియర్ దశకు

వేగంగా మంచినీటి పైపుల ఏర్పాటు



తుది దశకు చేరిన మంత్రుల క్వార్టర్ల నిర్మాణం



కోకాపేటలో హెచ్ఎండీఏ విక్రయించిన 17, 18 నంబరు ప్లాట్లు

కోకాపేటలో మళ్లీ కోట్లు!

ఈసారి రూ.137 కోట్లు పలికిన ఎకరం భూమి ధర 12

9.9 ఎకరాల వేలంతో హెచ్ఎండీఏకు రూ.1,356 కోట్లు

రెండేళ్ల క్రితం ఇక్కడే ఎకరానికి రూ.100.75 కోట్లు

నాటి సగటు ధర రూ.73 కోట్లు.. నేడు రూ.136.75 కోట్లు

నల్లమలసాగర్‌పై ముందడుగు

డీపీఆర్ తయారీకి టెండర్ల ఆహ్వానం

11లోపు బిడ్లు దాఖలు చేయాలని నిర్దేశం

జనవరి నెలాఖరుకల్లా టెండర్లు ఖరారు

మార్చి నెలాఖరులోపు టీఏసీ ఆమోదం

ఏప్రిల్ చివరిలోగా కేంద్ర జలశక్తి, అటవీ పర్యావరణ శాఖల అనుమతి లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం

3 దశల్లో 58,700 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం

ఇబ్రహీంపట్నం వద్ద అక్విడెక్టు ద్వారా కాకుండా బుడమేరు కాలువ గుండా కృష్ణాలోకి ఎత్తిపోత!

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకంపై మరో ముందడుగు పడింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తూ సోమవారం గుంటూరు జల వనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ టెండర్లు పిలిచారు. ఇందులో డీపీఆర్ తయారీకి రూ.9.10 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ధరావతు కింద రూ.7,68,334 చెల్లించాల్సి

మిగతా 12వ పేజీలో...


బాలీవుడ్ హీమ్యాన్ ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు సామాజిక మాధ్యమాల ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ధర్మేంద్రను ఆయన కుటుంబసభ్యులు అక్టోబరు 31న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేర్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆయన చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల్లో వదంతులు వైరల్ అయ్యాయి. అయితే.. ధర్మేంద్ర ఆరోగ్యం కుదురుగానే ఉందని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని ఆయన కుటుంబసభ్యులు ఆ సమయంలో అందరికీ విజ్ఞప్తి చేశారు. నవంబరు 12న.. వైద్యులు ఆయనను ఇంటికి తరలించి చికిత్సను కొనసాగించారు. డిసెంబరు 8వ తేదీ ధర్మేంద్ర పుట్టినరోజు కావడం.. ఆయన 90వ పడిలో అడుగు పెట్టనుండడంతో కుటుంబసభ్యులు జన్మదిన వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంతలోనే ఇలా జరగడం వారిని శోకసంద్రంలో ముంచివేసింది.

ఆరున్నర దశాబ్దాల కెరీర్..

పంజాబ్‌లోని ఓ మారుమూల గ్రామంలో పుట్టిన ధర్మేంద్ర.. చిన్నప్పటి నుంచీ సినిమాలపై ఆసక్తిగా ఉండేవారు. ఈ క్రమంలోనే.. నూతన ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చేందుకు ఫిలింఫేర్ మ్యాగజైన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని విజేతగా నిలిచి ముంబైకి చేరుకున్నారు. 1960లో ఆయన కల.. 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' చిత్రంతో నెరవేరింది. అయితే ఆ సినిమా అంత బాగా ఆడలేదు. 1961లో వచ్చిన 'షోలా ఔర్ షబ్నమ్' ఆయనకు తొలి వాణిజ్య విజయాన్ని సాధించి పెట్టిన సినిమా. అలాదాదాపు 65 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన 300కు పైగా చిత్రాల్లో నటించారు. 'ఆంఖేన్', 'సావన్ ఝూమ్ కీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'షోలే', 'ధర్మ వీర్', 'సత్యకామ్', 'చుప్కే చుప్కే', 'ఫూల్ ఔర్ పత్తర్' తదితర చిత్రాల్లో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. తెలుగులో కృష్ణ, కృష్ణంరాజు నటించిన 'అడవి సింహాలు' చిత్రాన్ని హిందీలో 'జానీ దోస్త్' పేరుతో ధర్మేంద్ర, జితేంద్ర హీరోలుగా నిర్మించారు. ఈ రెండు చిత్రాల షూటింగ్స్ ఏకకాలంలో జరగడం విశేషం.. షాహిద్ కపూర్, కృతి సనన్ నటించిన 'తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా'తో చివరిసారిగా వెండితెరపై కనిపించారు. ఆయన నటించిన చివరి చిత్రం 'ఇక్కీస్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన నటించిన ఆల్ టైమ్ క్లాసిక్ 'షోలే' 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబరు 12న రీ రిలీజ్ అవుతోంది. 1935లో జన్మించిన ఆయన.. 1952లో ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు ధర్మేంద్ర. వారి సంతానం.. సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజిత. అయితే.. ధర్మేంద్ర 1980లో హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. వారికి ఈషా డియోల్, అహానా డియోల్ జన్మించారు. కథానాయకుడిగా దశాబ్దాల పాటు వెండితెరను ఏలిన ధర్మేంద్ర రాజకీయాల్లోకీ అడుగుపెట్టారుగానీ.. ఆట్టేకాలం కొనసాగలేదు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ రాజస్థాన్‌లోని బికనీర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తర్వాత మళ్లీ రాజకీయాల జోలికి పోలేదు.



2022 డిసెంబరు 8న బర్త్‌డే కేకు కట్‌చేస్తున్న ధర్మేంద్ర



హేలి గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద

ఇథియోపియాలో పేలిన అగ్నిపర్వతం..

భారత్ నుంచి విమానాలు రద్దు

- సుమారు 15 కిలోమీటర్ల ఎత్తు వరకు బూడిద
- అరేబియా మీదుగా భారత్ వైపు బూడిద మేఘాలు
- జాగ్రత్తగా ఉండాలని విమానయాన సంస్థలకు హెచ్చరికలు జారీ చేసిన డీజీసీఏ

న్యూఢిల్లీ/శంషాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా ఖండం ఈశాన్య ప్రాంతంలోని ఇథియోపియాలో సుమారు 12 వేల ఏళ్లుగా నిద్రాణంగా ఉన్న హేలి గుబ్బి అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలైంది. దానికి ముందు ఆ ప్రాంతంలో 4.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. అగ్ని పర్వత విస్ఫోటంతో వాతావరణంలో 15 కిలోమీటర్ల ఎత్తులోకి పెద్ద ఎత్తున బూడిద, దట్టమైన పొగలను ఎగజిమ్మింది. దట్టమైన బూడిద మేఘాలు యెమెన్, ఒమన్, అరేబియా సముద్రం, పాకిస్థాన్ మీదుగా భారత్‌వైపు కదులుతున్నాయి. సోమవారం రాత్రి భారత్‌లోకి ప్రవేశించాయి. బూడిద మేఘాలు, పొగ కమ్ముకోవడంతో.. భారత్ నుంచి గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల మీదుగా ఈ బూడిద, ధూళి మేఘాలు చైనా వరకు విస్తరించవచ్చని అంతర్జాతీయ వాతావరణ విభాగాలు అంచనా వేశాయి. ఈ క్రమంలో బూడిద మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల నుంచి ప్రయాణించవద్దంటూ విమానయాన సంస్థలకు డీజీసీఏ అత్యవసర సూచనలు జారీ చేసింది.

వరుసగా విమానాల రద్దు, దారి మళ్లింపు..

బూడిద మేఘాలు, దట్టమైన పొగ కారణంగా పలు విమానాలు రద్దు చేస్తున్నట్టు ఆకాశ ఎయిర్, ఇండిగో, కేఎల్‌ఎం తదితర సంస్థలు ప్రకటించాయి. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఖతార్‌లోని దోహ వెళ్లాల్సిన 6ఈ 1315 ఇండిగో విమానం రద్దయింది. 158 ప్రయాణికులు, సిబ్బంది విమానంలోకి ఎక్కి, అంతా సిద్ధమయ్యాక దానిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, అందరినీ కిందకు దింపారు. ఇక దోహ నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 6ఈ 1316 విమాన సర్వీసును కూడా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబికి బయలుదేరిన 6ఈ 1433 ఇండిగో విమానాన్ని మధ్యలోనే అహ్మదాబాద్‌కు మళ్లించారు. సోమ, మంగళవారాల్లో జెడ్డా, కువైట్, అబుధాబి వెళ్లే, తిరిగొచ్చే విమానాలను రద్దు చేస్తున్నట్టు ఆకాశ ఎయిర్ ప్రకటించింది.


అరుదైన గౌరవం



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. చిత్రపరిశ్రమలో నటుడుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ప్రొఫెషనల్ కార్ రేసర్‌గానూ రాణిస్తున్నారు. ఈ రంగంలో ఆయన సాధించిన విజయాలకు గుర్తింపుగా ఇటలీ ప్రతిష్ఠాత్మక 'జెంటిల్మెన్ డ్రైవర్ ఆఫ్ ది ఇయర్ 2025' పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇటలీలోని వెనిస్ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఫిలిప్ చారియోల్ మోటార్‌స్పోర్ట్స్ గ్రూపు ఈ పురస్కారాన్ని అందించింది. అంతర్జాతీయ కార్ రేసింగ్ ట్రాక్‌లో భారతదేశ ప్రతిష్టను ఇనుమడింపజేసినందుకుగాను ఈ అవార్డు వరించింది. దీన్ని జీటీ రేసింగ్‌లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న ఎస్ఆర్‌వో మోటార్‌స్పోర్ట్స్ గ్రూపు సీఈవో స్టెఫాన్ రాటెల్.. అజిత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజిత్ సతీమణి షాలిని, వారి ఇద్దరు పిల్లలు కూడా పాల్గొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఒక సినిమా.. రెండేళ్ల ప్రయాణం!



'కార్తికేయ 2' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన యువ కథానాయకుడు నిఖిల్ 20వ చిత్రం 'స్వయంభు'. ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్‌కు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. 'రెండేళ్ల ప్రయాణం.. 170 రోజుల షూటింగ్ తర్వాత ఈ మహత్తర చిత్రీకరణ పూర్తయింది' అంటూ హీరో నిఖిల్ చేత చెప్పించి ఓ వీడియో విడుదల చేశారు నిర్మాతలు భువన్, శ్రీకర్. 'మన భారతదేశ చరిత్రకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అవి రాజుల కథలో, యుద్ధ గాథలో కాదు.. మన సంస్కృతికి పునాదులు. ఆ చరిత్రలో చెప్పని ఓ గొప్ప వీరుడి కథే ఈ చిత్రం' అని ఆ వీడియోలో నిఖిల్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 13న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర సమర్పకుడు ఠాగూర్ మధు చెప్పారు.

విడుదలకు సిద్ధం

అర్చన ప్రధాన పాత్రలో తోట కృష్ణ తెరకెక్కిస్తోన్న చిత్రం 'దక్షిణ కాళీ'. మీసాల వాణి నిర్మాత. చంద్రగిరి సుబ్బు, ప్రియాంక శ్రీ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. కార్యక్రమంలో నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ 'ఆ కాళీమాతే నిర్మాతను ఆవహించి ఈ సినిమా తీసిందేమో అన్నట్టుంది. అర్చన అద్భుతంగా నటించారు. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ 'ఆర్టిస్టులు, టెక్నీషియన్లు పట్టుదలతో చేసిన కృషికి నిదర్శనం ఈ చిత్రం' అని అన్నారు. నిర్మాత మీసాల వాణి మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో 'దక్షిణ కాళీ' కథను నేను రాసుకున్నా' అని చెప్పారు.

సభ్యసమాజం తలదించుకునేలా
వైసీపీ నేతల తీరు: గోనుగుంట్ల

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునేలా వైసీపీ నేతల భాష, తీరు ఉందని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సీబీఐ చార్జిషీట్లు, 9 ఈడీ చార్జిషీట్లలో ఏ1గా ఉన్న జగన్ కోర్టుకు హాజరయ్యే సమయంలో వ్యవహరించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లి కోర్టు వరకు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించడం, రప్పా.. రప్పా స్లోగన్స్‌తో ఫ్లెక్సీలు కట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. గతంలో కోర్టుకు హాజరుకావాలని ఆదేశాలిస్తే తాను కోర్టుకు రావడం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందన్న జగన్, ఇప్పుడు ప్రత్యేక చార్టెర్డ్ విమానంలో ఎలా వచ్చారని ప్రశ్నించారు.

జగన్‌వి చవకబారు రాజకీయాలు: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే వైఎస్ జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్ గత పాలనలో రైతుల సంక్షేమం కోసం ఏనాడూ కృషి చేసిన పాపానా పోలేదన్నారు. సోమవారం, ఏపీభవన్‌లో ఎంపీ కలిశెట్టి మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనలో పడ్డ తీవ్ర ఇబ్బందులను రైతులు ఇంకా మరిచిపోలేదన్నారు. 18 నెలల తమ ప్రభుత్వంలో రెండు విడతలుగా 'అన్నదాత సుఖీభవ' నిధులను రైతులకు ఇచ్చామని తెలిపారు. త్వరలో మూడో విడతగా మరో రూ.6 వేలను ఇవ్వనున్నామన్నారు. మొత్తంగా ఏటా రైతులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రకృతి విపత్తుల్లో సీఎం చంద్రబాబు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ కోర్టు హాజరును రాజకీయ ర్యాలీగా మార్చారని విమర్శించారు. సీఎం చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, ఆయన దార్శనిక నాయకత్వంలో ఏపీని నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఎంపీ కలిశెట్టి ధీమా వ్యక్తం చేశారు.

పేదలందరికీ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం: పీతల సుజాత

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా ఎలాంటి అక్రమాలకూ తావు లేకుండా పేదలందరికీ ఇళ్ల నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సొంత పార్టీవారికే ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి అక్రమాలు, అవినీతీ లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ, కేటాయింపు ప్రక్రియను జరుపుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పీఎంఏవై-ఎన్టీఆర్ హౌసింగ్ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ సమయం మరో 6 రోజుల్లో ముగియనుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2029కి ప్రతి పేదవాడికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సుజాత చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి కృషి చేయాలి

- మాజీ మంత్రి పరసా రత్నం

న్యూఢిల్లీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లవుతున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉచిత విద్య, వైద్యం సక్రమంగా అందట్లేదని ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి, అంబేద్కర్-పూలే ఫౌండేషన్ చైర్మన్ పరసా రత్నం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏపీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం కోసం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటోందని, మున్ముందు ఇదే రీతిలో ఇంకా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ఆమోదం పొంది రేపటితో 75 ఏళ్లవుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇంధన పరిరక్షణ అవార్డులకు దరఖాస్తులు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన ఇంధన వినియోగ రంగాలైన పరిశ్రమలు, విద్యాసంస్థలు, పట్టణ, స్థానిక సంస్థలు... రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డు - 2025 (స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డు) పోటీల్లో పాల్గొనాలని ఏపీ జెన్కో ఎండీ, ఏపీఎస్ఈసీఎం సీఈవో నాగలక్ష్మి కోరారు. రాష్ట్ర ఇంధన శాఖ ఆధ్వర్యంలో.. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఈ అవార్డులను వరుసగా ఐదో ఏడాది ఇస్తోందని తెలిపారు. ఇంధన వినియోగం, కనెక్టెడ్ లోడ్ ఆధారంగా అర్హత ఉన్న సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు మార్గదర్శకాలు, ప్రమాణాలు, ఫార్మాట్ల కోసం https://sites.google.com/view/apsecm/seca2025 ను సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు న్యాయమూర్తుల గ్రాట్యుటీ పరిమితి పెంపు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర న్యాయశాఖ లేఖను అనుసరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులకు గ్యాట్యుటీ పరిమితిని పెంచుతూ రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. 1-1-2024 నుంచి గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బెంగళూరులో అన్నమయ్య జిల్లా యువతి హత్య

- చంపి పరారైన చిత్తూరు జిల్లా యువకుడు
- తానూ చనిపోతున్నానంటూ కుటుంబీకులకు ఫోన్
- సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు
- తప్పుదారి పట్టించేందుకేనని అనుమానం


మృతురాలు దేవిశ్రీ


నిందితుడు ప్రేమవర్ధన్

రామసముద్రం/బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ యువతి బెంగళూరులో ఆదివారం హత్యకు గురైంది. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల మేరకు మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం బిక్కింవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప రెండో కుమార్తె దేవిశ్రీ (21) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీబీఎం చదువుతూ పేయింగ్ గెస్ట్ హాస్టల్‌లో ఉంటోంది. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రికి చెందిన బి.మునస్వామి కుమారుడు బి.గోవర్ధన్ అలియాస్ ప్రేమవర్ధన్ ఆదివారం బెంగళూరు వెళ్లి దేవిశ్రీని ఆమె స్నేహితురాలు రూమ్‌కి పిలిపించాడు. వీరిద్దరిని రూమ్‌లో వదిలి స్నేహితురాలు వెళ్లిపోయింది. ఈ క్రమంలో ప్రేమవర్ధన్.. దేవిశ్రీ ముఖంపై దిండు అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి చంపి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బెంగళూరు వెళ్లి అక్కడి పోలీసులకు సమాచారం అందించి కేసు నమోదు చేయించారు. దేవిశ్రీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. హోం మంత్రి చొరవ తీసుకుని నిందితుడిని కఠినంగా శిక్షించాలని దేవిశ్రీ తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా.. యువతిని హతమార్చిన అనంతరం ప్రేమవర్ధన్ పరారయ్యాడని, హత్యకు కారణాలు తెలియాల్సి ఉందని మాదనాయకనహళ్లి పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి, ప్రేమవర్ధన్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు.. గోవర్ధన్ ఆదివారం సాయంత్రం మదనపల్లె నుంచి బస్సులో బోయకొండకు వచ్చాడని కొందరు చెబుతున్నారు. తాను చనిపోతున్నానని, బోయకొండ చెరువు వద్ద తన శవాన్ని తీసుకెళ్లాలంటూ గోవర్ధన్ కుటుంబీకులకు, స్నేహితులకు ఫోన్, మెసేజ్ చేయడంతో వారు ఆదివారం రాత్రి చౌడేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి బోయకొండ చెరువు వద్ద పోలీసులు గాలించగా ఏలాంటి ఆనవాళ్లు లభించలేదు. కానీ చెరువు వద్ద మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కొంత సమయానికే సోమల మండలం ఇరికిపెంట వద్ద ఆన్ చేసి మళ్లీ ఆఫ్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. గోవర్ధన్ కనిపించలేదని మిస్సింగ్ కేసు కట్టాలని కొందరు పోలీసుల వద్దకు రాగా హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిపై మిస్సింగ్ కేసు ఎలా నమోదు చేయాలని మందలించి పంపారు. పథకం ప్రకారం నిందితుడు అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నాడని పోలీసులు భావిస్తున్నారు.

'రైతన్నా.. మీకోసం' వారోత్సవాలు ప్రారంభం

- లాభసాటి సాగుకు పంచసూత్ర ప్రణాళిక
- ఘంటశాలలో రైతులతో మంత్రి అచ్చెన్న ముఖాముఖి
- రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలూ..


కృష్ణా జిల్లా ఘంటశాలలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు పంచసూత్ర ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీకోసం' వారోత్సవాలు ఘనంగా ఆరంభమైనాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం కృష్ణా జిల్లా ఘంటశాలలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రైతులకు భరోసా ఇవ్వగల పంచసూత్రాల ప్రణాళికను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నట్లు అచ్చెన్న తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, సాగుకు ప్రభుత్వాల మద్దతు గురించి వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ మనజీర్ జిలానీ వివరించారు. విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం రామభద్రపురంలో హోం మంత్రి అనిత 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, వ్యవసాయంపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంపై సీఎం చంద్రబాబు లేఖ కరపత్రాలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అందించారు. పాడి పశువులు, గొర్రెలు, కోళ్లు, ఇతర జీవాలకు అందిస్తున్న వైద్య సేవలు, పశుపెంపకందారులకు అమలు చేస్తున్న పథకాలను పశుసంవర్ధకశాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పశుపోషకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ

రైతన్నా మీకోసం.. వారోత్సవాల అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రాథమిక రంగాన్ని పునర్వ్యవస్థీకరించడానికి, రైతులను వ్యవసాయ సంరక్షకులుగా మార్చడం ద్వారా వారి జీవనోపాధి, ఆర్థిక ప్రమాణాలను పెంచడానికి సీఎం చంద్రబాబు నిర్దేశించిన పంచసూత్రాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. సోమవారం నుంచి రైతుసేవా కేంద్రం యూనిట్‌గా ప్రతి రైతు ఇంటికీ ఈ పంచ సూత్రాల ఉద్దేశాన్ని తీసుకెళ్లాలి. రైతు సేవా కేంద్రంలోని వివిధ శాఖల సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రతి ఆర్ఎస్‌కే కింద ప్రతి మూడు ఇళ్లను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ప్రతి బృందం రోజుకు 30క్లస్టర్లు కవర్ చేయాలి. ప్రతి క్లస్టర్‌లో 15-20 నిమిషాలు గడిపి, రైతు సంక్షేమ చర్యలపై సీఎం లేఖను కరపత్రాలుగా పంపిణీ చేసి, రైతులకు ఏపీ ఎయిమ్స్ యాప్, పంచసూత్రాల గురించి వివరించాలి. వారోత్సవాల్లో ప్రతి బృందం 540 ఇళ్లను కవర్ చేయాలి. 2026-27 సంవత్సరానికి లాభసాటి సాగు కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొంది328ంచడానికి డిసెంబరు 3న ప్రతి రైతుసేవా కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించాలి. రైతుసేవా కేంద్రం స్థాయి ప్రణాళికల ముసాయిదాను కలెక్టర్లు, జిల్లా వ్యవసాయాధికారికి అందించాలి.

ఏపీ మీదుగా బుల్లెట్ రైలు

- చెన్నై - హైదరాబాద్ వయా తిరుపతి
- ప్రయాణ సమయం 2.20 గంటలు తగ్గే అవకాశం
- తమిళనాడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- అందజేసిన దక్షిణ మధ్య రైల్వే

చెన్నై, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు తిరుపతి మార్గంలో నడిచేలా ప్రణాళికలు సిద్ధం చేసిన దక్షిణ మధ్య రైల్వే... ఆ మేరకు నివేదికను తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. 2027లో సూరత్ నుంచి తొలి బుల్లెట్ రైలు నడిచేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా దక్షిణాదిన రెండు మార్గాల్లో బుల్లెట్ రైళ్ల ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. చెన్నై-బెంగళూరు-మైసూరు మార్గంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు అమలుకు భూసర్వే జరుగుతోంది. అలాగే చెన్నై-హైదరాబాద్ మధ్య 778 కి.మీ. బుల్లెట్ రైలు ప్రాజెక్టు నివేదికను దక్షిణ మధ్య రైల్వే సిద్ధం చేస్తోంది. చెన్నై నుంచి గూడూరు మీదుగా హైదరాబాద్‌కు బుల్లెట్ రైలు సేవలు అందేలా చర్యలు చేపట్టాలని భావించింది. అయితే తిరుపతి మార్గంలో ఆ ప్రాజెక్టును అమలు చేయాలని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే దక్షిణ మధ్య రైల్వేకు విజ్ఞప్తి చేసింది. ఆ ప్రకారం కొన్ని సవరణలు చేసి నివేదిక రూపొందించిన దక్షిణ మధ్య రైల్వే... ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. దీనికి సూత్రప్రాయంగా ఆమోదం లభిస్తే, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం, తమిళనాడు ప్రభుత్వ కన్సల్టెన్సీ రిట్జ్, తమిళనాడులో బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు 223.44 హెక్టార్ల భూమి అవసరం. అలాగే 65 రోడ్లు, 21 హై-వోల్టేజ్ లైన్లు దాటవలసి ఉంటుంది. చెన్నై సెంట్రల్, మీంజూరు సమీపంలోని చెన్నై ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో 2 బుల్లెట్ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వాటికోసం ఆ రెండు ప్రాంతాల్లో తలా 50 ఎకరాల చొప్పున భూసేకరణ చేయాల్సి ఉంటుంది' అని నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఒకవేళ చెన్నై-హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైలు ప్రాజెక్టు అమలులోకి వస్తే... ప్రస్తుత ప్రయాణ సమయం 12 గంటలు కాగా... 2.20 గంటలు తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.


రథంపై విహరిస్తున్న పద్మావతి అమ్మవారు

వైభవంగా పద్మావతీ రథోత్సవం

తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. వాహనసేవలో తలమానికమైన రథంపై ముత్యపు కవచపు అలంకారంలో అమ్మవారు సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా కొలువుదీరి తిరుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి అశ్వవాహనంపై కల్కి రూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. దీంతో అమ్మవారి వాహన సేవలు ముగిశాయి. చివరి రోజైన మంగళవారం పంచమి తీర్థం సందర్భంగా మధ్యాహ్నం 12.10 గంటలకు చక్రస్నానం నిర్వహించనున్నారు. లక్ష మందికిపైగా భక్తులు పుష్కరిణి స్నానం ఆచరించనున్నారు. రాత్రికి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

5న వైకుంఠ ద్వార దర్శనానికి
రూ.300 టికెట్ల విడుదల

- 27న తొలి మూడు రోజులకు ఉచిత టోకెన్ల కోటా

తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను డిసెంబరు 5న టీటీడీ విడుదల చేయనుంది. జనవరి 2 నుంచి 8 వరకు రోజుకు 15వేల టికెట్ల చొప్పున టికెట్లు కేటాయిస్తారు. 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో వీటిని విడుదల చేయనున్నారు. ఇక తొలి మూడురోజులకు (వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, న్యూఇయర్)కు సంబంధించిన ఉచిత ద్వార దర్శనం టోకెన్ల కోసం ఈనెల 27 నుంచి డిసెంబరు 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిసెంబరు 2న ఈడిప్ ద్వారా దర్శనాలను కేటాయిస్తారు. తొలి మూడు రోజులే దర్శనాలకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మూడు రోజులకు దాదాపు 2.13 లక్షల మందికి టోకెన్లు కేటాయించేలా టీటీడీ ప్రణాళిక రూపొందించుకుంది. జనవరి 2 నుంచి ఏడు రోజులు సర్వదర్శన భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని కూడా శ్రీవారిని దర్శించుకోవచ్చు.

ప్రొఫెసర్ వెలమల సిమ్మన్నకు
లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం

- క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సహా నలుగురు ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యానికి ఎనలేని కృషిచేసిన ప్రొఫెసర్ వెలమల సిమ్మన్నకు ఈ ఏడాది లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఏయూలోని హిందీ భవన్‌లో సోమవారం ఆయన అవార్డుల వివరాలను వెల్లడించారు. శతాధిక గ్రంథకర్త ప్రొఫెసర్ వెలమల సిమ్మన్నకు లోక్‌నాయక్ సాహిత్య పురస్కారంతోపాటు రూ.రెండు లక్షల నగదు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అలాగే, మరో నలుగురు ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. వీరిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, డల్లాస్ కేంద్రంగా ఎన్నో సామాజిక, సాహిత్య సేవలు అందిస్తున్న డాక్టర్ తోటకూర ప్రసాద్, మిషిగాన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలో సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ వేములపల్లి రాఘవేంద్రచౌదరి, లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెలిసియా డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఏరియన్ ఉదయ్ ఆరేటి ఉన్నారన్నారు. వీరికి జీవన సాఫల్య పురస్కారంతోపాటు రూ.లక్ష నగదు అందజేస్తామన్నారు. ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని జనవరి 18న దసపల్లా హోటల్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

నేపాల్‌లో 8మంది పామూరు వాసుల అరెస్టు

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేపాల్ వెళ్లి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ప్రకాశం జిల్లా పామూరు ప్రాంతానికి చెందిన ఎనిమిది మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వారి అరెస్టు సమాచారం నేపాల్ వార్తా పత్రికలు, టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. మన దేశంలో జరిగే ఐపీఎల్ తరహాలో నేపాల్‌లో ఎన్‌పీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాసేందుకు పామూరుకు చెందిన ఏడుగురు, సీఎస్‌పురం మండలానికి చెందిన ఒకరు బెంగళూరు నుంచి విమానంలో నేపాల్‌కు చేరుకున్నట్టు తెలిసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు పక్కా సమాచారంతో నేపాల్ పోలీసులు వలపన్ని ఈ ఎనిమిది మందిని ఆదివారం అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నట్టు సమాచారం.

15 ఏళ్లు దాటిన వాహనాలకు భారీగా షాక్

- మోతమోగేలా ఫిట్‌నెస్ చార్జీలు
- కేంద్రం నిర్ణయంతో యజమానులు బేజారు.. పునరాలోచించాలని వినతి

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాహనం ఫిట్‌గానే ఉంది, 15 ఏళ్లు దాటిగా ధీమాగా రోడ్లపై తిప్పుతాను అంటే ఇకపై భారీగా ఫీజులు చెల్లించాల్సిందే. కేంద్రం తాజా నిర్ణయంతో వయసు మళ్లిన వాహనాలను రోడ్లపై తిప్పాలంటే మోయలేని భారమే కానుంది. ఇప్పటి వరకూ ఉన్న వాహనాల ఫిట్నెస్ పరీక్ష ఫీజుతో పాటు సర్టిఫికెట్ చార్జి, జీఎస్టీ అన్నీ కలిపి ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లలో వసూలు చేస్తున్నారు. నాలుగు చక్రాల వాహనాలు (క్యాబ్‌లు) 15 ఏళ్ల వరకూ ఫిట్నెస్ ఫీజు రూ. 944 మాత్రమే. పదిహేను ఏళ్లు దాటితే ఏడాదికి రూ.5,310 చెల్లించాల్సిందే. 20 ఏళ్లు దాటిన వాటికి ఏటా రూ.10,620 సమర్పించుకోక తప్పదు. ఇదే నాలుగు చక్రాల కోటాలోని ఎల్ఎంవీ(కార్లు)లకు పదిహేనేళ్ల వరకూ రూ.944 కాగా ఆ తర్వాత ఏడాదికి రూ.10,030 చెల్లించాలి ఇరవై సంవత్సరాలు దాటితే రూ.20,060 భరించక తప్పదు. ఇక సరుకు రవాణాకు ఉపయోగించే మధ్యస్థ సరుకు వాహనాలకు (ఎంజీవీ) పదేళ్ల వరకూ రూ.1,416, పదమూడేళ్ల వరకూ రూ.2,360, 15 ఏళ్ల వరకూ రూ.7,080 వరకూ చెల్లించాలి. 15 నుంచి 20 ఏళ్ల మధ్యలో ఏటా రూ.13,384, 20సంవత్సరాలు దాటితే ఏటా రూ.33,040 భారం మోయాల్సిందే. భారీ వాహనాలైన లారీలకు ఇదే వర్తిస్తుందని కేంద్రం తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. వాహనం కండీషన్‌లో ఉన్నప్పుడు ఇలాంటి భారాలు మోపడం భావ్యం కాదని ట్రాన్స్‌పోర్టు వాహనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

జగద్గురు పీఠం జాతీయ అధ్యక్షుడు
కేఎస్ శాస్త్రి కన్నుమూత



అక్కయ్యపాలెం (విశాఖపట్నం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ హోమియో వైద్యుడు, జగద్గురు పీఠం (ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి (89) సోమవారం ఉదయం అక్కయ్యపాలెంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు శాస్త్రి కుమారుడు కె.శ్రీనివాస్ తెలిపారు. మాస్టర్ ఇకె నుంచి స్ఫూర్తి పొందిన డాక్టర్ కేఎస్ శాస్త్రి తన జీవితాన్ని హోమియో వైద్య సేవకు అంకితం చేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పీఠం కార్యనిర్వాహక బృందం పేర్కొంది. సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, ఉపాధ్యక్షుడు ఎన్‌సీఎస్ మూర్తి, సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, చింతలపాటి సత్యదేవ్, సీహెచ్ఎస్ఎన్ రాజు, హనుమంతరావు శాస్త్రి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వర్చువల్ విచారణకు హాజరైన 'స్వాతి' ఎడిటర్

నరసరావుపేట లీగల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): స్వాతి వార పత్రిక ఎడిటర్ వేమూరి బలరాంను పల్నాడు జిల్లా నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి కోర్టు సోమవారం వర్చువల్‌గా విచారించింది. నరసరావుపేటకు చెందిన అశ్లీల వ్యతిరేక ప్రతిఘటన వేదిక నాయకుడు ఈదర గోపీచంద్ స్వాతి వారపత్రికలో వస్తున్న అశ్లీల రాతలపై మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా స్వాతి ఎడిటర్ వేమూరి బలరాంను సోమవారం వర్చువల్‌గా న్యాయాధికారి ఆవుల సలోమి ప్రశ్నించారు. పత్రికలో మహిళలను అశ్లీలంగా, అసభ్యంగా చూపారా అని ప్రశ్నించగా ఆయన లేదు అని బదులిచ్చారు. ఈ మేరకు సమాధానాన్ని రికార్డు చేశారు. తదుపరి విచారణను న్యాయాధికారి డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అవని ఆర్తి

'మన శీతోష్ణస్థితి మారుతోంది. మన ధరిత్రి సంక్షోభంలో ఉన్నది. భవిష్యత్తు భయం గొల్పుతోంది, అనిశ్చితంగా ఉంది. అయినా ఈ మహా అస్తవ్యస్తత నడుమ భావిని ముందే సూచించే శక్తిని కనుగొన్నాను. తుఫానులు ప్రచండమవుతున్నవేళ రక్షణనిస్తుందది. ఈ ప్రపంచాన్ని మరింత మెరుగ్గా రూపొందించే స్థిరమైన, నిరంతర కృషితోనే అది మనకు సురక్షిత ప్రదేశంగా ఉంటుంది'– 2007లో నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన ఐపీసీసీ నివేదిక ప్రధాన రచయిత, వాతావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జగదీష్ శుక్లా తన జీవిత కథకు ముక్తాయింపుగా అన్న ఆ మాటలు ఆవశ్యక ఫలితాలను సాధించడంలో విఫలమవుతున్నప్పటికీ వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి వార్షిక సదస్సులు కొనసాగవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పుతున్నాయి. శనివారంనాడు, బ్రెజిల్‌లో అమెజాన్ మహారణ్యం ముంగిట ఉన్న బెలెమ్ నగరంలో ముగిసిన కాప్ 30 సదస్సు సైతం ఆ వార్షిక చర్చల ప్రధాన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయింది.

కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) సదస్సులుగా ప్రసిద్ధి పొందిన ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సులు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమయినప్పుడు, వాతావరణంలో కర్బన ఉద్గారాల సాంద్రత 360.67 పార్ట్స్ పర్ మిలియన్‌గా ఉండగా ఇప్పుడు అది, శాస్త్రవేత్తలు చెప్పిన భద్రమైన పరిమితి (350 పీపీఎమ్) కంటే చాలా అధికంగా 426.68 పిపిఎమ్‌గా ఉన్నది! వాతావరణ మార్పుకు కారణమవుతున్న కర్బన ఉద్గారాలకు ప్రధాన వనరు అయిన శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశల వారీగా తగ్గించేందుకు ఒక మార్గదర్శక ప్రణాళికను రూపొందించడం కాప్ 30 అజెండాలో ప్రధానాంశంగా ఉన్నది.

పారిశ్రామిక విప్లవకాలంలో రికార్డయిన గరిష్ఠ ఉష్ణోగ్రతకు మించి 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలని పారిస్ కాప్ సదస్సు నిర్దేశించింది. చారిత్రకంగా శిలాజ ఇంధనాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు తమ అభివృద్ధికి వాటిపై ప్రధానంగా ఆధారపడి ఉన్న దేశాలకు, పునర్వినియోగ ఇంధన వనరులకు మళ్లేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఉదాసీనత చూపుతున్నాయి. ఆర్థిక సహాయం, అధునాతన సాంకేతికతల బదిలీ లేకుండా వర్ధమాన దేశాలు శిలాజ ఇంధనాల వినియోగాన్ని త్యజించడమనేది అసాధ్యం. ఇది జరగనంతవరకు కర్బన ఉద్గారాలు భారీ స్థాయిలో కొనసాగుతూ వాతావరణ మార్పు తీవ్రమవుతూనే ఉంటుంది. వాతావరణ మార్పును నిరోధించాలనే ఉమ్మడి లక్ష్యం కంటే సంపన్న దేశాలు తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్నంతవరకు శిలాజ ఇంధనాల వినియోగం దశల వారీ తగ్గింపుపై ప్రతిష్టంభన కొనసాగడం ఖాయం. కాప్ 30 'ది కాప్ ఆఫ్ ట్రూత్' అని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా అభివర్ణించారు. సత్య సదస్సు! నిజమే, అవని ఆర్తరావాన్ని ప్రతిధ్వనించింది. అంతే.

మానవాళిని మనుగడ ముప్పు నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన కాప్ సదస్సులు 'వార్షిక వాతావరణ ప్రహసనాలు' అని ఒక విజ్ఞులు అసహనం వ్యక్తం చేశారు. మరొకరు 'వాతావరణ సంత' అని చిరాకు పడ్డారు. ఈ అభియోగాలు పూర్తిగా అసత్యాలు కావు. ఈ కారణంగానే వాతావరణ మార్పుతో మానవాళి మనుగడకు ముంచుకువస్తున్న ముప్పుపై ఆందోళన చెందుతున్న దేశ దేశాల వైజ్ఞానికులు, మేధావులు కొత్త ఆలోచనలు చేస్తున్నారు. ఏటా ఒక దేశంలో నిర్వహించడానికి బదులుగా (ప్రతి ప్రధాన ఖండానికి ఒక్కోటి చొప్పున) ఐదు శాశ్వత వేదికలుగా రూపొందించాలని ఇటాలియన్ సామాజిక శాస్త్రవేత్త ఫ్రాన్సెస్కో గ్రిల్లో ప్రతిపాదించారు. క్లైమేట్ అడాప్టేషన్, క్లైమేట్ మిటిగేషన్, గవర్నెన్స్ ఆఫ్ ప్లేసెస్ (మహాసముద్రాలు, ఆర్కిటిక్, అంటార్కిటిక్) ఏఐ అండ్ క్లైమేట్, జియో ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కార బాధ్యతలను ఆ ఐదు వేదికలకు అప్పగించాలని గ్రిల్లో సూచించారు. వాతావరణ మార్పు వైపరీత్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్న సామాన్యులలో పర్యావరణ సమస్యల పరిష్కారంపై అవగాహనను పెంపొందించేందుకు కాప్ చర్చల గురించి సమగ్రంగా తెలియజేయవలసిన అవసరమున్నది. ఇందులో భాగంగా గతంలో గాంధీ విజ్ఞాన పరిషత్ రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిస్థితి : ప్రజానివేదిక–1990' లాంటి నివేదికలను ఏటా వెలువరించేందుకు తెలుగు రాష్ట్రాల లోని పర్యావరణ ఉద్యమకారులు పూనుకోవాలి.

కులాల లెక్కలతో జాతి నిర్మాణమా!?





■ రాహుల్ కుమార్

కఠోర వాస్తవాలకు అక్షర రూపాలుగా, సిద్ధాంతాలుగా నిలిచినవి ఒకపట్టాన అంతరించిపోవు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు ఫ్రెంచ్ విప్లవంతో హోరెత్తాయి. అవి సాకారం కావాలన్న తపన మనుషుల్లో బలంగా ఉండబట్టే ఇప్పటికీ అవి మారుమోగుతున్నాయి. మనుషులను తట్టిలేపుతూనే ఉన్నాయి. కడలి ఆటుపోటుల్లా కొంతకాలం వాటికి ప్రాబల్యం పెరగొచ్చు. తరగొచ్చు. పూర్తిగా సమసిపోవటమంటూ ఉండదు. సోషలిజం పేరుతో ఏర్పాటైన రాజ్యాలన్నీ కుప్పకూలిన తర్వాత మార్క్సిజం ప్రపంచం నుంచే అంతరించిపోతుందనే భావన కలిగింది. మానవమేధపై 150 ఏళ్ల మార్క్సిస్టు భావాల నియంతృత్వం తొలగిపోయిందని ఘనంగా ప్రకటనలూ వెలువడ్డాయి. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభాలు కుదిపివేస్తున్నప్పుడూ, పర్యావరణం ప్రమాద స్థాయికి చేరుతోందన్న హెచ్చరికలు ప్రబలుతున్నప్పుడూ పరిష్కారాల అన్వేషణలో ఆ భావాలకు ప్రాధాన్యం ఏదో విధంగా వస్తూనే ఉంది. వాటిల్లో కొన్ని ఇప్పటి పరిస్థితులకు సరిపోకపోవచ్చు. కొన్నిటిని పరిపుష్టం చేయాల్సి రావొచ్చు, కొన్నిటిని వదులుకోవాల్సీ రావొచ్చు. కానీ అన్నిటినీ పూర్తిగా పక్కకుపెట్టే స్థాయికి మానవ సమాజం ఇంకా ఎదగలేదు. సంపద పంపిణీలో న్యాయబద్ధత ఉండాలనే మనుషుల యుగయుగాల తపనకు అక్షరరూపం ఇవ్వబట్టే అవి అంతరించటం లేదు. అలాగే మన చేతల్లో, చేతనలో, మంచిచెడుల అంచనాల్లో, ఎక్కువ తక్కువ కొలతల్లో కులదృష్టి ప్రబలంగా ఉన్నంతవరకూ 90 ఏళ్ల క్రితం అంబేద్కర్ వ్యక్తంచేసిన భావాలకూ కాలదోషం పట్టదు. 'కులం పునాదులపై మీరు దేన్నీ నిర్మించలేరు. ఆ పునాదిపై జాతిని నిర్మించలేరు. ఆ పునాదిపై నైతికతను స్థాపించలేరు. ఆ పునాదిపై దేన్ని నిర్మించినా అది పగుళ్లు వారుతుంది. అసంపూర్ణంగా మిగిలిపోతుంది' అని అంబేద్కర్ ఆనాడు చేసిన హెచ్చరికలో ఎంతో ప్రగాఢత, కఠోర సత్యం ఉన్నప్పటికీ సమకాలీన భారతం అందుకు వ్యతిరేక దిశలోనే వెళుతోంది.

కులాలవారీగా మనుషులను లెక్కించి ఆ మేరకు పదవులూ, ఉద్యోగాలూ, విద్యా సీట్లనూ పంచాలన్న విధానాన్ని ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఎంచుకుంటే.. బీజేపీ కూడా తన సిద్ధాంతాలను సవరించుకుని పరుగు పందెంలో రెండడుగులు ముందుకే వేసి అందరినీ ఆశ్చర్యపరచింది. లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో కులగణన గురించి ఒక్క ప్రస్తావన కూడా లేకుండా జాగ్రత్తపడిన బీజేపీ, బిహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునో, కాంగ్రెస్‌కు గట్టి రాజకీయ ప్రచారాస్త్రం లేకుండా చేయాలనో దానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది చివర నుంచి ప్రారంభమయ్యే జనాభాగణనలో కులాలను లెక్కించటానికి మంత్రివర్గం ఆమోదముద్ర కూడా వేసేసింది.

కులాలకు సంబంధించి ఏ సమాచారాన్ని సేకరిస్తారన్న దాని గురించి ఇప్పటికింకా అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. కులాల వారీగా తలలెక్కలు తేల్చినంత మాత్రాన సామాజిక, ఆర్థికస్థితిగతులపై కొత్త వెలుగులేవీ ప్రసరించవు. ఎస్సీ, ఎస్టీల గణనకు సంబంధించి ఇప్పటి వరకూ అనుసరిస్తున్న పద్ధతులను మాత్రమే ఇతర కులాల తలలెక్కల విషయంలో అనుసరిస్తే ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియటం చాలా కష్టం. సంపదల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాపరంగా ఒక కులం ముందంజలో ఉందా? బాగా వెనుకబడి ఉందా? అన్నది తెలుసుకోలేం. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలు కులాల వారీగా ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది. వారి అక్షరాస్యతా శాతాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. పట్టణ, గ్రామీణాల్లో నివసించే శాతాలనూ గ్రహించొచ్చు. ఇంకాస్త కష్టపడి కూడికలు వేయగలిగితే విద్యా స్థాయిలనూ లెక్కించవచ్చు. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగంలో ఎంతమంది పనిచేస్తున్నారో కూడా తెలుసుకోవచ్చు. ఇంతకుమించి సమాచారాన్ని తెలుసుకోలేం.

కులంతో పాటు ఆర్థిక, ఉద్యోగ, విద్యా పరిస్థితులపై సర్వే చేపడితేనే కొంత సమగ్ర చిత్రం వస్తుంది. ఆస్తులు, సంపదల గురించి ప్రజలు పూర్తి సమాచారం వెల్లడించరు. అందుకే అది పరిమిత చిత్రంగానే ఉంటుంది. ఈ పరిమితి ఉన్నా బిహార్‌లో చేపట్టిన కుల సర్వేలోనే కొన్ని అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని బహిరంగపరచారు. మిగతా సర్వేల విషయంలో అదీ జరగటం లేదు. తెలంగాణలో చేపట్టిన సర్వేలో తేలిన కీలక విషయాలను ఇప్పటికీ వెల్లడించలేదు. కర్ణాటకలోనూ అదే చేశారు. రాజకీయంగా సున్నితమనుకున్న సమాచారాన్ని తొక్కిపట్టటం ఒక అలవాటుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరించటానికి ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయలేదు. అయిదున్నర ఏళ్ల కసరత్తు చేసి రూపొందించిన నివేదికను వెల్లడించటానికి రాజకీయ అవసరం ఇంకా రాలేదు. అనధికారికంగా వెల్లడైన సమాచారం ప్రకారం కేంద్ర జాబితాలో 2,633 బీసీ కులాలు ఉంటే అందులో కేవలం 40 కులాలు.. మొత్తం రిజర్వేషన్లలో 50 శాతాన్ని దక్కించుకున్నాయి. 994 కులాలు ఒక్క ఉద్యోగాన్నీ, ఒక్క విద్యా సీటునూ పొందలేదు. 1400 కులాలకు 1 శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం లభించింది. బిహార్ కుల సర్వేలో వెల్లడైన విషయాలను పరిశీలించినా తేలేది అదే. అక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు 20,49,370 ఉంటే 6,21,481 ఉద్యోగాల్లో ఓబీసీలు (జనాభాలో 27శాతం) ఉన్నారు. ఓబీసీల కంటే జనాభాలో ఎక్కువ ఉన్న ఈబీసీలకు (36శాతం) 4,61,725 ఉద్యోగాలు మాత్రమే దక్కాయి. మొత్తంగా చూస్తే బీసీలకు ఉద్యోగాల్లో 52శాతం వరకూ ప్రాతినిధ్యం లభించినా విడివిడి కులాల పరంగా లెక్కిస్తే నాలుగైదు కులాల ఆధిపత్యమే కనపడుతుంది.

జనాభా సేకరణలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి లభ్యమైన సమాచారాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా ప్రజలముందు పెట్టటం లేదు. ఆ వర్గాలకు సంబంధించి విద్యా, ఉద్యోగ విషయాలతో పాటు ఇళ్లకూ, ఇతర సౌకర్యాలకు సంబంధించిన (వాహనాలు, ఫోన్, టీవీ తదితరాలు) కులాలవారీ సమాచారాన్ని కావాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం తయారుచేయగలదు. కానీ దానికీ పూనుకోలేదు. కులాల మధ్య అవాంఛిత పోటీ పెరుగుతుందనీ, వర్గీకరణ డిమాండ్లు ఊపందుకుంటాయనే మిషతో వాటికి దూరంగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని కులాల జనాభాను లెక్కించాలన్న నిర్ణయంతో భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వానికి ఆ వెసులుబాటు ఉండకపోవచ్చు. మొట్టమొదటిసారిగా 75శాతం పైగా జనాభాకు సంబంధించి కులాలవారీ లెక్కల వెల్లడితో ఎన్నో రూపాల్లో వర్గీకరణ డిమాండ్లు ఊపందుకుంటాయి. ఇక రాజకీయ డిమాండ్లు కూడా ఒక పట్టాన పరిష్కరించలేని సమస్యలుగా మారతాయి. కులలెక్కలతో ప్రతి సమస్యనూ ఆ కోణంలో చూసే దృక్పథం పెరిగిపోయే ప్రమాదమూ ఉంటుంది. రాజకీయ కారణాలతో బహిరంగపర్చని సమాచారాన్ని వెల్లడించాలనే ఒత్తిళ్లూ ఎక్కువవుతాయి.

కులలెక్కలతో ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేటురంగంలో కూడా ఎవరు ఎక్కడ ఉన్నారో తేల్చాలనే డిమాండ్లు ఊపందుకుంటాయి. అతితక్కువ ప్రాతినిధ్యం ఉన్న కులాలు ఎక్కువగా దాన్ని సాధించటానికి కొత్త మార్గాలను అన్వేషిస్తాయి. మూడు నాలుగు వర్గీకరణలు ఉన్నచోట పది వర్గీకరణలు కావాలనే డిమాండ్లు మొదలవుతాయి. ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు పరిమితం అయిపోతున్న నేపథ్యంలో ప్రైవేటురంగంలో చోటు కల్పించాలనే ఒత్తిడి పెరుగుతుంది. ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వటంలోనూ సంక్షిప్తలు తలెత్తుతాయి. రెండుమూడు కులాలు జట్టుకట్టి ఫలితాలను శాసించటానికి పూనుకోవచ్చు. మరో రెండు మూడు కులాలు ప్రత్యర్థి శిబిరంగా మారి వ్యవహారాలు నడపొచ్చు. కులాల లెక్కలు జిల్లాల స్థాయిల్లో లభ్యమైన తర్వాత తలెత్తే రాజకీయ పెనుగులాటలు ఏ విధంగా ఉంటాయో స్పష్టంగా ఇప్పటికిప్పుడు అంచనా వేయలేకపోయినా కులదృక్పథాలను అవి విపరీతంగా పెంచుతాయి. ఇక ప్రతి పదేళ్లకూ కులలెక్కలు తీయటం సర్వసాధారణమైతే తలెత్తే పరిస్థితి మన ఆలోచనలను మరింతగా కులమయం చేస్తుంది.

రాజకీయ ప్రయోజనాన్ని ఆశించకుండా ఏ విధానాన్నీ ఏ పార్టీ తలకెత్తుకోదు. కులాలు ఆధారంగా ప్రత్యేక గుర్తింపూ, రాజకీయ డిమాండ్లూ తలెత్తకుండా చూడాలన్నది హిందూత్వ సాంస్కృతిక జాతీయవాదంలో ప్రధానంగా ఉంటుంది. కులగణనతో పెరిగే కులచైతన్యానికి ఆ సాంస్కృతిక జాతీయవాదానికి ఒకపట్టాన పొసగదు. ఈ సమస్య పొంచి ఉన్నా హిందూత్వ అజెండాగా ఉన్న బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కులగణనకు మొగ్గు చూపింది. ఎందుకిలా చేసిందని ప్రశ్నించుకుంటే కులగణనతో లభ్యమయ్యే సమాచారాన్ని తన ప్రయోజనాలకు అనుగుణంగా వెల్లడించే చాకచక్యం తనకుందన్న భావన కారణం కావొచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ అజెండా లేకుండా చేయాలన్న లక్ష్యం ఎలాగూ ఉండనే ఉంది. హిందూత్వకు అడ్డంకి అనుకుంటే కుల గణన సమాచారాన్ని ఓసీలు ఇంతమంది.. బీసీలు ఇంత మంది.. అన్నదానికే పరిమితం చేసి (విడివిడి కులాలవారీ కాకుండా) జాతి సమైక్యత పేరుతో మిగతా సమాచారాన్ని వెల్లడించకుండా ఉండే అవకాశాన్నీ కొట్టేయలేం. 2011లో 5000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చుపెట్టి చేపట్టిన సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేలో సేకరించిన కుల లెక్కలను పనికిరానివిగా తేల్చి మూలనపడేయటమే ఇందుకు నిదర్శనం. నిజానికి అప్పటి కులలెక్కల్లో తలెత్తిన చిక్కుముడులను విప్పి సమాచారాన్ని అందుబాటులో ఉంచటం అసాధ్యమేమి కాదు. రాజకీయ సంకల్పం లేకపోవటంతో అది పరిష్కరించలేని చిక్కుముడిగా మారిపోయింది. దేశవ్యాప్తంగా ఆనాటి సర్వేలో 45 లక్షల కులాలు నమోదవ్వటం అసంబద్ధమని అన్నారే గానీ దానికి కారణం ఎవరనే విషయంపై మౌనం దాల్చారు.

కొన్ని కులాలు అంతర్గతంగా అతితక్కువ ఆర్థిక అంతరాలతో మొత్తంగా వెనుకబడి ఉన్న పరిస్థితి ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. కానీ అన్ని కులాలకు అది వర్తించదు. బీసీ కేటగిరిలో ఉన్న కులాలన్నీ ఆ పరిస్థితుల్లో లేవు. ఎన్నో కులాల్లో విపరీతమైన ఆర్థిక అంతరాలూ నెలకొన్నాయి. వివిధచోట్ల ఆధిపత్య స్థానాల్లోనూ ఉన్నాయి. అందుకే ఆర్థిక పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లను కల్పించాలనే డిమాండ్లు బలం పుంజుకుంటున్నాయి. ఎస్సీ ఎస్టీల్లో కూడా సంపన్న శ్రేణులను మినహాయించి రిజర్వేషన్లను వర్తింపచేయాలనే సూచనలు గట్టిగా వస్తున్నాయి. కులగణనతో రాజకీయ ప్రయోజనం కలగొచ్చు. కానీ కులదృష్టి పెరిగిపోతే అంబేద్కర్ హెచ్చరించినట్లు ఆ పునాదిపై స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాల ప్రాతిపదికన జాతిని (నేషన్) ఎన్నటికీ నిర్మించలేం. ఇప్పటికే అంబేద్కర్ ఆశించిన కులనిర్మూలనలూ కులరహితాలూ రాజకీయ రంగాన అప్రాధాన్యతలైపోయి అంతటా కులసహితాలూ, కులసమ్మోహనాలూ, కులసమ్మేళనాలూ ఉరకలేస్తున్నాయి. ఆ ఉరకల ఉధృతికి ప్రజాస్వామ్య విలువలే పలచనైపోతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> కులగణనతో రాజకీయ ప్రయోజనం కలగొచ్చు. కానీ కులదృష్టి పెరిగిపోతే అంబేద్కర్ హెచ్చరించినట్లు ఆ పునాదిపై స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాల ప్రాతిపదికన జాతిని (నేషన్) ఎన్నటికీ నిర్మించలేం. ఇప్పటికే అంబేద్కర్ ఆశించిన కులనిర్మూలనలూ కులరహితాలూ రాజకీయ రంగాన అప్రాధాన్యతలైపోయి అంతటా కులసహితాలూ, కులసమ్మోహనాలూ, కులసమ్మేళనాలూ ఉరకలేస్తున్నాయి. ఆ ఉరకల ఉధృతికి ప్రజాస్వామ్య విలువలే పలచనైపోతున్నాయి.

> కులాల లెక్కలు జిల్లాల స్థాయిల్లో లభ్యమైన తర్వాత తలెత్తే రాజకీయ పెనుగులాటలు ఏ విధంగా ఉంటాయో స్పష్టంగా ఇప్పటికిప్పుడు అంచనా వేయలేకపోయినా కులదృక్పథాలను అవి విపరీతంగా పెంచుతాయి. ఇక ప్రతి పదేళ్లకూ కులలెక్కలు తీయటం సర్వసాధారణమైతే తలెత్తే పరిస్థితి మన ఆలోచనలను మరింతగా కులమయం చేస్తుంది.

మహిళా భద్రతే నాగరికతకు నిదర్శనం!

ఒక దేశం, రాష్ట్రం, సమాజం ఎంత అభివృద్ధి సాధించిందో తెలుసుకోవాలంటే ఆకాశాన్ని తాకే భవనాలు, విలాసవంతమైన వాహనాలు, ఆధునిక సాంకేతికత వీటిని చూసి అంచనా వేయటం కాదు; అక్కడి మహిళలు ఎంత భద్రంగా, గౌరవంగా, స్వేచ్ఛతో జీవిస్తున్నారో చూస్తే సరిగ్గా తెలుస్తుంది. మహిళలు భయం అనే భారాన్ని మోయకుండా, తమ హక్కులతో, తలెత్తుకొని నడిచే పరిస్థితి ఉన్నప్పుడే ఆ సమాజం నిజమైన పురోగమనాన్ని సాధించినట్టు భావించాలి. ఆడపిల్లలు రోడ్లపై అభద్రతాభావం లేకుండా నడవగలిగితే; వారు విద్యలో, ఉపాధిలో, స్వతంత్ర ఆలోచనలో ఏ అడ్డంకీ లేకుండా రాణించగలిగితే, వారిపై హింస, వివక్ష, అవమానాలు లేని వాతావరణం ఏర్పడితే అదే అసలైన నాగరికత. మహిళను గౌరవించే చోట విలువలు నిలుస్తాయి, న్యాయం బతుకుతుంది, మానవత్వం వికసిస్తుంది. అందుకే మహిళకు రక్షణ, గౌరవం, స్వేచ్ఛ కలిగిన సమాజమే నిజమైన అభివృద్ధికి ప్రతిబింబం.

నవంబర్ 25వ తేదీని మహిళలపై హింస నిర్మూలన దినంగా ప్రపంచం గుర్తించింది. మన సమాజం, మన వ్యవస్థ, మన ఆలోచనల్లో ఇంకా పరిష్కారం పొందాల్సిన అతిపెద్ద, అత్యంత బాధాకరమైన సమస్య స్త్రీలపై హింస. మనం సాంకేతికతలో ఎంత వేగంగా ముందుకెళ్లినా, శాస్త్రంలో ఎన్ని శిఖరాలు అధిరోహించినా, మహిళల భద్రత, గౌరవంపై ప్రశ్నలు నేటికీ జవాబు లేకుండానే మిగిలి ఉన్నాయి.

స్త్రీపై హింసను మనం కేవలం కంటికి కనిపించే శారీరక దాడిగా మాత్రమే చూడకూడదు. దాని పరిధి చాలా విస్తృతమైంది, ప్రమాదకరమైంది. అవమానించడం, మానసిక వేధింపులు, ఆర్థిక నియంత్రణ, వరకట్నం వేధింపులు, లైంగిక దాడులు, ట్రాఫికింగ్, ఆన్‌లైన్ హరాస్‌మెంట్, సైబర్ మోసం... ఇలాంటివి అన్నీ హింసకు రూపాలే. చట్టాలు మారాయి, సమాజం మారుతోందని మనం ధైర్యంగా చెప్పుకుంటున్నా, వాస్తవం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఈ విషయంలో అంతర్జాతీయ గణాంకాలను పరిశీలిస్తే, ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అంచనా ప్రకారం, ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒక మహిళ తన జీవితంలో ఏదో ఒక దశలో శారీరక, లైంగిక హింసను అనుభవించింది. ఈ భయంకరమైన విషయం సమాజ సామూహిక వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోంది.



> మన సమాజం, మన వ్యవస్థ, మన ఆలోచనల్లో ఇంకా పరిష్కారం పొందాల్సిన అతిపెద్ద, అత్యంత బాధాకరమైన సమస్య స్త్రీలపై హింస. మనం సాంకేతికతలో ఎంత వేగంగా ముందుకెళ్లినా, శాస్త్రంలో ఎన్ని శిఖరాలు అధిరోహించినా, మహిళల భద్రత, గౌరవంపై ప్రశ్నలు నేటికీ జవాబు లేకుండానే మిగిలి ఉన్నాయి.

భారతదేశం విషయానికి వస్తే, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB–2023) గణాంకాలు దేశంలో మహిళలపై నేరాల రేటు ఇంకా ఆందోళనకరంగానే ఉన్న వాస్తవాన్ని చూపిస్తున్నాయి. మరీ దురదృష్టకరం ఏమిటంటే, ఈ లెక్కలు కేవలం పోలీసు రికార్డులలో నమోదైన కేసులు మాత్రమే. వీటి వెనుక భయంతోనో, బైటికి తెలిస్తే కుటుంబ గౌరవం పోతుందనే భీతితోనో నిశ్శబ్దంగా మిగిలిపోయిన వేలాది కేసుల వాస్తవం ఉంది. మన రాష్ట్రంలో కూడా 2022లో 25,503 కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య తరువాతి సంవత్సరంలో కొంత తగ్గినట్లు కనిపించినా, అది పరిస్థితి మెరుగైందన్న సూచనగా తీసుకోలేము; అది ఫిర్యాదు చేయడంపై మహిళలకున్న భయానికీ, వ్యవస్థపై తగ్గిన నమ్మకానికీ సంకేతమై ఉండొచ్చు.

మహిళలపై హింసకు అసలు కారణం మనుషుల ఆలోచనల్లోనే ఉన్నది. ఎందుకు ఆ సమయంలో బయటికి వెళ్లింది? ఎందుకు అలాంటి దుస్తులు వేసుకుంది? అనే ప్రశ్నలు అడిగి బాధితురాలిపైనే నింద వేసే ఈ విషపూరిత ఆలోచనా ధోరణి నేరస్థుడికి బలాన్ని ఇస్తోంది. ఈ ధోరణిని సమూలంగా పెకిలించడమే మన తక్షణ కర్తవ్యం. భారత రాజ్యాంగం మహిళలకు సంపూర్ణ సమాన హక్కులు ఇచ్చింది. గృహహింస నుండి సైబర్ క్రైమ్ వరకు అనేక కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయి. అయినా, న్యాయం ఆలస్యం అవుతూనే ఉంది. నేరం చేసినవాడు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతుంటే, నేరం ఎదుర్కొన్న స్త్రీ మౌనంగా బ్రతకాల్సిన పరిస్థితి ఉన్నది.

ఈ నేపథ్యంలో మహిళా కమిషన్ అత్యంత కీలకపాత్రను పోషిస్తోంది. ఇక్కడ ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి, చట్ట సహాయం అందిస్తూ, కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తున్నాం. విద్యాసంస్థలు, కార్యాలయాలలో అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి. అయితే, ఈ కృషికి ప్రభుత్వ సాయం కూడా అందడం మరింత బలాన్ని ఇస్తుంది. గత ఏడాదిన్నరగా ప్రభుత్వం మహిళల భద్రత కోసం శక్తి యాప్, సఖి నివాస్ కేంద్రాలు, మహిళలు–పిల్లల కోసం ప్రత్యేక రక్షణ వింగ్, శక్తి సదన్ వంటి సేవలను ప్రారంభించడంతో పాటు మహిళా కమిషన్‌తో కలిసి చట్ట అవగాహన, కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత బలోపేతం చేసింది. ఈ చర్యల ప్రభావంతో రాష్ట్రంలో మహిళలపై నేరాలు సుమారు 12శాతానికి తగ్గాయి. అత్యవసర స్పందన వేగవంతం అయ్యింది. అలాగే గత కొద్ది నెలల్లో 169 మంది నేరస్థులు శిక్షించబడ్డారు. ఇవన్నీ ప్రభుత్వ చర్యలు ఫలితాల దిశగా సాగుతున్నాయనటానికి సంకేతాలు. మహిళా భద్రత ర్యాంకింగ్స్‌లో విశాఖ దేశంలో అగ్రస్థానంలో నిలవడం, ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి అనడానికి మంచి ఉదాహరణ.

మహిళలపై హింసను అరికట్టాలంటే, ముందుగా మారాల్సింది చట్టాలు కాదు మనలోని కుటుంబ విలువలు, సామాజిక దృక్పథం. చిన్నప్పటి నుండే పిల్లలకు గౌరవం నేర్పాలి. పాఠశాలలో లింగ సమానత్వం పాఠ్యాంశంగా ఉండాలి. నేరానికి జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలి, న్యాయవ్యవస్థ వేగవంతం కావాలి. ముఖ్యంగా, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండే మహిళ మరింత ధైర్యంగా నిలబడగలదు. సైబర్ హింస పెరుగుతున్న ఈ యుగంలో, డిజిటల్ భద్రత బోధన ప్రతి మహిళకు, యువతికి అత్యవసరం.

స్త్రీ భద్రతని స్త్రీల సమస్యగా కాదు, సమాజం, ప్రభుత్వం, వ్యవస్థల ఉమ్మడి బాధ్యతగా గుర్తించే రోజు వచ్చినప్పుడు మాత్రమే ఈ ప్రపంచం న్యాయానికి దగ్గరవుతుంది. ఈ దిశగా నవంబర్ 25 కేవలం ఒక సంప్రదాయం కాదు; ఇది సమాజానికి గట్టి హెచ్చరిక, ఒక బలమైన పిలుపు, ఒక మార్పుకు లభించిన మంచి అవకాశం. మహిళ ఆత్మవిశ్వాసంతో, భయంలేకుండా, గౌరవంగా జీవించగలిగినప్పుడు అది నాగరిక సమాజం తన ప్రమాణాన్ని నిలబెట్టుకున్న విలువైన రుజువు.

• శైలజ రాయపాటి
రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

(నేడు మహిళలపై హింస నిర్మూలన దినం)

అవినీతి జాడ్యం వదిలేదెన్నడో!

ఈ రోజుల్లో అవినీతి అనే మాట మనకు పత్రికల్లో, టీవీ వార్తల్లో, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా కనిపిస్తోంది, వినిపిస్తోంది. కానీ దురదృష్టమేమిటంటే, చాలామంది ప్రజలు దీన్ని పెద్ద సమస్యగా చూడటం లేదు! 'ఇది మన సమాజంలో సాధారణమైన విషయం' అని భావిస్తున్నారు. అవినీతి అంటే.. 'ఎవరికైనా అప్పగించిన అధికారాన్ని లేదా బాధ్యతను తమ సొంత లాభం కోసం వాడుకోవడం.' ఇది న్యాయం, సమానత్వం, విశ్వాసం వంటి విలువలను నాశనం చేస్తుంది. ఇది కేవలం డబ్బు తీసుకోవడం మాత్రమే కాదు, బంధుప్రీతి ఆధారంగా పనిచేయించడం లేదా నిబంధనలను తారుమారు చేయడం కూడా అవినీతికి ప్రతిరూపాలే. ఏదైనా వృత్తిలో అనైతికంగా వ్యవహరించడం కూడా ఒక రకమైన అవినీతే.

అవినీతి ఎన్నో రూపాల్లో ఉంటుంది. అందులో ముఖ్యమైనవి: లంచం– పని సులభంగా చేయించుకోవడానికి డబ్బు ఇవ్వడం; దుర్వినియోగం– ప్రభుత్వ నిధులను తమ వ్యక్తిగత పనులకు మళ్లించడం; మోసం– తప్పుడు బిల్లులు, తప్పుడు రికార్డులు చూపించి లాభం పొందడం; దోపిడీ– అధికారం వాడుకుని భయపెట్టి డబ్బు దోచుకోవడం; నెపోటిజం, క్రోనిజం– అర్హుల కంటే తమవారికి ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇవ్వడం; రాజకీయ అవినీతి– ప్రజా వనరులను పార్టీ ప్రయోజనాల కోసం వాడుకోవడం; స్పీడ్ మనీ– సాధారణ సేవలు త్వరగా చేయించుకోవడానికి ఇచ్చే చిన్న లంచాలు; స్టేట్ క్యాప్చర్– పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు కలిసి ప్రభుత్వ విధానాలను తమకు అనుకూలంగా మలచుకోవడం; ప్రొక్యూర్‌మెంట్ అవినీతి– టెండర్లు, కాంట్రాక్టులు తమవారికి ఇచ్చే విధంగా సర్దుబాటు చేయడం.

అవినీతి మూడు స్థాయిల్లో కనిపిస్తుంది: చిన్న అవినీతి (రోజువారీ లంచాలు), పెద్ద అవినీతి (కోట్ల రూపాయల మోసాలు), వ్యవస్థాగత అవినీతి (సమాజం మొత్తం అవినీతి పద్ధతిలో పనిచేయడం)! ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అవినీతి ఇప్పుడు ప్రజల చర్చలో ముఖ్యాంశం. చిన్న లంచాల నుంచి కోట్ల రూపాయల కుంభకోణాల వరకూ జరిగిన అవినీతితో రెండు రాష్ట్రాలూ అనేక రకాలుగా నష్టపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో రవాణా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో 'స్పీడ్ మనీ' సాధారణమైంది. ఏసీబీ తరచూ దాడులు చేస్తోంది, కానీ పెద్దగా మార్పు కనిపించడం లేదు. తెలంగాణలో ఇంజనీర్లు, మునిసిపల్ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కోట్ల రూపాయల విలువైన అక్రమ ఆస్తులతో పట్టుబడుతున్నారు. కానీ కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి ఉండిపోతున్నాయి. శిక్షలు మాత్రం అరుదుగా పడుతున్నాయి.

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా అవినీతి కేసులు బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో: గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ కోట్ల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అవేగాక– అసలు మద్యం, కల్తీ మద్యం, తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో వాడిన నెయ్యి... లాంటి ఎన్నో విషయాల్లో అవినీతి ఆరోపణలు, వివిధ దర్యాప్తులు వంటి వార్తలు రోజూ చదువుతూనే ఉన్నాం. తెలంగాణలో: గొర్రెల పంపిణీ పథకంలో, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాజెక్టులో పని చేసిన ఇద్దరు సీనియర్ ఇంజనీర్లు తమ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఏసీబీ కూడా తేల్చింది.

'ఏసీబీ తరచుగా దాడులు చేసినా అవినీతి ఎందుకు తగ్గడం లేదు?' దీనికి ప్రధాన కారణాలు అయిదు: రాజకీయ జోక్యం– ఏసీబీ స్వతంత్రంగా పనిచేయలేకపోవడం; చట్టపరమైన లోపాలు– నోటిఫికేషన్‌లు సరిగ్గా లేక కేసులు రద్దు కావడం; శిక్షణ లోపం– సాంకేతిక, ఆర్థిక విచారణలపై అవగాహన లేక ఆధారాలు బలహీనపడడం; పరస్పర మైత్రి– కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కలిసి వ్యవస్థగా పనిచేయడం; టెక్నాలజీ దుర్వినియోగం– 'సర్వర్ డౌన్' అని చెబుతూ డిజిటల్ సేవల్లో కొత్త రకాల లంచాలు వసూలు చేయడం. ఇది కేవలం చట్టపరమైన లోపం మాత్రమే కాదు, రాజకీయ–ఆర్థిక వ్యవస్థలో లోపం కూడా. చిన్న లంచాలను కూడా సాధారణంగా చూడడం ఇప్పుడు సంస్కృతిలో భాగమైంది. 'ఇలా లేకపోతే పని జరగదు' అన్న భావన బలపడింది. అవినీతిని తగ్గించాలంటే మాటలతో కాదు, సంస్థాగత మార్పులు చేయడం అవసరం. అందుకు ముఖ్యంగా చేయాల్సినవి: ఏసీబీకి స్వతంత్రత– స్వతంత్ర బడ్జెట్, నియామకాలు; చట్టాన్ని బలపరచడం– అన్ని ఏసీబీ కార్యాలయాలను పోలీస్ స్టేషన్‌లుగా ప్రకటించడం, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు; ఆస్తుల వెల్లడి– ఉన్నతాధికారులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించడం; పారదర్శక టెక్నాలజీ– ప్రాజెక్టు వివరాలు ఆన్‌లైన్‌లో ప్రజలకందుబాటులో ఉంచడం; దోచుకున్న ఆస్తుల స్వాధీనం– లంచం కేసుల్లో కేవలం అరెస్టులు కాకుండా ఆస్తులు తిరిగి ప్రభుత్వానికి ఇప్పించడం.

అవినీతి నిరోధక సంస్థలను రాజకీయ ప్రభావం నుంచి ప్రభుత్వం బయటకు తేవాలి. విజిల్ బ్లోవర్ల రక్షణ, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు, ఆర్టీఐ ద్వారా సమాచారం విడుదల తప్పనిసరిగా ఉండాలి. ప్రజలూ మారాలి. లంచాలు ఇవ్వకుండా అధికారులను నిలదీయాలి. డిజిటల్ రసీదులు తీసుకోవాలి. ఫిర్యాదు చేయడానికి భయపడకూడదు. మీడియా, సామాజిక సంస్థలు అవినీతి కేసులను బహిర్గతం చేయాలి. ప్రతి అవినీతి కేసూ సామాన్య ప్రజల విశ్వాసానికి గాయమే అని గుర్తుపెట్టుకోవాలి. ఏసీబీని రాజకీయ ఆయుధం కాకుండా ప్రజల రక్షకసంస్థగా మార్చడం ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. చట్టం అందరికీ సమానంగా పనిచేసే రోజు వచ్చినప్పుడు మాత్రమే, అవినీతి జాడ్యం తగ్గుతుంది. 'మితిమీరిన ప్రజాస్వామ్యం కూడా ఒక రకంగా ఈ అవినీతి మహమ్మారి వృద్ధికి దోహదం చేస్తున్నది' అనే భావన కూడా ఉంది. మన దేశం, రాష్ట్రాల పురోభివృద్ధి గురించి సామాన్య ప్రజలు కంటున్న కలలు ఎండమావులు కాకూడదంటే అవినీతిని కూకటి వేళ్లతో పీకివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

■ ప్రొ. అప్పారావు పొదిలె
పూర్వ ఉపకులపతి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

> అవినీతి నిరోధక సంస్థలను రాజకీయ ప్రభావం నుంచి ప్రభుత్వం బయటకు తేవాలి. విజిల్ బ్లోవర్ల రక్షణ, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు, ఆర్టీఐ ద్వారా సమాచారం విడుదల తప్పనిసరిగా ఉండాలి. ప్రజలూ మారాలి. లంచాలు ఇవ్వకుండా అధికారులను నిలదీయాలి. డిజిటల్ రసీదులు తీసుకోవాలి. ఫిర్యాదు చేయడానికి భయపడకూడదు.







వెలగపూడి లే అవుట్లలో నిర్మాణ పనులు

జోరుగా లేఅవుట్ల పనులు

- రైతుల ప్లాట్ల అభివృద్ధిపై సీఆర్డీఏ దృష్టి
- రాజధానిలోని 15 జోన్లలో మొదలైన పనులు
- అంతర్గత రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్(ఎల్పీఎస్) లేఅవుట్ల అభివృద్ధిపై ఏపీసీఆర్డీఏ దృష్టి సారించింది. రాజధాని పరిధిలోని లేఅవుట్లను మొత్తం 18 జోన్లుగా విభజించి అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే 15 జోన్లలో టెండరు ప్రక్రియ పూర్తై లేఅవుట్ల అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పనులు కొంచెం నెమ్మదించినా, గత 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి వచ్చిన నిధులు, హడ్కో రుణాలతో ఎల్పీఎస్ ప్లాట్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటికి సంబంధించిన టెండర్లు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆమోదించారు. దీంతో ఎల్పీఎస్ ప్లాట్లలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా వ్యవస్థ, విద్యుత్, కమ్యూనికేషన్ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం రోడ్లు, యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పశ్చిమ అమరావతి గ్రామాలైన అనంతవరం, తుళ్లూరు, అబ్బరాజుపాలెం, బోరు పాలెం, దొండపాడు, నెక్కల్లులోని ఎల్‌పీఎస్ ప్లాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వెలగపూడి, లింగా యపాలెం, మందడం, నేలపాడుల్లో రెండు నెలలుగా పనులు జరుగుతున్నాయి. మరో 3 చోట్ల టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్టీపీ ప్యాకేజీ చోట్ల టెండర్లకు పిలవనున్నారు. అందుకోసం రూ.20,407 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ పనులు త్వరగా పూర్తై రైతులకు ప్లాట్లు అందుబాటులోకి వస్తే ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సమాంతరంగా ప్రైవేటు నిర్మాణ పనులు కూడా మొదలవుతాయి. ఫలితంగా రాజధాని నిర్మాణ పురోగతి రెట్టించిన వేగంతో పెరుగుతుంది.



లింగాయపాలెం లే అవుట్లలో జరుగుతున్న పనులు

గ్రామాలు.. జోన్లు ఇలా..

నవులూరు పరిధిలోని-జోన్ 12, కురగల్లు, నీరుకొండ పరిధిలోని-జోన్ 10, నిడమర్రు పరిధిలోని -జోన్ 12ఏ, నేలపాడు, శాఖమూరు, పరిధిలోని- జోన్ 3, వెంకటపాలెం పరిధిలోని- జోన్ 9ఏ, 10, బోరుపాలెం, అబ్బరాజుపాలెం పరిధిలోని- జోన్ 5ఏ, రాయపూడి, కొండమరాజుపాలెం పరిధిలోని- జోన్ 6, పిచ్చుకలపాలెంలోని- జోన్ 5బీ, దొండపాడులోని- జోన్ 5ఏ. ఐనవోలులోని- జోన్ 10, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలోని-జోన్ 6, మల్కాపురంలోని- జోన్ 9, నెక్కల్లులోని- జోన్ 1, తుళ్లూరులోని- జోన్ 2, 5సీ, 5డీ, 5బీ, అనంతవరంలోని- జోన్ 4, 5సీ, వెలగపూడిలోని- జోన్9, 7, మందడంలోని జోన్- 9ఏ, 7లో లే అవుట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాగా ఈ నెల 14న కృష్ణయ్యపాలెం, పెనుమాక, వెంకటపాలెం, ఉండవల్లి గ్రామాల్లోని- జోన్ 8లోని ఎల్‌పీఎస్ ప్లాట్లకు సంబంధించిన టెండరు ప్రకటనను కూడా సీఆర్డీఏ విడుదల చేసింది. కాగా ఉండవల్లి పరిధిలోని- జోన్ 11కు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది.



మూడు అడుగులకు పైగా కుంగిన రహదారి

తారుమారైన రోడ్డు!

- నిలువునా తెగినట్లు ఒక వైపు కుంగిన రహదారి
- చందోలు మార్గంలో వాహనాల రాకపోకలు బంద్

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెనాలి - చందోలు మార్గంలో.. పెదపూడి వంతెన - మండూరు వంతెన మధ్య రహదారి సగం భాగం మూడు అడుగులకు పైగా కుంగిపోయింది. దీంతో ఈ మార్గంలో లారీలు, లోడు ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కృష్ణా పశ్చిమ డివిజన్, తూర్పు - నిజాంపట్నం కాల్వల మధ్య ఉన్న ఈ రహదారిలో ఎన్నో ఏళ్లుగా ఒక ప్రదేశం జఠిలంగా మారి అధికారులకు తలనొప్పి తెస్తోంది. నిజాంపట్నం కాల్వకు రిటైనింగ్ వాల్ నిర్మించి పదేళ్ల క్రితం రహదారిని చక్కదిద్దారు. పెదపూడి వంతెన దిగువ ప్రాంతంలో నిర్మించిన రిటైనింగ్ వాల్ కాల్వలోకి ఒరిగిపోవడంతో.. 100 మీటర్ల మేరకు రహదారి కుంగిపోయింది. దీనికి తరచూ నిధులు కేటాయించి మరమ్మతులు చేస్తున్నారు అయినప్పటికీ ఈ ప్రాంతంలో రహదారి కుంగిపోతూనే ఉంది. దానికి కొద్ది దూరంలో మరికొంత దూరం మేర రహదారి మూడు అడుగులకు పైగా కిందకు దిగిపోయింది. ఒక వైపు ఎత్తుగా, మరో వైపు లోతుగా ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కుంగిపోయిన విషయం తెలియని భారీ వాహనదారులు అక్కడ వరకు వచ్చి.. వెనక్కి వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. రహదారి ఇలా రోడ్డు సగ భాగం కుంగిపోయినా.. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదంటూ..వారెంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

సగటు వృద్ధి లక్ష్యం 15 శాతం

- ఆర్థిక వ్యవస్థను నడిపించేది వ్యవసాయమే
- రైతన్నా.. మీ కోసంలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటున సంవత్సరానికి 15 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారం చినపలకలూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయం, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యరంగాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయన్నారు. సమర్థమైన నీటి నిర్వహణతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులు మార్చు కోవాలన్నారు. చిరు ధాన్యాల సాగు మరింత పెరగాలని, ప్రకృతి వ్యవసాయం పెద్దఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రి టెక్‌ను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై 100 శాతం సబ్సిడీని ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు పాల్గొని వ్యవసాయ, అనుబంధ శాఖల పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని కోరారు. రైతు సమస్యలను పరిష్కరించడానికి వారానికి రెండు రోజులు, రోజుకు రెండు గ్రామాల చొప్పున ఖరీఫ్ 4 నెలలు, రబీలో 4 నెలలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కిసాన్ డ్రోన్లతో కూడిన గ్రామ స్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఖరీఫ్‌లో 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోళ్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటలోనే చెల్లింపులు జరిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, ఏడీ నాగభైరు మోహన్ రావు, ఏఓ బుల్ల కిశోర్ పాల్గొన్నారు.

పదోన్నతుల పండుగ

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు



- డిప్యూటీ ఎంపీడీవోలుగా 86 మందికి అవకాశం
- స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు కేటాయింపు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పంచాయతీల పాలనలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. పల్లె వాసులకు మెరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ల స్థానంలో పంచాయతీలకు గ్రేడ్‌లను అమలులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో కార్యదర్శులు.. సిబ్బంది క్యాడర్‌లో మార్పులు చేసింది. కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులుగా మార్పు చేసింది. ఆదాయం.. జనాభా ఆధారంగా పంచాయతీలకు కేటాయించిన గ్రేడ్‌ల ప్రకారం అధికార సిబ్బందిని కేటాయిస్తోంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటి ఎంపీడీవోలను నియమించనుంది. కార్యదర్శులకే డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రమోషన్ పొందిన కార్యదర్శుల జాబితాను పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 86 మంది కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించాయి.

గ్రేడ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే..

గుంటూరు జిల్లాలో అత్యధికంగా కార్యదర్శులకు డీప్యూటీ ఎంపీడీవోల పదోన్నతులు కల్పించారు. 43 మంది కార్యదర్శులకు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. వీరిలో కొందరిని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నియమించారు. బాపట్ల జిల్లాలో 30 మంది, పల్నాడు జిల్లాలో 13 మంది కార్య దర్శులు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పంచాయతీల్లో గ్రేడ్‌ల పాలన అమల్లోకి వచ్చిన వెంటనే పదోన్నతులు పొందిన వారిని పంచాయతీలకు నియమించనున్నారు. పంచాయతీల్లోని జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లలో కొందరిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేశారు. సచివాలయాల్లోని డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గ్రామ ప్రణాళిక సహాయకులుగా నియమించనున్నారు. పంచాయతీల్లో ఐటీ విభాగం ఏర్పాటు చేసి రికార్డుల డిజిటలైజేషన్ చేసే దిశగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద పంచాయతీల్లో పాలనా మార్పులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

మ్యుటేషన్ల ప్రక్రియ మారింది

- ఆర్‌డీవో స్థాయిలోనే తుది నిర్ణయం
- ఇకపై జేసీ వద్దకు ఫైలు వెళ్లాల్సిన పని లేదు
- ప్రభుత్వ నిర్ణయంతో భూ యజమానులకు తప్పిన తిప్పలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూము ల మ్యుటేషన్లకు నూతన కార్య ప్రక్రియని రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం విడుదల చేసింది. వెబ్‌ల్యాండ్‌లోని కొన్ని సర్వే నంబర్లలో పట్టా దారు పేర్లను ఇతరులు/మిగులు భూములు/క్లెయిమ్ చేయని భూమిగా పేర్కొంటూ ఎంట్రీలు చేశారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వెబ్ ల్యాండ్‌లో సవరణలు చేయించుకోలేకపోయారు.



ఎప్పు డైతే భూములను విక్రయించడానికి వస్తారో అప్పుడు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. దీనిని సరి చేసు కోవడానికి గ్రామ/వార్డు సచివాలయం మొదలుకుని జాయింట్ కలెక్టర్ స్థాయి వరకు అర్జీ వెళ్లాలి. చివరికి జాయింట్ కలెక్టర్ దానిని పరిశీలించి ఆమోదం తెలి పాక అప్పుడు తహసీల్దార్ లాగిన్‌లో నుంచి వెబ్ ల్యాండ్‌లో కరెక్షన్ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు వేర్వేరు పనుల్లో బిజీగా ఉంటుండటంతో వీటిని చాలా సందర్భాల్లో పట్టించుకోవడం లేదు. దీని వలన నెలల తరబడి జాప్యం జరుగుతున్నది.

వెబ్‌ల్యాండ్‌లో ఇతరములు అని ఉన్న ఒక సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ నంబర్లు ఉండటాన్ని రైతు క్లెయిమ్ చేయకపోయి అయినా ఉండాలి/ పట్టాదారుడిని గుర్తించకపోయి అయినా ఉండాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వీటి పరిష్కారానికి గ్రామ/వార్డు సచివాలయంలో అర్జీ పెట్టిస్తున్నారు. అది తహసీల్దార్ లాగిన్‌కి వస్తుంది. ఇలాంటి అర్జీల ను పరిశీలించి రీ మార్కులు పొందుపరచాల్సిందిగా వీఆర్‌వోకి తహ సీల్దారు పంపుతున్నారు. ఆ తర్వాత ఆర్‌ఐ పరిశీలన చేస్తున్నారు. అక్కడి నుంచి తిరిగి తహసీల్దార్‌కు వస్తుంది. అనంతరం ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు ఫైలు వెళుతుంది. జేసీ ఆమోదంతో వెబ్‌ల్యాండ్ ఎంట్రీలలో కరెక్షన్లు చేస్తున్నారు. ఇక నుంచి ఈ ప్రక్రియ ఆర్‌డీవో స్థాయిలోనే జరుగుతుంది. దరఖాస్తు దారుడు జీఎస్‌డబ్ల్యూఎస్(సచివాలయం)లో మ్యుటేష న్ ఫర్ ట్రాన్సాక్షన్ సర్వీసు కింద అర్జీ పెడతారు. దీనిని వీఆర్‌వోకి సమాచారం ఇస్తారు. ఆ అర్జీని, డాక్యు మెంట్లను వీఆర్‌వో పరిశీలించి తహసీల్దార్‌కు పంపు తారు. దీని ఆధారంగా తహసీల్దార్ ఫారం-8 నోటీసుని రూపొందించి తిరిగి వీఆర్‌వో లాగిన్‌కి పంపుతారు. వీఆర్‌వో ఆ తర్వాత ఎంక్వయిరీ రిపోర్టు, సంబంధిత ఆర్‌వోఆర్ డాక్యుమెంట్స్, ఫారం-8, రిజిష్టర్డ్ డాక్యుమెంట్‌లు, పాత అడంగల్స్, ఎంజాయిమెంట్ సర్వే రిపోర్టు, వాటర్ ట్యాక్స్ పేమెంట్ రశీదు, పక్క భూముల రైతుల ఎంజాయిమెంట్ స్టేట్‌మెంట్‌ని సేకరించి అన్ని పరిశీలన చేసి ఆర్‌ఐకి పంపుతారు. ఆర్‌ఐ చెక్‌లిస్టు ప్రకారం అన్ని ఉన్నాయా, లేదా అని పరిశీలించి తహసీల్దార్‌కు రీమార్కులు రాసి నివేది స్తారు. తహసీల్దారు వీఆర్‌వో, ఆర్‌ఐ రీమార్కులు, డాక్యుమెంట్లను పరిశీలించి సబ్ కలెక్టర్ /ఆర్‌డీవో లాగిన్‌కు పంపుతారు. ఆర్‌డీవో తన వద్దకు వచ్చిన వీఆర్‌వో, ఆర్‌ఐ చెక్‌లిస్టులు, డాక్యుమెంట్‌లు, తహసీల్దార్ సిఫార్సులను పరిశీలించి వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్స్‌కి అనుమతిస్తూ తిరిగి తహసీల్దార్‌కు పంపిస్తారు. దీంతో జాయింట్ కలెక్టర్లపై పనిభారం తగ్గడం తో పాటు అర్జీలు కూడా త్వరితగతిన పరిష్కార మౌతాయని భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి స్పష్టం చేశారు.

కొత్తగా మూడు సంచార రైతుబజార్లు

- శివార్లలోని వినియోగదారుల దరికి కూరగాయలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా మూడు సంచార రైతుబజార్లు మంజూరయ్యాయి. ఎలాంటి ఇంధనం లేకుండా బ్యాటరీ రీచార్జితో ఇవి మారుమూల ప్రాంతాలకు వెళ్లి కూరగాయలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతాయి. మార్కెటింగ్ శాఖ లోని రైతుబజార్ల విభాగం ఈ వాహనాలను సమకూర్చుకుని చుట్టు గుంట రైతుబజారు నుంచి రోజుకో ప్రాంతానికి వీటిని పంపిస్తున్నది. రైతు బజార్లలో ఏవైతే కూరగాయాలు లభ్యమౌతాయో వాటన్నింటిని ఇవి శివారు ప్రాంతాలకు తీసుకెళుతున్నాయి. దీని వలన దూర ప్రాం తాల నుంచి ప్రజలు రైతుబజార్లకు రానవసరం లేకుండా సంచార వాహనాల వద్దనే కొనుగోలు చేసుకోవచ్చు. ధరలు కూడా మార్కెటింగ్ శాఖ ఆమోదించినవే అమలు చేస్తున్నారు. వీటికి ప్రజల నుంచి లభించే ఆదరణని బట్టి మరిన్ని కొనుగోలు చేయాలని రైతుబజార్ల విభాగం భావిస్తున్నది.



ఘనంగా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ప్రారంభం 6

రైతుల సొమ్ము స్వాహా 8
- జీడీసీసీ బ్యాంకు శాఖల్లో రూ.కోట్లలో అక్రమాలు

ఇంటర్‌కు సంకల్ప దీక్ష



- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రశ్నపత్రాల కిట్లు
- విద్యార్థుల్ని గ్రూపులుగా విభజించి స్టడీఅవర్స్ నిర్వహణ
- జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలపైనా శిక్షణకు ఏర్పాట్లు

గుంటూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా బోర్డు అధికారులు ప్రత్యేకంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్ బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప దీక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ప్రభుత్వ ఎయిడెడ్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 35కి పైగా జూనియర్ కళాశాలలో ఉండగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 190 కళాశాలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు దాదాపు 55,476 మంది, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు 53,876 మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉంటారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇప్పటికే అర్ధసంవత్సరం పరీక్షలు పూర్తిఅయ్యాయి. ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కుల్ని అంచనా వేసి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు ఇచ్చిన ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు వారాంత పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల్ని ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు పంపుతున్నారు. అంతేకాకుండా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించారు. ఏ, బీ గ్రేడ్‌లో ఉన్న వారు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటూ చదువులో ముందుండగా సీ, డీ గ్రేడ్ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారని అధ్యాపకులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యక్ష శిక్షణ ఇవ్వడంతో పాటు కొంతమంది అధ్యాపకులు వారిని దత్తత తీసుకుని స్టడీఅవర్స్ నిర్వహించి ప్రత్యేకంగా చదివించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చే ఏడాది జనవరి 21 నుంచే ఎన్విరాన్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది

(మిగతా 6వ పేజీలో)

'చలపతి ఫార్మసీ'లో ఉద్యోగ మేళా రేపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

లాం(తాడికొండ) నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 26న బుధవారం ఫైకేర్ సర్వీసెస్ హెల్త్‌కేర్ సంస్థ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైకేర్ సర్వీసెస్ సంస్థలో మెడికల్ కోడింగ్, బిల్లింగ్, హెల్త్‌కేర్ అకౌంటింగ్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్, మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మసీ, నర్సింగ్, బీపీటీ, బి.హెచ్.ఎం.ఎస్ బి.ఎ.ఎం.ఎస్, ఎం.పి.టి విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూనియర్ ప్రాసెస్ అసోసియేట్ అకౌంట్స్‌కు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేషన్‌తో పాటు.. హస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా ఉండాలన్నారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెడికల్ బిల్లింగ్‌కు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేట్లు, హస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతాయని, పూర్తి సమాచారం కోరకు 81062 53172, 97407 55323 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో డిఎస్‌డివో అఫ్రోజ్ ఖాన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు


పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

ఏఎన్‌యూ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో జరుగుతున్న ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ ప్రారంభించి, ప్రసంగించారు. క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటువంటి లీగ్‌లతో బాలికలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మంగళగిరి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని ఇస్తాయన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదు మాట్లాడుతూ అండర్ 14, 16 బాలికల పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుడు కె.కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ జి.శేషయ్య, కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వర్లు కె.రవి, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 583.20 అడుగులు ఉంది. ఇది 292.24 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 4,034, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 15,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 15,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

35,077 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 37,422 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,679 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11500	14000
334	10000	18200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11500	16000	334	10000	17800
273	---	----	నెంబరు. 5	11500	16500
341	10000	17200	341	11500	18000
4884	----	----	4884	---	----
సూపర్ 10	11500	16000	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	15600
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18200
బ్యాడిగి	11000	18000	దేవనూరు డీలక్స్	10500	17200
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8500

డీఎస్పీల జంటకు.. శుభాకాంక్షలు



డీఎస్పీలు జగదీష్, విద్యాశ్రీ వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. వీరి వివాహ రిసెప్షన్ సోమవారం రాత్రి గురజాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు జిల్లా ఎస్పీ బిక్షమ్‌రావు హాజరయ్యి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ సూరజ్, డీఆర్వో మురళి, విద్యుత్తు శాఖ ఎస్ఈ పి.విజయకుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ, పలువురు జిల్లా అధికారులు, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు. - పిడుగురాళ్ల

29న మంగళగిరిలో మెగా జాబ్‌మేళా

● పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ.. సహకారంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో సుమారు 108 పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 262 కంటే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వివరించారు. పది నుంచి బీటెక్ అర్హత ఉన్నవారు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాల కోసం జి.వి.ఎస్. సాయి కుమార్ (80745 97926), ఎస్.ఐ.బాజీ (7780588993), పి.శ్రావణి (9347372996)ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, ఆర్డీఓ శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్లు గంగ రాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, పీడీ డీఆర్‌డీఏ టీ.వి. విజయలక్ష్మి, ఉపాధి కల్పనా అధికారి దుర్గాబాయి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు

● సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల


వరి పంటను పరిశీలిస్తున్న చైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని జడవల్లి, బాపట్ల జిల్లాలోని సంగుపాలెం కోడూరు గ్రామాల మధ్య సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా సాగైన వరి పంటను సోమవారం నరేంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం అర్జున్ ఎస్ఎస్ఆర్ 7 పీఓ వరి రైతులకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా ఉందన్నారు. ప్రతికూల వాతావరణం తట్టుకుని మెరైన దిగుబడులు ఇచ్చే విత్తనాలను సంగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల సుగర్ పేషెంట్లను దృష్టిలో పెట్టుకుని అర్జున్ ఆరోగ్య పేరుతో విత్తనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. పురుగు మందుల తక్కువగా వినియోగించి రైతుకు సాగు వ్యయాన్ని తగ్గించేలా తమ విత్తనోత్పత్తి ప్రాజెక్టు పని చేస్తుందన్నారు. ఎస్ఎస్ఆర్ పోర్ అనే విత్తనం గేమ్ చేంజర్ కాబోతుందన్నారు. అలాగే సంగం రుద్రా పేరుతో అధిక దిగుబడులు ఇచ్చే టమాటా విత్తనాలను మార్కెట్లోకి తీసుకొచ్చామని.. ఈ విత్తనాలు రాయలసీమ ప్రాంతంతో పాటు కర్ణాటక లోని రైతులకు మంచి దిగుబడులు ఇస్తున్నాయని చెప్పారు. సంగం వీర పేరుతో మినుము విత్తనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నామన్నారు. డెయిరీ ద్వారా పాడిని లాభసాటిగా చేయడంతో పాటు.. పంటను కూడా లాభసాటిగా తెచ్చేందుకు తమ శాస్త్రవేత్తల బృందం పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ, సీడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్‌కు.. 'సంకల్ప దీక్ష'

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రయోగ పరీ క్షలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న సమ యాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ప్రణాళికా బద్ధంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేలా ఇంటర్ బోర్డు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే డిసెంబరు మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూని యర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి అవుతుందని ఇంటర్ బోర్డు ఆర్ఐఒ గర్నెపూడి సునీత ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ తర్వాత మరింత పకడ్బందీ ప్రణాళికతో విద్యార్థుల్ని పరీక్షలకు సిద్ధం చేస్తామని, ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లా అత్యున్నత ఫలితాలు సాధించేలా అధ్యా పకుల సహకారంతో సమష్టిగా కృషి చేస్తున్నా మని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్లో చదివే విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా మెటీరియల్ పంపిణీ చేసినట్లు ఆర్ఐఒ చెప్పారు. ప్రతిరోజు ఇందుకోసం ప్రత్యేకంగా టైమ్‌టెబుల్ నిర్దేశించి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

సత్తెనపల్లి పురపాలక సంఘు కార్యాలయము

EOI నోటీసు నెం. 02/2025-26, తేది. 24.11.2025.

ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు (EOI)

భారత ప్రభుత్వం, AMRUT 2.0 క్రింద, చిన్న నగరాల కోసం క్రెడిట్ ఎన్హాన్సమెంట్ ఇనిషియేటివ్ (క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్) క్రింద సత్తెనపల్లి పురపాలకసంఘమునకు మంజూరు కాబడిన మొత్తము రూ.7.00 కోట్లు (HUDCO ఋణం) నుండి సత్తెనపల్లి మునిసిపాలిటీలోని 23వ వార్డు నందలి నరసరావుపేట రోడ్డులోని సర్వే నం.173/2 నందు గల మున్సిపల్ ఓపెన్ సైట్లో ఆఫీస్ స్పేస్‌తో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయుట పనికి అంచనాలు, ప్లానులు, డిజైన్స్ తో కూడిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (DPR) తయారుచేసి ఇచ్చుటకు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తెలుపవలసినదిగా అర్హత కలిగిన సాంకేతిక సంస్థల (కన్సల్టెన్సీ) వారి నుండి సీల్డు కొటేషన్లు కోరడమైనది. సదరు ప్రతిపాదనలు 01.12.2025 తారీఖున సాయంత్రము గం.4.00లోపు అందజేయవలెను. ఇంకనూ ఏవైనా సాంకేతిక అంశముల కొరకు పురపాలకసంఘ కార్యాలయములోని ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనరు, సత్తెనపల్లి పురపాలకసంఘము

ఖాతాలో.. రూ.72 వేల నగదు మాయం

ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన ఘటన సోమవారం వెలుగు చూసింది. మండలంలోని వనికుంట గ్రామానికి చెందిన కనగాని శ్రీను ఈపూరు యూనియన్ బ్యాంకులోని తన బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయలు దాచుకున్నాడు. ఈ నెల 14 నుంచి దశల వారీగా అతని ఖాతా నగదు మాయమైంది. బాధితుడు అన్నదాత సుఖీభవ నగదు ఖాతాలో పడిందో లేదో చూసుకునేందుకు.. సోమవారం యూనియన్ బ్యాంక్‌కు వచ్చాడు. అతని ఖాతాను పరిశీలించిన బ్యాంక్ అధికారులు రూ.36 వేలు నగదు మాత్రమే ఉందని తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన శ్రీను తన ఖాతాలో సుమారు లక్ష రూపాయలు ఉండాలని చెప్పగా.. అధికారులు ఖాతాను క్షుణ్ణంగా పరిశీలించారు. మధ్యప్రదేశ్ నుంచి ఆధార్ కార్డు సాయంతో శ్రీను ఖాతాలోని నగదును డ్రా చేసినట్లు గుర్తించారు. ఇది సైబర్ నేరస్తుల పని అని బ్యాంక్ అధికారులు శ్రీనుకు తెలియజేశారు. కొడుకు ఆరోగ్యం బాగలేకపోవడంతో.. ఆసుపత్రిలో ఖర్చులకు అప్పులు చేశానని.. తన భూమిని అమ్మి వచ్చిన నగదుతో బాకీల తీర్చానని బాధితుడు తెలిపారు. మిగిలిన లక్ష రూపాయలు బ్యాంకు ఖాతాలో దాచుకుంటే.. దోచుకున్నారంటూ వాపోయా డు.

నరసరావుపేటలో దారుణ హత్య


మృతుడు షేక్ బాజీ

నరసరావు పేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేశాను పల్లి పంచాయతీ పరిధిలోని ఎల్‌టీ నగర్ వద్ద ఆదివారం రాత్రి దారుణ హత్య జరిగింది. రూరల్ ఎస్ఐ కిషోర్ వివరాల మేరకు.. పట్టణంలోని కొండలరావు పేటకు చెందిన షేక్ బాజీ (34)పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాజీని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెనాలి - విజయవాడ మార్గంలో దుగ్గిరాల స్టేషన్ వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సోమవారం వివరాలు వెల్లడించారు. మూడో నంబరు ట్రాక్‌పై మృతదేహం పడి ఉందన్న సమాచారంతో ఉదయం వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. విచారణలో దుగ్గిరాల పెద అగ్రహారానికి చెందిన దారా సుధీర్‌కుమార్ (42) రైలు ఢీకొని మృతి చెందినట్లు గుర్తించినట్లు చెప్పారు. మృతుడు ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి..

చేబ్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య సోమవారం ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మంచాల గ్రామానికి చెందిన వల్లభదాసు మోహనరావు (58) బుడంపాడు నుంచి చేబ్రోలు వైపు ట్రాక్టరులో ప్రయాణిస్తున్న సమయంలో జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు ఎస్ఐ వీరనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

గుంటూరు బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ -0028), 12-1-12, S V R'S ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్, శనక్కాయల ఫ్యాక్టరీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001. ఫోన్: 0863-2223997, E-Mail : iob0028@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) r/w 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్** (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు **తేది:22-09-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.71,85,972/-** (అక్షరాల డెబ్బై ఒక్క లక్షల ఎనభై ఐదు వేల తొమ్మిది వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే"** మరియు **"అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతి పై **తేది.12-12-2025న** విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్థుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది"** అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ఫ్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీతల పేరు మరియు చిరునామా: **శ్రీమతి గొట్టం రాధ,** ఫ్లాట్ నెం.103, క్రింది అంతస్తు, పద్మజ టవర్స్, కుండ్లుల రోడ్డు, శివం మెరిట్ స్కూల్ మీదుగా, ఎపిహెచ్‌బి కాలనీ మీదుగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ - 522005. **శ్రీ గొట్టం వెంకట్ రెడ్డి,** ఫ్లాట్ నెం.103, క్రింది అంతస్తు, పద్మజ టవర్స్, కుండ్లుల రోడ్డు, శివం మెరిట్ స్కూల్ మీదుగా, ఎపిహెచ్‌బి కాలనీ మీదుగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ - 522005.

NPA తేది. 31.05.2018	డిమాండ్ నోటీసు తేది : 20.08.2018
డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.31.05.2018 నాటికి రూ.39,67,792/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.	
స్వాధీనత నోటీసు తేది: 29-01-2019,	స్వాధీనత నోటీసు ప్రచురించబడిన తేది: 04-02-2019
స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.28.01.2019 నాటికి రూ.42,37,870/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.	

స్థిరాస్తి వివరములు: షెడ్యూలు - ఎ (భూమి): గుంటూరు జిల్లా, నల్లపాడు రిజిస్ట్రేషన్ సబ్ డివిజన్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, గుంటూరు సిటీ, నల్లపాడు గ్రామ డి.నెం.159, 160, 168, 173 & 174 లోని 744.32 చ॥గ॥లు లేదా 622.35 చ॥మీ॥ల విస్తీర్ణంలో ఎమ్‌ఐజి ఇంటి నెం.186 & 187తో గల శ్రీ సాయి హోమ్స్ అను పేరు గల స్థలం యావత్తు ఆస్తి. హద్దులు : **తూర్పు** : ఎమ్‌ఐజి - 188, 103 అ॥లు, **దక్షిణం:** ప్రైవేట్ భూమి, 66 అ॥లు, **పడమర** : ఎమ్‌ఐజి - 185, 100 అ॥లు, **ఉత్తరం** : 33 అ॥ల వెడల్పు మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, 66 అ॥లు.,

షెడ్యూలు - బి (ఫ్లాట్) : మొత్తం 744.32 చ॥గ॥లు లేదా 622.35 చ॥మీ॥ల విస్తీర్ణంలో 56.40 చ॥గ॥లు లేదా 47.15 చ॥మీ॥ల అవిభాజ్యపు వాటాతో శ్రీ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు నందు 1330 చ॥అ॥లు (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) ప్లింత్ ఏరియాతో గల నివాస ఫ్లాట్ నెం.501 యావత్తు ఆస్తి. హద్దులు : **తూర్పు** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర** : ఓపెన్ టు స్కై, **ఉత్తరం** : కామన్ కారిడార్ & మెట్లు.

రిజర్వుధర: రూ.31,12,000/- ధరావత్తు ధర : రూ.3,12,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-

* రూ.50.00 లక్షలు మరియు అంతకంటే ఎక్కువ బిడ్‌తో విజయవంతమైనచో టిడిఎస్ @ 1% వసూలు చేయబడును.

వేలం తేది మరియు సమయం: తేది.12-12-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు వారి పేరు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసినదిగా కోరడమైనది. కెవైసి పత్రాలు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 11-12-2025, మధ్యాహ్నం 1.00 గంటలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం కొరకు వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసున్నంత వరకు ఏలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంక్ పనివేళలో తేది.25-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది: 25-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది. 11-12-2025, మ॥ 1.00 గం॥ల వరకు

* (ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, (ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : URL: https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్, గ్రౌండ్ ఫ్లోర్, S V R's ఎంపైర్, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డు, మెయిన్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు - 522001. ఫోన్ : 0863-2223997, మొబైల్ నెం.8925950028 & Email Id: iob0028@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network (BAANKNET), రిజిస్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వదాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వదాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 24-11-2025, ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

గుంటూరు బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ -0028), 12-1-12, S V R'S ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్, శనక్కాయల ఫ్యాక్టరీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001. ఫోన్: 0863-2223997, E-Mail : iob0028@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్** (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు **తేది:23-11-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.1,36,11,709/-** (అక్షరాల ఒక కోటి ముప్పై ఆరు లక్షల పదకొండు వేల ఏడు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే"** మరియు **"అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతి పై **తేది.12-12-2025న** విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్థుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది"** అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ఫ్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: మెస్సర్స్ శ్రావణి కాటన్ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : నార్నె మధుబాబు, డి.నెం.8-215-4, అనంతవరప్పాడు రోడ్డు, ఏటుకూరు, గుంటూరు - 522017. ప్రొప్రయిటర్ : శ్రీ నార్నె మధుబాబు, పోతిన నారి, కారంచేడు మండలం, ప్రకాశం జిల్లా - 523190. హామీదారు : శ్రీ సోమిశెట్టి వెంకట సురేష్, ఫ్లాట్ నెం.402, అలంకృత అపార్ట్‌మెంట్స్, 6/3, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522006.

NPA తేది. 29.01.2023	డిమాండ్ నోటీసు తేది : 31.01.2023
డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.31.01.2023 నాటికి రూ.1,02,67,542.25/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.	
స్వాధీనత నోటీసు తేది: 13-09-2023	స్వాధీనత నోటీసు ప్రచురించబడిన తేది: 15-09-2023
స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.13.09.2023 నాటికి రూ.1,10,55,090.25/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.	
ముందస్తు అమ్మకం ప్రకటన తేది : 06.12.2024	

స్థిరాస్తి వివరములు: ఆస్తి-1 (భవనం): ప్రకాశం జిల్లా, చీరాల మున్సిపాలిటీ మరియు మండలం, జై శంకర్ నగర్, సర్వే నెం.181/2, డోర్ నెం.1-50-54 వద్ద 275 చ॥గ॥ల నివాస స్థల విస్తీర్ణంలో పాత టైల్-రూఫ్ ఇంటితో గల యావత్తు ఆస్తి శ్రీ నార్నె మధుబాబు (ప్రొప్రయిటర్), తండ్రి : మస్తాన్‌రావు గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు : **తూర్పు** : నార్నె మధుబాబు గారి ఆస్తి, **దక్షిణం** : మున్సిపల్ రోడ్డు, **పడమర** : ఎనుమల శ్యామల రాజు గారి ఆస్తి, **ఉత్తరం** : ఆసాది రామకృష్ణారెడ్డి గారి ఆస్తి.

రిజర్వుధర: రూ.30,80,000/- ధరావత్తు ధర : రూ.3,08,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-

ఆస్తి-2 (భూమి): ప్రకాశం జిల్లా, చీరాల మున్సిపాలిటీ మరియు మండలం, సాంబశివ రావు & పద్మావతి నిలయం ఎదురుగా, అవతుధ స్వామి గుడి దగ్గర, ఫైర్ ఆఫీస్ గేటు రోడ్డు, ప్రకాశ్ నగర్ మెయిన్ రోడ్డు, జై శంకర్ నగర్, జియో ట్యాగ్ ప్రక్కన, డోర్ నెం.299, చీరాల సర్వే నెం.181/2 లోని డి.నెం.1-50-55 లజ్జ 247.7/9 చ॥గ॥ల విస్తీర్ణం గల నివాస స్థలం యావత్తు ఆస్తి టైటిల్ డీడ్ నెం.1611/2010, తేది.12.04.2010 ప్రకారం శ్రీ నార్నె మధుబాబు (ప్రొప్రయిటర్), తండ్రి : మస్తాన్‌రావు గారి పేరున కలదు. హద్దులు : **తూర్పు** : అరవపల్లి చిన వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **దక్షిణం** : మున్సిపల్ రోడ్డు, **పడమర** : నార్నె మధుబాబు గారి ఆస్తి, **ఉత్తరం** : సుద్దపల్లి చంద్ర మోహన్ గారి ఆస్తి,

రిజర్వుధర: రూ.27,76,000/- ధరావత్తు ధర : రూ.2,77,600/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-

వేలం తేది మరియు సమయం: తేది.12-12-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు వారి పేరు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసినదిగా కోరడమైనది. కెవైసి పత్రాలు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 11-12-2025, మధ్యాహ్నం 1.00 గంటలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం కొరకు వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసున్నంత వరకు ఏలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంక్ పనివేళలో తేది.25-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది: 25-11-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది. 11-12-2025, మ॥ 1.00 గం॥ల వరకు

* (ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, (ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : URL: https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్, గ్రౌండ్ ఫ్లోర్, S V R's ఎంపైర్, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డు, మెయిన్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు - 522001. ఫోన్ : 0863-2223997, మొబైల్ నెం.8925950028 & Email Id: iob0028@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network (BAANKNET), రిజిస్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వదాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వదాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.


తేది : 24-11-2025, ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీ ఆర్ఎస్‌కు అందే అర్జీలు, ఫిర్యాదులు పునరావృతం కాకూడదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. అర్జీలను విభాగాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తెలుగ దయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 25 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు తీసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 27 అర్జీలు అందాయని తెలిపారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

పనులు చేపట్టని కాంట్రాక్టులను రద్దు చేయండి

నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశిత టెండర్ ద్వారా అభివృద్ధి పనులను పొంది, క్షేత్ర స్థాయిలో పనులను చేపట్టని కాంట్రాక్టులను రద్దు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఉద్యోగ నగర్, విజయపురి కాలనీ, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టాభి సీతారామయ్య దూరదృష్టి గల నాయకుడు


పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూల మాలలు వేస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ సయ్యద్ జవహర్

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య రైతులు, వ్యాపారులకు మేలు చేసిన దూరదృష్టి గల నాయకుడని పలువురు కొనియాడారు. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య 146వ జయంతి సందర్భంగా యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక సంస్మరణ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. నగరంలోని హిందూ కాలేజీ వద్ద ఉన్న భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహానికి యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ సయ్యద్ జవహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్య సమర యోధుడు, రాజనీతిజ్ఞుడని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, ఆంధ్రా బ్యాంకులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభి అవార్డుల ప్రదానం

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్థాపించిన పట్టాభి కళాపీఠం వారు అందజేస్తున్న పట్టాభి అవార్డుల ప్రదానోత్సవం స్థానిక బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో సోమవారం వేడుకగా జరిగింది. సభకు కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాదు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ, పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంకును స్థాపించి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అవార్డు గ్రహీత జిల్లా అటవి శాఖ అధికారి హిమ శైలజ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖులైన వలివేటి శుభావతి, డాక్టర్ లలితా సింధూరి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రశాంతి లక్ష్మీదేవి, కె.అనూరాధ, ధారా శ్రీలక్ష్మి, వి.నాగరత్నం, హిమ శైలజకు పట్టాభి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాటక రచయిత కావూరి సత్యనారాయణ, డా.ఆంధ్రూ తదితరులు పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

మా సమస్యలను వెంటనే పరిష్కరించండి

● ఆరోగ్యశాఖ కమిషనర్‌కు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వినతి

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ఆరోగ్యశాఖ కమిషనర్ వీర పాండ్యన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో కమిషనర్‌ను కలిసిన అసోసియేషన్ నాయకులు 2022 నుంచి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని, పే స్లిప్స్, మెటర్నిటీ, సమ్మె కాలపు జీతాలు, ట్రాన్స్ఫర్, అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ వేయాలన్న నిబంధనను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బిర్రు సందీప్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ కుమార్, గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, చిత్తూరు కోఆర్డినేటర్ షేక్ రషీద్ ఉన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎస్ ప్రకాష్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు అన్ని కేటగిరీలుకు పెంచి, ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ తదితర డిమాండ్లు అమలు చేయాలని కోరారు. ఈ నిరసనల్లో ఎం.గంగరాజు, కె.కిరణ్‌కుమార్, సంధ్య, అరుణ్, మాబు సుభాని, మాధురి, మణి, పార్వతి, వినోద్,సుజిత్, చలపతి, చంద్ర, జ్యోతి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్ర నామ సంఘం అధ్యక్షుడిగా ఫణిభూషణరావు

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ సంఘం నూతన అధ్యక్షుడిగా ధూర్భా ఫణిభూషణరావు ఎన్నికయ్యారు. స్థానిక బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితిలో ఆదివారం రాత్రి విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. రాబోయే మూడు సంవత్సరాలకు నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా రామరాజు రామకృష్ణారావు, అధ్యక్షుడిగా ధూర్భా ఫణిభూషణరావు, ఉపాధ్యక్షుడిగా నాదెండ్ల రాధాకృష్ణ, కార్యదర్శిగా కళ్ళెం సుబ్రహ్మణ్య శర్మ, సంయుక్త కార్యదర్శిగా రాజేంద్రబాబు, కోశాధికారిగా దెందుకూరి శివరామకృష్ణ, మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి నందిరాజు రాజేశ్వరరావు ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు తొలగించటం, రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కృష్ణనగర్ ఐదో లైను, కుందుల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పటిష్టంగా అర్జీల పరిష్కార ప్రక్రియ

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● పీజీఆర్ఎస్‌కు 290 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు

గుంటూరు (తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల నమోదు ప్రక్రియ, వాటి పరిష్కార మార్గాలను మరింత పటిష్టం చేయాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 290 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీ నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖలు, పరిష్కార దిశగా తీసుకుంటున్న చర్యలను నిరంతరం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో బీవీ నాగ సాయికుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీటీసీ సీతారామిరెడ్డి, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న అర్జీల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అందుతున్న అర్జీలు, వాటి నమోదు, సంబంధిత శాఖలకు వెళుతున్న తీరు, సంబంధిత కార్యాలయాల్లో నమోదు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు.

ఫిర్యాదులు...వినతులు

స్థానిక వాసవినగర్ పరిధిలోని కోమలాంగి పేరుతో ఉన్న 14 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కోమలాంగి సామాజిక వర్గానికి చెందిన పేదలకు అప్పజెప్పాలని అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. సంగడి గుంట ఇందిరా ప్రియదర్శిని కాలనీలో సీసీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెహబుబ్ అలీ అర్జీ అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు.

రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలి : కేసన

స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కులగణన జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి క్రాంతి కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు జరపాలన్నారు. రాజ్యాంగం షెడ్యూల్-9లో జనాభా దామాషా మేరకు పెంచిన బీసీ రిజర్వేషన్లను చేర్చి, సంపూర్ణ చట్టబద్ధతతో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కన్నా మాస్టర్, పారేపల్లి మహేష్, రామకృష్ణ, కోలా అశోక్, బాదినేడి వంశీకృష్ణ, తురక రమేష్, ఆలా శివాజీ, నరసింహారావు, వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు ఉన్నారు


కలెక్టరేట్‌లో కేసన శంకరరావు, కుమ్మరి క్రాంతి కుమార్, బీసీ సంఘాల నాయకులు


దిలీప్ బన్సాలి నుంచి అవార్డులు అందుకుంటున్న సేవకుమార్, సాయికృష్ణ

గుంటూరు శాఖ ఐఎంఏకు పలు అవార్డులు

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖకు పలు అవార్డులు దక్కాయి. ఐఎంఏ అందించిన సేవలకు లభించిన అవార్డులను ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలి నుంచి గుంటూరు ఐఎంఏ శాఖ కార్యనిర్వాహక వర్గం అందుకుంది. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ఈ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, డాక్టర్ వి.మహేష్, డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ ఎన్ కిషోర్, డాక్టర్ ఎం.పర్నికుమార్ తదితరులు డాక్టర్ బన్సాలి నుంచి అవార్డులు అందుకున్నారు. గుంటూరు ఐఎంఏ శాఖకు రాష్ట్రస్థాయిలో ఐదు అవార్డులు దక్కటం పట్ల పలువురు నగర వైద్య ప్రముఖులు అభినందనలు తెలిపారు

పీజీఆర్ఎస్ వేదికలో ఉచిత నేత్ర పరీక్షలు


గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వస్తున్న ప్రజలకు ఉచిత నేత్ర పరీక్షలు జరిపేందుకు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, గుంటూరు సుదర్శని కంటి ఆసుపత్రి మొబైల్ యూనిట్‌ను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ఆవరణలో నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించారు. కలెక్టర్ మొబైల్ యూనిట్‌ను సోమవారం పరిశీలించారు. సుదర్శని కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేష్ గణేశుని వివరాలను తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి, సుదర్శని కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గా చైతన్య, డాక్టర్ అదితి పాల్గొన్నారు.

వైభవంగా విమాన వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేటలోని 60 అడుగుల రోడ్డులో విమాన వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయం ప్రధాన గోపురంపై నిర్మించిన ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు మాట్లాడుతూ, వైకుంఠ శ్రీనివాసమూర్తి గుడిని బహుళ దేవతామూర్తుల ఆలయాల ప్రాంగణంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు తోట రామకృష్ణ, సెంట్రింగ్ బాబు, వంజరపు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే మెరుగైన బోధన

గుంటూరు (విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలంటే నైపుణ్యాలు అవసరమని ఆర్వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ కళాశాలలో స్మార్ట్ సిటీ ఎకోసిస్టమ్ అభివృద్ధిలో భాగంగా అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో పర్యావరణ హిత నగరాల రూపకల్పనకు ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ వరకు కళాశాలలో అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సస్టైనబుల్ స్మార్ట్ సిటీల నిర్మాణానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు శిక్షణ దోహద పడుతుందని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

స్వాతంత్ర్య సమరయోధుడు రాఘవయ్యకు నివాళులు

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడిన దివంగత నేత వెన్నెలకంటి రాఘవయ్య 44వ వర్ధంతి సందర్భంగా సోమవారం నాజ్‌సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షెడ్యూల్డ్ ట్రైబ్ యానాది డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (స్టైడ్వా) ఆధ్వర్యంలో స్టైడ్వా వ్యవస్థాపక అధ్యక్షుడు బాపట్ల ఏసుబాబు, గౌరవాధ్యక్షుడు వబ్బాని ఏడుకొండలు, చెంచుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి వరప్రసాద్, కస్తూరి సైదులు బాపట్ల కిరణ్ తదితరులు రాఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమయపాలనతో ఒత్తిడి దూరం

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రతి రోజూ సమయపాలనతో కూడిన దినచర్య పాటించాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి సూచించారు. సోమవారం వైద్య కళాశాలలో ప్రభుత్వాసుపత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు నిర్వహించిన ఎమోషనల్ ఎసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్ (ఈజ్) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థుల్లో కనిపించే ఒత్తిడి లక్షణాలను, వాటిని సహ విద్యార్థులు గుర్తించే పద్ధతులను సైకియాట్రి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిమిషా వివరించారు. కార్యక్రమంలో ఈజ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉప్పాల అపర్ణ, ఎంఈయూ కోఆర్డినేటర్ డాక్టర్ రమణ కుమారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ డి.శ్రీధర్, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ఉన్నతమైంది : లక్ష్మణరావు

గుంటూరు (తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లోనే భారత దేశ రాజ్యాంగం ఉన్నతమైందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్, లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలల కోసం రాజ్యాంగ ప్రవేశిక పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు కవి, జర్నలిస్టు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. తొలుత కేఎస్ లక్ష్మణరావు రచించిన బాలల కోసం రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని అతిథులతో కలిసి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, జయసుధ, చిష్టి, భగత్ సింగ్ పాల్గొన్నారు.

టెన్నిస్‌లో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోరంకిలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలలో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల 9వ తరగతి విద్యార్థి సీహెచ్ హర్షవర్ధన్ పాల్గొని ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ గౌరవ అధ్యక్షుడు యలమంచిలి శివాజీ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువే కాకుండా వివిధ ఆటలలో నైపుణ్యం సాధించడం అభినందించదగిన విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలక వర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధామాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ సయ్యద్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ తిరువీధుల శ్రీదేవి, ఇంచార్జి కొమ్మినేని హరిప్రియ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజ్ఞాన మందిరం సెంటర్ వద్ద సమగ్ర ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే వారాల్లో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో రుణం ఇప్పిస్తానని మోసం

ఆన్‌లైన్‌లో రుణం ఇప్పిస్తానని ఓ వృద్ధురాలని ఓ యువకుడు మోసం చేశాడు. దీంతో బాధితురాలు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. అడవి తక్కెళ్ళపాడు పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న గుంపు సునీత పూలు అమ్ముకుంటూ, మిషన్ కుడుతూ జీవనం సాగిస్తోంది. తన కింది అంతస్తులో నివాసం ఉండే మల్లాల తేజ అనే యువకుడు ఆన్‌లైన్‌లో లోన్ ఇప్పిస్తానని చెప్పి తన సెల్ ఫోన్ తీసుకొని తన పేరుతో రూ.1.46 లక్షల లోన్ తీసుకొని, అందులో తనకు కేవలం రూ.60 వేలు మాత్రమే ఇచ్చాడని తెలిపారు. దీనిపై నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకోవాలని సీఐ ఆదేశించినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది తేజ వద్ద లంచం తీసుకొని తనను బెదిరించారన్నారు. దీంతో తాను ఎస్పీని ఆశ్రయించానని చెప్పారు.

మహిళా కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో తమకు ఇవ్వాల్సిన ఫీజు అడిగినందుకు మహిళా కానిస్టేబుల్ ఆమె కుటుంబ సభ్యులు ఏకంగా జిల్లా కోర్టు ఆవరణలోనే తనపై దాడి చేసి కొట్టి బెదిరించారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చందవరపు రత్నకుమారి అనే మహిళా న్యాయవాది సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గతంలో తాను ఆ మహిళా కానిస్టేబుల్ మంగళగిరిలోని సిస్టర్స్ కాన్వెంట్‌లో కలిసి పని చేశామని చెప్పారు. అప్పటి పరిచయాన్ని దృష్టిలో ఉంచుకొని కొంతకాలం క్రితం తనను కలిసి తనపై నమోదైన ఓ కేసును హైకోర్టులో స్క్వాష్ చేస్తే రూ.50 వేలు ఫీజు ఇస్తానని చెప్పిందన్నారు. ఆమెపై నమోదైన కేసులో ఎటువంటి అరెస్టు లేకుండా తను తన భర్త కలిసి హైకోర్టు నుంచి నోటీసులు తెచ్చామన్నారు. అనంతరం తమకు ఇవ్వాల్సిన ఫీజు అడుగుతుంటే ఇవ్వకపోగా జిల్లా కోర్టు ఆవరణలో విధుల్లో ఉన్న తనపై ఆ మహిళా కానిస్టేబుల్‌తో పాటు ఆమె కుటుంబసభ్యులు దాడి చేసి కొట్టారన్నారు. వారందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ప్రతి గడపకు ప్రభుత్వ కార్యక్రమాలు తీసుకెళ్లాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను ప్రజలకు చేరువయ్యేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలదేనని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను సచివాలయాల ఆకస్మిక తనిఖీకి వెళ్లినప్పుడు సిబ్బంది లేకపోవడం, ప్రజలకు ఎలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయో తెలియకపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ క్రమంలో పార్టీ కేడర్‌తో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం పథకాలను సంతృప్తికరస్థాయిలో అందిస్తోందని తెలిపారు. వీటిని ప్రజలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతినిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్నామని వెల్లడించారు. ఏ సమస్య వచ్చినా తమ కార్యాలయంలో తెలియజేయాలని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డులు జారీ చేయాలి : కలెక్టర్

గుంటూరు, నవం బరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడం వలన అధార్ కార్డులు ఇప్పటివరకు పొందని వాళ్లని గుర్తించి వారం దరికి ఆధార్ కార్డులు జారీ చేసేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి రెవెన్యూ అంశాలు, భూముల రీ సర్వే, గృహనిర్మాణం, గ్రామ వార్డు సచివాలయ సేవలు, ఉపాధి హామీ పథకంపై సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ రీసర్వేలో మ్యూటేషన్ల దరఖాస్తులపై రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రీసర్వే నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించేలా తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జిల్లా పరిషత్ సీఈఓ వీ.జ్యోతి బసు, హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా వార్షిక సంచిక 'అవని' ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెప్మా వార్షిక సంచిక 'అవని'ని సోమవారం శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 9 ప్రాజెక్టులకు ఇటీవల వచ్చిన స్కోచ్ అవార్డులు మెప్మాను దేశంలోనే అగ్రగామిగా నిలిపాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలీ, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ భాగస్వామ్యం

● అసిస్టెంట్ డైరక్టర్ రఘునాధబాబు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ భాగస్వామ్యమవుతోందని అసిస్టెంట్ డైరక్టర్ (హెడ్ ఎఫ్ఐఈవో, ఏపీ చాప్టర్) జి.రఘునాధబాబు పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారి ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నగరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణాలు మంజూరు చేసిన చెక్‌లను కస్టమర్‌లకు అందజేశారు. అనంతరం బ్యాంకు అధికారులు మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ (హెచ్ఆర్డీ) వి. నీలిమ, సర్కిల్ హెడ్ పంకజ్‌కుమార్, ఎమ్‌సీసీ హెడ్ ఏ బిక్షపతి, బ్రాంచ్ మేనేజర్ కార్తీక్ శీలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రఘునాధబాబు తదితరులు

జీఎస్‌టీవోలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోన్-3 పరిధిలో ఖాళీగా ఉన్న జీఎస్‌టీవో అధికారుల పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ది కమర్షియల్ టాక్స్ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బవనారి వెంకటేష్ బాబు, కొప్పోలు సుధాకర్ ఆ శాఖ గుంటూరు-1 జాయింట్ కమిషనర్ గీతా మాధురికి విజ్ఞప్తి చేశారు. సీటీ ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు సోమవారం జిన్నాటవర్ సెంటర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఎఫీషి యన్సీ టెస్ట్ పాస్ అయిన, కావలసిన ఉద్యోగుల విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ సంఘం గుంటూరు 2 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీబాషా, డీవీ కోటేశ్వరరావు గుంటూరు-1 అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సుబ్రహ్మణ్యం రాష్ట్ర నాయకులు డేవిడ్ రాజు, రత్నకుమార్ డివిజన్ నాయకులు పగడాల శ్రీనివాసరావు, రాధిక, శ్రావణి, ఎం.శ్రీనివాసరావు, చాముండేశ్వరరావు తదితరులున్నారు. అనంతరం వారు గుంటూరు 2 డివిజన్ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్‌ను కూడా కలిసి ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గుంటూరు (తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్తంభాలగరువు, చనుబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య, వసంతరాయపురం, లూర్దుస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీతోడు, మానసిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు-ఆరోగ్యంపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలికను గర్భవతిని చేసిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను గర్భవతిని చేసిన నిందితుడిపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ లో పోక్సో కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లాకు చెందిన బాలిక కొద్ది సంవత్సరాలుగా విద్యానగర్లోని తన బంధువుల ఇంటిలో ఉంటుంది. ఈనెల 7 నుంచి ఆ బాలిక కనిపించపోవటంతో కుటుంబ సభ్యులు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన బాలికను పోలీసులు విచారించగా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి తిరుపత య్య తనను ప్రేమిస్తున్నట్లు చెప్పాడని, ఇద్దరం శారీరకంగా కలిసామని, తాను గర్భం దాల్చినట్లు బాలిక వెల్లడించింది.

ఇంటి నుంచి వెళ్లిపోవాలని కుమారుడు బెదిరిస్తున్నాడు

దివ్యాంగురాలైన తన కూతుర్ని, తనను ఇంటి నుంచి వెళ్లిపోవాలని తన కుమారుడు బెదిరిస్తున్నాడని గోరంట్లకు చెందిన వాసంశెట్టి వెంకటేశ్వరరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు ప్రస్తుతం సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా హైదరాబాదులో ఉంటున్నాడన్నారు. తనకున్న స్థలంలో రెండంతస్తుల ఇల్లు నిర్మిస్తానని రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశాడని వాపోయారు. తనను, తన కుమార్తెను ఇంటి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నాడన్నారు.

క్రీడాకారులకు మంత్రి లోకేశ్ ప్రోత్సాహం

● జీడీసీసీబీ చైర్మన్ మక్కెన



100మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

వినుకొండటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులకు మంత్రి నారా లోకేశ్ ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం మక్కెన మాట్లాడుతూ ఇటీవల వినుకొండలో నిర్వహించిన అండర్ -17 బాల బాలికల కబడ్డీ పోటీలు గుర్తింపు తెచ్చాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించారు. క్రీడా ప్రాంగణాలను నూతనంగా తీర్చిదిద్దడంపై క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి షకీలాబేగం, ఫాదర్ అవినాష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు సురేష్, పద్మావతి, పీఈటీలు వై.వి.చిరంజీవి, రాజు, కొండలు, రాజేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

రూ.కోట్లు ఖర్చు.. దాహార్తి తీరిస్తే ఒట్టు!

● పాఠశాలల్లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు
● ఇన్‌స్టలేషన్ చేయలేక మరమ్మతులకు..
● అందుబాటులోకి తెస్తే..విద్యార్థులకు తాగునీరు

గుంటూరు(విద్య) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్కడ పేరుకు మాత్రమే వాటర్ ప్లాంట్లు ఉంటాయి. రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినా అందులో నుంచి చుక్క నీరు రాదు. కేవలం ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లించని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు అలంకార ప్రాయంగా మారిన వైనమిది. గత వైసీపీ పాలనలో నాడు-నేడు పనుల్లో భాగంగా కొనుగోలు చేసిన ఈ ప్లాంట్లు విద్యార్థులకు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయో తెలియక, వాటిని పర్యవేక్షించలేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

ఒక్కో ప్లాంట్ ఖరీదు రూ.లక్షల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశ పనుల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ప్రమేయం లేకుండా ఆరో ప్లాంట్లు కొనుగోలు చేసి ఎన్నికలకు ముందు పాఠశాలలకు తరలించారు. ఒక్కో ప్లాంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 100కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోట్ల వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చిన వెంటనే నిర్దేశించిన ప్రదేశంలో షెడ్డు నిర్మించి.. అక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. అయితే వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చి నెలలు గడిచినా షెడ్లు నిర్మించలేదు. కొన్ని నెలల తర్వాత ఆరో ప్లాంట్ల నిర్వహణపై విమర్శలు రావడంతో షెడ్లు నిర్మించి వాటిని పెట్టారు. అయితే విద్యుత్ సరఫరా ఇచ్చి ఇన్‌స్టలేషన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ లోగా ఎన్నికలు రావడం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అనేక పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు షెడ్లుకే పరిమితమయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు 19 నెలలు పూర్తయింది. తాజాగా నాడు నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చారు. గత పాలకులు చేసిన తప్పిదాలను మాత్రం సరి చేయడం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు

దుమ్ముపట్టి.. దిష్టిబొమ్మల్లా..

గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం, ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌తో పాటు 11 మున్సిపల్ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు దుమ్ము పట్టి ఉన్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలోని అనేక జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం వాటర్ ప్లాంట్లు ఉపయోగంలోకి రాక దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు రావడంతో కొన్ని మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల, బ్యాటరీ ఫెయిల్ కావడం, ఫిల్టర్లు పాడైపోవడం, ప్లాంట్‌లో అంతర్గతంగా సాంకేతిక సమస్యలు రావడంతో ఇన్‌స్టలేషన్ చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థలకు ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లిస్తే ఇవి వినియోగంలోకి వస్తాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలని, గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'వేలం'వెర్రిగా నమ్మించి.. రూ.కోటి టోకరా

● సగం ధరకే బంగారం ఇస్తానని మోసం
● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనో బ్యాంకు ఉద్యోగినని చెప్పుకుంది. బ్యాంకు తాకట్టులోని బంగారం వేలంలో తక్కువ ధరకే వస్తుందని నమ్మించింది. ఆ బంగారాన్ని సగం ధరకే ఇస్తానని తన తండ్రితో కలిసి కోట్ల రూపాయలు వసూలు చేసి.. అటు బంగారం ఇవ్వక.. ఇటు డబ్బులు తిరిగివ్వక మోసం చేసిందని.. ప్రశ్నిస్తే.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు పెడతానని బెదిరిస్తోందని బాధితులు ఎస్పీ కార్యాలయానికి సోమవారం క్యూకట్టారు. బాధితుల్లో పెదకాకానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ కూడా ఉన్నారు. బాధితురాలు గుల్జార్ ఫిర్యాదు మేరకు.. తమ ఇంటి సమీపంలో నివాసం ఉండే ఓ మహిళ ద్వారా నంబూరుకు చెందిన మహిళ పరిచయమైందని పేర్కొన్నారు. తను విజయవాడ భవానిపురంలోని ఓ బ్యాంకు బ్రాంచీలో ఉద్యోగం చేస్తుంటానని చెప్పిందన్నారు. తమకు వేలంలో బంగారం తక్కువ ధరకే వస్తుందని, దానిని సగానికి సగం ధరకే ఇస్తానంటూ నమ్మబలికిందన్నారు. ఆమె మాటలు నమ్మి జనవరిలో రూ.3 లక్షల నగదు ఇవ్వగా.. అందుకు గాను రూ.5 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు ఇచ్చిందన్నారు. దీంతో ఆమె మాటలు నమ్మి ఇంటిని విక్రయించి రూ.20 లక్షలు, బంగారు ఆభరణాలన్నీ అమ్మేసి మరో రూ.20లక్షలు ఇచ్చానని వాపోయారు. దీనికి తోడు ఇంటి పక్కన చుట్టుపక్కల తెలిసిన వారందరితో ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆమెకు కట్టించానన్నారు. అలా చుట్టుపక్కల వారి నుంచి రూ.70 లక్షలు ఇప్పించానని గుల్జారు తెలిపారు. తక్కువ ధరకు బంగారం ఇస్తానన్న మహిళ.. ప్రస్తుతం నంబూరు నుంచి పారిపోయి ఇబ్రహీంపట్నంలో ఉంటోందని చెప్పారు. కొంత మొత్తం నగదు ఆమె తండ్రికి కూడా ఇచ్చామన్నారు. ఆయన ఇబ్రహీంపట్నంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. తాము నగదు కోసం అక్కడికి వెళ్తే.. ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తోందన్నారు. ఇలా నమ్మించి మోసం చేసి.. రూ.1.20 కోట్లు వరకు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గిరిపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిపుత్రుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన యువత ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థానంలో ఉండడం జగన్‌రెడ్డికి ఇష్టం లేక విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి విదేశి విద్యను కొనసాగిస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన రోడ్లు, సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ఆసరాగా 1962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో రోడ్లు వేయిస్తున్నారన్నారు. స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతుల సొమ్ము స్వాహా

● జీడీసీసీ బ్యాంకు శాఖల్లో రూ.కోట్లలో అక్రమాలు ● విచారణ దశలోనే వినుకొండ, గురజాల శాఖల కుంభకోణాలు
● కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ అక్రమాలు ● కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము మేత
● విచారణ పేరుతో సాగదీతపై విమర్శలు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు శాఖల్లో అక్రమాలు తొవ్వే కొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దళారులు అడ్డగోలుగా కోట్ల రూపాయలు పోగేసుకున్నారు. కొన్ని ప్లెడ్జి రుణాలు కాగా మరికొన్ని స్వయం సహాయక సంఘాల పేరుతో నకిలీలు సృష్టించి దండుకొన్నారు. తాజాగా నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు రూ.22 కోట్లుపైనే అక్రమాలు జరిగినట్లు తేల్చారు. దీనిపై ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్‌తో పాటు పలువురు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా పరిణామాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ శాఖల్లో అక్ర మాలు చర్చనీయాంశంగా మా రాయి. నల్లపాడు శాఖలో కుంభకోణం కంటే ముం దుగానే వినుకొండ, గురజాల శాఖల్లోనూ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పేరుతో నకిలీ గ్రూపులను సృష్టించి రూ. కోట్లలోనే దోచేసిన వైనంపై ఇప్పటికే విచా రణ జరుగుతున్నట్లు తెలిసింది. అయితే నల్లపాడు శాఖలో అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం.. అంతకంటే ముందుగానే వినుకొండ, గురజాల శాఖల్లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ

సెంట్రల్ బ్యాంకుకు చెందిన కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ రూ.కోట్లలోనే అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులోనూ పెద్దఎత్తున నకిలీ గ్రూపులు సృష్టించి రుణాలు పొందినట్లు తెలిసింది. అంతేగాక వినుకొండ, గురజాలతో పాటు పొన్నూరు, ప్రత్తిపాడు, శాఖల్లోనూ అక్రమాలు ఉన్నాయని, విచారణ పేరుతో దీర్ఘకాలంగా సాగదీస్తున్నారే తప్ప చర్యలలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొందని విమర్శలు ఉన్నాయి.



గుంటూరులోని ఎన్టీఆర్ సహకార భవన్

కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము స్వాహా

మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతుల సొమ్మును వారికే తెలియకుండా కొందరు అక్రమార్కులు స్వాహా చేసిన వ్యవహారం ఆ శాఖలో తీవ్ర కలకలం రేకెత్తిస్తోంది. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళగిరి పీఏసీఎస్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే ఏడాది కిందట జరిగిన ఈ అక్రమాలపై విచారణ పేరుతోనే సాగదీస్తున్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులే అక్రమాలలో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళగిరి సొసైటీలో ఇలా ఉంటే కురగల్లు సొసైటీలో కొందరు ఉద్యోగులే నకిలీ పత్రాలు సృష్టించి సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపైనా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇలా వారి వారి స్థాయిల్లో అక్రమార్కులు రైతుల సొమ్ము స్వాహా చేసి దర్జాగా తిరుగుతున్నారు. విచారణల పేరుతో సాగదీస్తుండటంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

● నిందితుల్లో ఒకరు మైనర్

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నల్లపాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు.. నల్లపాడు ఎస్‌ఐ మహేష్‌కుమార్‌కు అందిన పక్కా సమాచారం మేరకు.. ఆయన తన సిబ్బందితో కలిసి పలకలూరు రోడ్డు నుంచి జన్మభూమి నగర్‌కు వెళ్లే రోడ్డులో తనిఖీ చేశారు. గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకరు పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ ఒకటో లైనుకి చెందిన షేక్ ఖాజావలి కాగా, మరొకరు.. అంకమ్మనగర్ ప్రాంతానికి చెందిన పదహారేళ్ల మైనర్ అని తెలిపారు. వారి నుంచి మూడు కిలోల 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. లంబసింగి ప్రాంతం నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకు వచ్చినట్లు నిందితులు చెప్పారని తెలిపారు. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లలో ఉంచి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులు తమకు తెలిసిన గోపి అనే వ్యక్తికి గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పరారైన గోపీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

హేమతో ప్రేమ.. పెళ్లి



బాలీవుడ్‌లోని ఐకానిక్ ప్రేమ జంటల్లో ఒకటిగా ధర్మేంద్ర, హేమమాలిని గుర్తింపు తెచ్చుకున్నారు. 'తూ హసీనా మై జవాన్ తూ' చిత్రంతో రీల్ లైఫ్‌లో మొదలైన వారి అనుబంధం.. రియల్ లైఫ్ వరకూ సాగింది.. మరోవైపు నటులు సంజీవ్ కుమార్, జితేంద్ర హేమమాలిని వెంట పడేవారు. కానీ ఆమె మాత్రం ధర్మేంద్రకే మనసిచ్చారు. 'తూ హసీనా మై జవాన్ తూ' లీడ్ పెయిర్‌గా నటించిన ఈ ఇద్దరూ చిత్రీకరణ పూర్తయ్యే సరికి ప్రేమలో పడ్డారు. 'అయితే ప్రేమలో పడినంత సులభంగా వారి పెళ్లి జరగలేదు. హేమమాలినితో ప్రేమలో పడే సమయానికే ధర్మేంద్రకు ప్రకాశ్‌కౌర్‌తో పెళ్లై నలుగురు సంతానం ఉండేవారు. వారే సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. అలానే అప్పటికే పెళ్లైన వ్యక్తితో జీవితం ఎలా పంచుకుంటావు అని హేమమాలిని తల్లిదండ్రులు ఈ పెళ్లికి ససేమిరా అన్నారు. దాదాపు ఐదేళ్లు ప్రేమించుకున్నాక, వివాహం చేసుకుందాం అనే సమయానికి ప్రకాశ్ కౌర్ విడాకులకు అంగీకరించలేదు. అయినా అన్ని అడ్డంకులు దాటుకుని ప్రేమించుకున్న ఏడేళ్లకు వారు ఏడడుగులు వేశారు. పెళ్లయ్యాక వారికి ఇద్దరు కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ జన్మించారు. వారి వివాహ సమయంలోనూ పలు రూమర్స్ రావడం గమనార్హం. వారి పెళ్లికి హిందూ వివాహ చట్టం ప్రకారం న్యాయపరమైన సమస్యలు రావడంతో 1979లో ధర్మేంద్ర ముస్లింగా మారి హేమమాలినిని పెళ్లి చేసుకున్నారని.. ఇద్దరూ తమ పేర్లను దిలావర్, ఆయేషా బీగా మార్చుకున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయాన్ని చాలా కాలం వరకూ ధర్మేంద్ర ఖండించలేదు. 2004లో ఎలక్షన్లలో పోటీ చేస్తున్నప్పుడు స్పందించి, 'మతం మార్చుకునే అవసరం నాకు లేదు' అని స్పష్టం చేశారు.

బాలీవుడ్ హీ మ్యాన్



ఆ తరం అమ్మాయిలకు ఆయన కలల రాకుమారుడు. 'హీ మ్యాన్' అని నాటి యువతరం ప్రశంసలు అందుకొన్న ధర్మేంద్ర పూర్తి పేరు ధర్మేంద్ర కేవల్ కిషన్ డియోల్. నటుడు, నిర్మాత మాత్రమే కాకుండా రాజకీయ వేత్తగానూ పలువురి ప్రశంసలు అందుకొన్నారు. ఆరున్నర పదుల తన నటజీవితంలో 300కు పైగా చిత్రాల్లో నటించి అందగాడుగా, కమర్షియల్‌గా సక్సెస్ అయిన హీరోగా గుర్తింపు పొందారు. చిత్ర పరిశ్రమలో తనకు గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేకపోయినా నట వారసులే కాదు బయటి నుంచి వచ్చిన వారు కూడా హీరోలుగా రాణించగలరు అని నిరూపించారు ధర్మేంద్ర. తాను హీరోగా పరిశ్రమలో మంచి పొజిషన్ సంపాదించుకోవడమే కాకుండా తన కుటుంబం నుంచి మరికొందరు పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచారు ధర్మేంద్ర. తన కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ కూడా సినిమాల్లో తండ్రి వారసత్వం కొనసాగిస్తున్నారు.

19 ఏళ్లకే పెళ్లి

ధర్మేంద్ర 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని లూథియానా జిల్లా నస్రాలీ గ్రామంలో జన్మించారు. 1952లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 19 ఏళ్లకు ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు. కెరీర్ ఆరంభంలో చిన్న పాత్రల్లో నటించారు ధర్మేంద్ర. ఆయన నటించిన తొలి చిత్రం 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' 1960లో విడుదల అయింది. 'ఆయే మిలన్ కీ బేలా', 'ఫూల్ ఔర్ పత్తర్', 'ఆయే దిన్ బహార్ కే' వంటి చిత్రాలతో 60ల దశకంలోనే ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. 1960-80 మధ్య కాలంలో హీరోగా ఓ వెలుగు వెలిగారు. 'ఆంఖేన్', 'షికార్', 'సావన్ ఝూమ్ కే', 'బందినీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'జీవన్ మృత్యు', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'రాజా జానీ', 'జుగ్ను', 'యాదోంకి బారాత్', 'దోస్త్', 'షోలే', 'చరస్', 'ధర్మ వీర్' వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. 1973 ఆయన కెరీర్‌లోనే లక్కీ ఇయర్. ఆయన నటించిన ఎనిమిది చిత్రాలు బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. 1987లో వరుసగా ఏడు సూపర్ హిట్స్ అందుకున్నారు ఆయన. ఇవి కాకుండా ఒకే ఏడాది తొమ్మిది హిట్ చిత్రాలు.. ఇలా రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతూ సాటి హీరోలకు అందనంత దూరంగా ఉండేవారు ధర్మేంద్ర. ఇప్పటికీ ఆ రికార్డ్ ధర్మేంద్రకే సొంతం. ఆ రోజుల్లో మూడు, నాలుగు షిఫ్టుల్లో పని చేస్తూ బిజీగా ఉండేవారు.

తొలినాళ్లలో సాఫ్ట్, రొమాంటిక్ చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఆయన.. 1970 నుంచి యాక్షన్ మ్యాన్ అనే ఇమేజ్‌ను సొంతం చేసుకుని షోలే చిత్రంతో స్టార్ స్టేటస్ సంపాదించారు. బలమైన దేహదారుఢ్యంతో ఉండే ఆయన తెరపైన శక్తిమంతమైన యాక్షన్ రోల్స్‌తో అలరించేవారు. పోరాటాలు కూడా డూప్ లేకుండా చేసేవారు. అందుకే ఆయనను 'హీ మ్యాన్', 'యాక్షన్ కింగ్' అని పిలిచేవారు.


బయోపిక్ ఇష్టం లేదు

ధర్మేంద్ర బయోపిక్‌ను తెరకెక్కించడానికి ఆయనను చాలా మంది దర్శకనిర్మాతలు సంప్రదించినా సున్నితంగా తిరస్కరించేవారు. 'నా బయోపిక్ తెరకెక్కిస్తే, అందులో నాలా నటించే నటులు ఎవరూ కనిపించలేదు' అని ఆయన భావించడమే దానిక్కారణం.

అమితాబ్‌కు మాట సాయం



తొలినాళ్లలో ధర్మేంద్రతో అమితాబ్ 'షోలే' చేస్తున్న సమయమది. ఈ చిత్రం షూటింగ్ కోసం ధర్మేంద్రతో పాటు అమితాబ్ కూడా బెంగుళూరులో ఉండాల్సిన పరిస్థితి. అయితే అమితాబ్ బెంగుళూరులో ఉండడంతో బొంబాయిలో చాలా సినిమాల చిత్రీకరణలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని దర్శకుడు రమేశ్ సిప్పీకు చెబితే, 'ధర్మేంద్ర కేవలం మీ కోసం రెండు మూడు సినిమాలు రద్దు చేసుకుని వచ్చారు. ఆయన ఏమైనా అనుకుంటాడేమో... వెళ్లి అడుగు' అని రమేశ్ సిప్పీ అన్నారు. కానీ అప్పటికే సూపర్‌స్టార్ హోదాలో ఉన్న ఆయనకు ఈ విషయాన్ని చెప్పాలంటేనే సందేహిస్తున్నారు. నిర్మాతల బలవంతం మీద అమితాబ్.. 'మీరు వెళ్లమంటే బొంబాయి వెళ్లి మా నిర్మాతల పని పూర్తి చేస్తాను' అని ధర్మేంద్రను అడిగారు. ఆయన 'దానికేముంది.. ఇక్కడ పనిలేకపోతే వెళ్లండి.. నాకేం అభ్యంతరం లేదు' అని బదులిచ్చారు.



యాభై ఏళ్లు దాటిన పురుషుల్లో తలెత్తే ప్రధాన సమస్య ప్రోస్టేట్ గ్రంథి వాపు. ఈ 'బినైన్ ప్రోస్టటిక్ హైపర్‌ప్లేసియా'తో వేధించే మూత్ర సంబంధ సమస్యల నుంచి విముక్తి కోసం సురక్షితమైన, సౌకర్యవంతమైన 'ప్రోస్టేట్ ఎంబొలేజేషన్' చికత్సను ఎంచుకోవాలంటున్నారు వైద్యులు

ప్రోస్టేట్ గ్రంథి వాపు

సురక్షిత చికిత్స ఇదే!

పైబడే వయసుతో అంతర్గత అవయవాల్లో చోటు చేసుకునే కొన్ని మార్పులు, ఇతరత్రా అసౌకర్యాలను తెచ్చిపెడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా పురుషుల్లో 50 ఏళ్లు దాటిన తర్వాత మూత్రనాళాన్ని చుట్టి ఉండే ప్రోస్టేట్ గ్రంథి పరిమాణం పెరగడం మొదలుపెడుతుంది. ఇందుకు జన్యుపరమైన కారణాలతో పాటు, పురుష హార్మోన్ సంతులనం దెబ్బతినడం, మధుమేహం లాంటి ఇతరత్రా కారణాలున్నాయి. ఈ పరిస్థితి ప్రమాదకరం కాకపోయినా, పెరిగిన ప్రోస్టేట్ వల్ల మూత్రాశయం మీద ఒత్తిడి పెరిగి, మూత్ర సంబంధ అసౌకర్యాలు వేధించడం మొదలుపెడతాయి. అవేంటంటే..

- మూత్రవిసర్జన సంపూర్తిగా జరగకపోవడం
- పగలు ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయవలసి రావడం
- మూత్ర ప్రవాహం బలహీనంగా ఉండడం
- మూత్రాన్ని నియంత్రించుకోలేకపోవడం
- రాత్రివేళ మూడు నుంచి నాలుగుసార్లు మూత్ర విసర్జన చేయవలసి రావడం
- మూత్రవిసర్జన తర్వాత చుక్కలు చుక్కలుగా కారుతూ ఉండడం

పెద్ద వయస్కులు సాధారణంగా మూత్ర సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఈ సమస్యను నిర్లక్ష్యం చేసినప్పుడు, పరిస్థితి మరింత తీవ్రమై మూత్రాశయం, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మొదట్లోనే అప్రమత్తమవడం అవసరం. జనరల్ ఫిజీషియన్ లేదా యూరాలజిస్టును సంప్రతించి అల్ట్రాసౌండ్‌తో ప్రోస్టేట్ పరిమాణం తెలుసుకోవాలి. అలాగే ఇదే పరీక్షతో మూత్రవిసర్జన తదనంతరం మూత్రాశయంలో ఎంత మూత్రం మిగిలిపోతుందో వైద్యులు కనిపెట్టగలుగుతారు.



అలాగే యూరోఫ్లోమెట్రీ పరీక్షతో మూత్రవిసర్జన వేగాన్ని కూడా వైద్యులు అంచనా వేయగలుగుతారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రోస్టేట్ వాపును నిర్థారించుకోవచ్చు.

సర్జరీలతో సమస్యలు

సాధారణంగా ప్రోస్టేట్ పరిమాణం 20 గ్రాములు ఉంటుంది. ఇంతకంటే ఎక్కువగా కొందరికి 50, 100, 150 గ్రాముల వరకూ పెరిగిపోవచ్చు. బినైన్ ప్రోస్టటిక్ హైపర్‌ప్లేసియాను నిర్థారించుకున్న తర్వాత ఒకట్రెండు నెలల పాటు మందులు వాడుకుని, వాటితో లక్షణాలు అదుపులోకి రానప్పుడు, సర్జికల్ లేదా నాన్ సర్జికల్ చికిత్సలను ఎంచుకోవచ్చు. ట్రాన్స్ యురేత్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్ అనే సర్జరీలో భాగంగా మూత్రనాళం ద్వారా ప్రోస్టేట్ గ్రంథి మధ్య భాగాన్ని పాక్షికంగా కత్తిరించి, తొలగిస్తారు. ఈ సంప్రదాయ చికిత్సా విధానం 40 ఏళ్లుగా మనుగడలో ఉంది. గ్రంథి మరీ పెద్దగా ఉన్నప్పుడు ఇతరత్రా సర్జరీల సహాయంతో లేజర్‌ను ఉపయోగించి కత్తిరించి తొలగిస్తారు. తాజాగా కొన్ని మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు కూడా అందుబాటులోకొచ్చాయి. అయితే ఈ సర్జరీలన్నీ మూత్రనాళం ద్వారానే సాగుతాయి కాబట్టి సర్జరీ తదనంతరం కొన్ని దుష్ప్రభావాలకు కూడా ఆస్కారం ఉంటుంది. అవేంటంటే...

- మూత్రనాళంలో పూడికలు ఏర్పడే అవకాశం ఉంటుంది. వీటికి మళ్లీ ఇంకొక సర్జరీ అవసరం పడొచ్చు
- మూత్రం లీక్ అవుతూ ఉండడం
- మూత్రాన్ని ఆపులేకపోవడం
- యూరిన్ బ్యాగ్ వాడుకోవలసి రావడం
- వీర్యం బయటకు రాకుండా లోపలకు వెళ్లడం
- స్వల్ప అంగస్తంభన సమస్య

దుష్ప్రభావాలకు ఆస్కారం లేని సురక్షిత చికిత్స... ప్రోస్టేట్ ఎంబొలైజేషన్

యాంజియోగ్రఫీ పద్ధతిలో కాలు లేదా చేతిలోని రక్తనాళాల ద్వారా ప్రోస్టేట్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాన్ని చేరుకుని, దాన్ని మూసివేసే చికిత్స.. ప్రోస్టేట్ ఎంబొలైజేషన్. ఈ చికిత్సలో సమస్యకు కారణమైన రక్తనాళం లోపలకు చేరుకుని, ఎంబోస్ఫియర్స్ అనే పార్టికల్స్ లేదా ద్రవరూప జిగురును ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది. వీటితో రక్తనాళం మూసుకుపోయి, ప్రోస్టేట్‌కు ఆక్సిజన్ ఆగిపోయి, ఆ గ్రంథి మెత్తబడి, క్రమేపీ చిన్నదైపోతుంది. ఫలితంగా సంబంధిత సమస్యలన్నీ అదుపులోకొస్తాయి. దాదాపు 15 ఏళ్లుగా అందుబాటులో ఉన్న ఈ చికిత్సకు ఎఫ్‌డిఎ అనుమతి కూడా ఉంది. అమెరికన్ యూరలాజికల్ మార్గదర్శకాలతో పాటు యుకె, యూరప్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్ మార్గదర్శకాల్లో కూడా ఈ చికిత్స అనుమతి పొందింది. కాబట్టి ఇది ప్రయోగాత్మక చికిత్స కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ చికిత్సలో మూత్రనాళ ప్రమేయం ఉండదు కాబట్టి మూత్రనాళం దెబ్బతినే ప్రమాదం ఉండదు. కోత ఉండదు కాబట్టి రక్తస్రావ సమస్య ఉండదు. అనస్థీషియా అవసరం కూడా ఉండదు. చికిత్స ఒక్క రోజులోనే పూర్తయిపోతుంది కాబట్టి మరుసటి రోజు నుంచి పనులన్నీ చేసుకోవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా ఇది కోత లేని సర్జరీ కాబట్టి నరాలు దెబ్బతినే ప్రమాదం ఉండదు. ఫలితంగా చికిత్స తదనంతర లైంగిక సమస్యలు తలెత్తవు. అంగ స్తంభన సమస్య ఉండదు. అలాగే సర్జరీకి భయపడే పురుషులు, సర్జరీ చేయించుకోలేని పురుషులు, వృద్ధులు, హృద్రోగులు, రక్తం పలుచబడే మందులు వాడుకునేవాళ్లు అన్ని విధాలా సురక్షితమైన ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్సను ఎంచుకోవచ్చు.

అనుభజ్ఞులను ఎంచుకోవాలి

ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్స భద్రత, సత్ఫలితాల కోసం అనుభవమున్న వైద్యులనే ఎంచుకోవాలి. అలాగే అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ విత్ కోన్ బీమ్ సిటి సౌకర్యాన్ని కలిగి ఉండే ఆస్పత్రినే ఎంచుకోవాలి.

తిరగబెట్టొచ్చు

సర్జరీని ఎంచుకున్నా ప్రోస్టేట్ ఎంబొలైజేషన్‌ను ఎంచుకున్నా ప్రోస్టేట్ వాపు సమస్య దీర్ఘకాలంలో తిరగబెట్టే అవకాశాలు లేకపోలేదు. అయినప్పటికీ ఎటువంటి దుష్ప్రభావాలకూ ఆస్కారం లేకుండా ఉండాలనుకుంటే ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్సను ఎంచుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.

డాక్టర్ అర్జున్ రెడ్డి
చీఫ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్,
రివియా వాస్క్యులర్ ఇన్‌స్టిట్యూట్,
గచ్చిబౌలి, హైదరాబాద్



మీకు తెలుసా?

కుడికి బదులు ఎడమ



రోజూ చేసే చిన్న చిన్న పనులకు ఆధిపత్య చేతికి బదులుగా ఆధిపత్యం లేని చేతిని ఉపయోగించడం వల్ల మెదడు చురుగ్గా మారుతుందని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం చేపట్టిన అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

మన మెదడు చిన్న చిన్న సవాళ్లను ఇష్టపడుతుంది. కుడి చేత్తో పనులు చేసే అలవాటున్నవాళ్లు అవే పనులను ఎడమ చేత్తో చేయడం మొదలుపెడితే మెదడులో కొత్త నాడీ సంబంధాలు ఏర్పడతాయి. శాస్త్రవేత్తలు దీన్నే న్యూరోప్లాస్టిసిటీ అంటూ ఉంటారు. ఇలా ఆధిపత్యం లేని చేతిని ఉపయోగించడం వల్ల మెదడు చురుకుదనం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంతులనం కూడా పెరుగుతాయి. కాబట్టి కుడి చేత్తో దంతధావనం చేసుకునేవారు ఎడమచేత్తో బ్రష్ చేసుకోవడం మొదలుపెట్టొచ్చు. నిజానికి రెండు నిమిషాల నిడివితో కూడిన దైనందిన చర్య ఇది. అయినప్పటికీ ఈ స్వల్ప సమయమే మెదడుకు వ్యాయామంగా మారి, నాడీ సంబంధాలను పెంచుతుంది.

తెలుసుకుందాం

పోషక లోపాలు... లక్షణాల రూపంలో...

పోషక లోపాలు లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే! అయితే లక్షణాల ఆధారంగా పోషక లోపాలను గ్రహించే విషయంలో మనం పొరపాటు పడుతూ ఉంటాం. వాటిని కచ్చితంగా ఎలా కనిపెట్టాలంటే...

మెగ్నీషియం: కండరాల నొప్పులకు కారణం మెగ్నీషియం లోపంగా భావిస్తాం. అయితే మెగ్నీషియం లోపం ప్రధానంగా ఒక లక్షణం ద్వారా బయల్పడుతుంది. కన్ను పదే పదే అదురుతూ ఉంటే, దాన్ని మెగ్నీషియం లోపంగా పరిగణించాలి. మెగ్నీషియం 300 రకాల స్పందనలను, ప్రత్యేకించి కండరాలు, నాడుల స్పందనలను క్రమబద్ధీకరిస్తుంది.

విటమిన్ డి: ఎముకల బలహీనత ద్వారా ఈ పోషకలోపం బయల్పడుతుందని భావిస్తాం. కానీ రుతుపరమైన విచారం విటమిన్ డి లోపంగా పరిగణించాలి. విటమిన్ డి... విటమిన్ కంటే ఎక్కువగా హార్మోన్‌గా పని చేస్తూ, సెరటోనిన్ హార్మోన్‌ను క్రమబద్ధీకరిస్తుంది. కాబట్టి శరీరానికి ఎండ సోకకపోతే, సెరటోనిన్ విడుదలకు సిగ్నల్ అందక, విచారం వేధిస్తుంది



విటమిన్ బి12: శక్తి సన్నగిల్లితే విటమిన్ బి12 లోపంగా భావిస్తాం. అయితే, చేతులు, అరికాళ్లలో తిమ్మిర్లు ఈ పోషకలోపం ప్రధాన సంకేతం. బి12, కొవ్వు, ప్రొటీన్‌తో కూడిన నాడీ పైపొర అయిన మైలిన్ షీత్‌ను క్రమబద్ధీకరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే, నాడీ సంకేతాలు గాడి తప్పి షార్ట్‌సర్క్యూట్ అవుతూ ఉంటాయి. ఫలితంగా తిమ్మిర్లు వేధిస్తాయి

ప్రొటీన్: ఈ లోపం వల్ల కండరాలు క్షీణిస్తాయని అనుకుంటాం. నిజానికి ఈ లోపం నిరంతర ఆకలి రూపంలో బయల్పడుతుంది. ప్రొటీన్ ఆకలితో ముడిపడి ఉండే గ్రెలిన్, లెప్టిన్ హార్మోన్లను నియంత్రిస్తుంది. కాబట్టి ఈ పోషకం తగ్గినప్పుడు, ఆకలి పెరుగుతుంది

జింక్: జుట్టు రాలడం ఈ పోషకలోపం ప్రధాన లక్షణం కాదు. రుచి, వాసనలను కోల్పోవడం ఈ పోషకలోపం ప్రధాన లక్షణాలు. ఇంద్రియ రిసెప్టార్లు, వ్యాధినిరోధకశక్తికీ జింక్ కీలకం. ఈ పోషకం లోపిస్తే, ఇంద్రియాలు సామర్థ్యం కోల్పోతాయి

సీజనల్ కేర్

చలికాలం వ్యాధులకు దూరంగా...



సూప్: బోన్ సూప్, వెజిటబుల్ సూప్‌లు శరీరానికి అవసరమైన ఖనిజలవణాలనూ, అమీనో ఆమ్లాలనూ సమకూర్చి, వ్యాధినిరోధకశక్తిని పెంచుతాయి.

జలుబు, జ్వరం: దంచిన వెల్లుల్లి, తేనె కలిపిన మిశ్రమం శక్తివంతమైన సహజసిద్ధ విరుగుడుగా పని చేస్తుంది. జలుబు, జ్వరం, ఇన్‌ఫెక్షన్లు వేధించినప్పుడు ఈ మిశ్రమాన్ని తీసుకుంటే వీటి నుంచి ఉపశమనం కలుగుతంది

ఉబ్బసం: వేడి పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగడం వల్ల ఉబ్బసం, దగ్గు, జలుబుల నుంచి ఊరట కలుగుతుంది

నిమ్మరసం: పరగడుపున గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం కలుపుకుని తాగడం వల్ల విషాలు బయటకు వెళ్లిపోయి, జీర్ణశక్తి, వ్యాధినిరోధకశక్తి మెరుగవుతాయి

ముక్కు దిబ్బెడ: వేడి నీళ్లలో యూకలిప్టస్, పెప్పర్‌మింట్ నూనెలు కలిపి ఆవిరి పడితే, ముక్కు దిబ్బెడ వదులుతుంది. శ్వాసకోస నాళాలు తెరుచుకుని, శ్వాస ఇబ్బంది సమస్య తొలగిపోతుంది.

వైద్య సంచలనం

జీన్ థెరపీకి తలవంచుతున్న అరుదైన వ్యాధి

కొన్ని అరుదైన జన్యు వ్యాధులు అర్థాంతరంగా జీవితాన్ని అంతం చేస్తాయి. అలాంటివాటిలో హంటర్ సిండ్రోమ్ ఒకటి. ప్రత్యేకించి బాలలను మాత్రమే ప్రభావితం చేసే ఈ రుగ్మత తాజాగా ప్రయోగాత్మక జన్యు చికిత్సకు తలవంచినట్టు తేలింది. ఈ చికిత్స గురించిన ఆసక్తికరమైన వివరాలు...

ప్రధానంగా మగపిల్లలనే ప్రభావితం చేసే హంటర్ సిండ్రోమ్, నెమ్మదిగా శరీరంలో శోషించుకోడానికి వీల్లేని పదార్థాలను నింపేసి మరణానికి చేరువ చేస్తుంది. పుట్టిన రెండేళ్ల తర్వాత లక్షణాలను కనబరిచే ఈ రుగ్మత 20 ఏళ్ల వయసులోపు లేదా అంతకంటే పిన్న వయసులోనే ప్రాణాలను తీస్తుంది. సాధారణంగా శరీరం కణాల్లోని వ్యర్థాలను తొలగించుకోవడం కోసం, శుభ్రపరిచే పనిముట్లను పోలిన ప్రత్యేకమైన ఇంజైమ్స్‌ను ఉపయోగించుకుంటుంది. తప్పుడు జన్యువు మూలంగా హంటర్ సిండ్రోమ్‌లో ఐడిఎస్ అనే ఒక ఎంజైమ్ తయారు కాదు. ఈ ఎంజైమ్ లేకుండా, చక్కెరను పోలిన పరమాణువులు శరీరంలోని భిన్న అవయవాల్లో పేరుకుపోయి, భిన్నమైన సమస్యలను తెచ్చిపెడతాయి. క్రమేపీ ముఖకవళికలు మారిపోతాయి. పిల్లల ఎత్తు పెరగడం ఆగిపోతుంది. కీళ్లు బిగుసుకుపోతాయి. వినికిడి కోల్పోతారు. గుండె, శ్వాస సమస్యలు తలెత్తుతాయి. వీటికి తోడు మెదడు దెబ్బతిని నేర్పరితనం తగ్గిపోతుంది. ఇలాంటి హంటర్ సిండ్రోమ్‌కు గురైన ఆలివర్ చూ అనే రెండేళ్ల పిల్లాడికి క్లినికల్ ట్రయల్‌లో భాగంగా వైద్యులు తయారుకాని ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయగలిగేలా, జన్యుమార్పిడి చేసిన మూల కణాలను ఇంజెక్షన్ రూపంలో ఇవ్వడం జరిగింది.

మూల కణ చికిత్సతో...

2024 డిసెంబరులో, మాంచెస్టర్‌లో ఆలివర్ నుంచి మూల కణాలను సేకరించి, వాటిని లండన్‌లోని గ్రేట్ ఆర్మండ్ స్ట్రీట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ, మార్పు చేసిన వైరస్‌లోకి ఐడిఎస్ జన్యువును చొప్పించారు. ఈ జన్యువు, రక్తం, మెదడుల అవరోధాన్ని దాటుకుని ప్రయాణించగలిగే ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆలివర్‌కు, పన్నెండున్నర కోట్ల మార్పు చెందిన మూలకణాలతో కూడిన రెండు ఇంజెక్షన్లను ఇవ్వడం జరిగింది. చికిత్స పూర్తయిన మూడు నెలల నుంచి ఆలివర్‌లో మెరుగుదల లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు కనిపెట్టారు. ఆలివర్ కదలికలు పెరిగినట్టు బాబు తల్లితండ్రులు పేర్కొనడం, వారు చెప్పినట్టే, పిల్లాడికి చేపట్టిన పరీక్షల్లో బాబు శరీరం, సొంత ఎంజైమ్స్ ఉత్పత్తి చేసుకుంటున్నట్టు ఫలితాల్లో తేలడంతో, ప్రతివారం ఇవ్వవలసిన ఎంజైమ్ ఇన్‌ఫ్యూషన్స్‌ను వైద్యులు నిలిపివేశారు. చికిత్స మొదలుపెట్టిన తొమ్మిది నెలలకు, గత ఆగష్టులో చేపట్టిన పరీక్షల్లో ఆలివర్, సాధారణ మోతాదు కంటే కొన్ని వందల రెట్లు ఎంజైమ్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నట్టు తేలింది. ఏడాది తర్వాత ఆలివర్, మాటలు, కదలికలు, తెలివితేటల పరంగా మెరుగుపడినట్టు వైద్యులు కనిపెట్టి, ఇందుకు జన్యు చికిత్స తోడ్పడినట్టు నిర్థారించారు.

మరికొన్ని జన్యువ్యాధులకు...

సాధారణంగా ఈ చికిత్స తీసుకున్న పిల్లలను కనీసం రెండేళ్ల పాటు వైద్యులు పర్యవేక్షించి, జన్యు చికిత్స ప్రభావాన్ని నిర్థారిస్తారు. తాజా విజయంతో ఇదే తరహా చికిత్సను హర్లర్ సిండ్రోమ్, శాన్‌ఫ్లిప్పో సిండ్రోమ్‌లాంటి మరికొన్ని జన్యుపరమైన వ్యాధులకు ఉపయోగించే దిశగా వైద్యులు సన్నాహాలకు పూనుకుంటున్నారు.



సైకాలజీ



ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి, ఆందోళనలు అత్యంత సహజం. అయితే వీటికి విరుగుడుగా ఆశ్రయించే మార్గాలు సమస్యను పరిష్కరించేలా ఉండాలే తప్ప మరింత జటిలం చేసేలా ఉండకూడదు. మరీ ముఖ్యంగా ఒత్తిడిని ప్రారంభంలోనే చిత్తు చేయాలే తప్ప ముదిరి మానసిక సమస్యలకు దారి తీసేవరకూ తాత్సారం చేయకూడదు అంటున్నారు మానసిక వైద్యులు

ఒత్తిడిని చిత్తు చేయకపోతే

పరీక్ష ముందు ఒత్తిడే లేకపోతే అందుకు తగ్గట్టు సిద్ధపడం. కాబట్టి ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ఒత్తిడి అవసరమే! అయితే ఒత్తిడి మన సామర్థ్యాన్ని పెంచి ప్రయోజనాన్ని అందించేలా ఉండాలి. ఆందోళనకు దారి తీసి జీవితంలో వెనకపడేలా చేయకూడదు. అయితే ఒక్కోసారి ఒత్తిడి పెరగడం వల్ల నిద్రలేమి, భావోద్వేగాలు అదుపుతప్పడం, అలసట, ఒంటి నొప్పులు, పనిసామర్థ్యం తగ్గడం, అవసరానికి మించి కష్టపడవలసి రావడం లాంటి ఇబ్బందులన్నీ ఉంటాయి. ఒత్తిడి వల్ల వ్యాధినిరోధకశక్తి తగ్గి తేలికగా అస్వస్థతకు గురవుతూ ఉంటా రు. అయినప్పటికీ రోజువారీ పనులు చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందీ ఎదురవ్వదు. ఈ దశ దాటి ఆందోళన, మానసిక కుంగుబాటు సమస్యలు మొదలై, వృత్తిపర, వ్యక్తిగత సమస్యలు తలెత్తుతాయి. పనిలో నాణ్యత లోపించడంతో పాటు, కుటుంబంలో కీచులాటలు మొదలవుతాయి. గుండెదడ, చమటలు పట్టడం, తీవ్రమైన ప్యానిక్ అటాక్స్ లక్షణాలు కనిపిస్తాయి. అసిడిటీ, అధిక రక్తపోటు, అధిక మధుమేహం సమస్యలు మొదలవుతాయి. ఈ పరిస్థితి జీవన నాణ్యతను దెబ్బతీస్తుంది. కాబట్టి ఒత్తిడికి లోనవుతున్నట్టు గుర్తించిన వెంటనే దాన్ని వదిలించుకునే ఆరోగ్యకరమైన మార్గాల కోసం అన్వేషించాలి.

ఒత్తిడి ఇలా దూరం

ఒత్తిడికి మూల కారణంతో వ్యవహరించే విధానం మీదే ఒత్తిడి ప్రభావం ఆధారపడుతుంది. ఒత్తిడిని అంగీకరించడం, మార్చుకోవడం, తప్పించుకోవడం... ఈ మూడు సూత్రాలను ఎవరికి తగ్గట్టు వారు అనుసరించాలి. తప్పించుకోగలిగే ఒత్తిడిలు కొన్ని ఉంటాయి. మార్చుకునే వీలుండేవి కొన్ని ఉంటాయి. కానీ అంగీకరించి తదనుగుణంగా నడుచుకోవడం మినహా మరేమీ చేయలేని ఒత్తిడిలు కూడా ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రాణాయామం, ధ్యానం, వ్యాయామాలతో ఒత్తిడిని వదిలించునే ప్రయత్నాలు చేయాలి. పెంపుడు జంతువులతో సమయాన్ని గడపడం, ఆప్తులతో బాధలు పంచుకోవడం, అభిరుచులకు సమయం కేటాయించడం, నచ్చిన పనులు చేయడం ద్వారా కూడా ఒత్తిడిని వదిలించుకోవచ్చు. అలాగే పరిస్థితులను మన నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. నియంత్రణలో లేని వాటిని అంగీకరించి ఒత్తిడికి లోనవకుండా రిలాక్సేషన్ టెక్నిక్స్ అనుసరించాలి.

చికిత్స తప్పనిసరి

ఒత్తిడి, యాంగ్జయిటీ డిజార్డర్‌గా మారినప్పుడు తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలి. విపరీతమైన ఒత్తిడితో మెదడులో న్యూరోట్రాన్స్ మీటర్ల పనితీరులో కూడా హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి. కాబట్టి మందులతో మొదట ఆ హెచ్చుతగ్గులను సరిదిద్దుకుని, ఒత్తిడితో వ్యవహరించగలిగే మెలకువలు అలవరుచుకోవాలి.

గాడి తప్పే మార్గాలు

కొందరు ఒత్తిడిని వదిలించుకోవడం కోసం దురలవాట్లకు దగ్గరవుతారు. మద్యం, ధూమపానం, గంజాయిలతో ఒత్తిడిని వదిలంచుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇంకొందరు ఆ మార్గాన్ని ఆహారంలో వెతుక్కుని ఈటింగ్ డిజార్డర్‌కు లోనవుతారు. ధూమపానం, మద్యపానం, గంజాయి విషయానికొస్తే, ఎలాంటి దురలవాట్లలో అయినా ఫిజికల్ డిపెండెన్స్, సైకలాజికల్ డిపెండెన్స్ అనే రెండు సమస్యలుంటాయి. మద్యం, ధూమపానం మానుకున్నప్పుడు, వణుకు, నిద్రలేమి, చమటలు పట్టడం లాంటి భౌతిక లక్షణాలు కనిపిస్తాయి. కానీ గంజాయిలో మానసిక లక్షణాలు మినహా ఎలాంటి భౌతిక లక్షణాలూ కనిపించవు కాబట్టి ఈ అలవాటు సురక్షితమైనదనే ప్రచారం సాగుతోంది. కానీ నిజానికి గంజాయిలో సైకలాజికల్ డిపెండెన్స్ ఎక్కువ. చికాకు, కోపం, దుందుడుకుతనం, గంజాయి తీసుకోవాలనే బలమైన కోరికకు లోనవడం, అందుకోసం ఎంతకైనా తెగించడం లాంటి తీవ్రమైన మానసిక లక్షణాలుంటాయి. దాని కోసం నేరాలకు కూడా పాల్పడతారు. ఎదుటివారి మీద దాడులకు తెగబడడానికి, హాని కలిగించడానికి కూడా వెనకాడరు. మద్యపానం, ధూమపానం మానేసినప్పుడు తలెత్తే భౌతిక లక్షణాలను చికిత్సతో సరిచేసే వీలుంది. కానీ గంజాయి సంబంధిత మానసిక లక్షణాలకు చికిత్స సంక్లిష్టమవుతుంది. అలాగే కొందరు దుర్బలుల్లో గంజాయి అలవాటు, జన్యుపరమైన మార్పులకు దారి తీసి, స్కిజోఫ్రేనియా అనే ప్రధాన మానసిక సమస్యకు లోను చేస్తుంది. ఈ అలవాటును వదిలించడం కోసం మోటివేషన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ థెరపీలో భాగంగా కౌన్సెలింగ్ సెషన్స్, డిఅడిక్షన్ చికిత్సలు తీసుకోవాల్సి ఉంటుంది.

గంజాయి అలవాటును ఇలా కనిపెట్టొచ్చు

- కళ్లు ఎర్రబడతాయి
- గంజాయి వాసన అంటిపెట్టుకుని ఉంటుంది
- గంజాయి దొరకనప్పుడు కోపం, చికాకుకు లోనవుతూ ఉంటారు
- గదులకే పరిమితమవుతూ ఉంటారు
- కళ్లలోకి సూటిగా చూడలేకపోవడం
- చదువులో, వృత్తిలో వెనకబడడం

డాక్టర్ సుధారాణి
ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఒడి,
గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ కేర్,
ఎర్రగడ్డ, హైదరాబాద్



స్పోర్ట్స్

సుదర్శన్ నిర్లక్ష్యం.. విచక్షణలేని జురెల్.. బాధ్యతలేని పంత్.. వెరసి బ్యాటింగ్‌లో మరోసారి కుప్పకూలిన టీమిండియా.. సొంతగడ్డపై మరో వైట్‌వాష్‌కు చేరువైంది. బ్యాట్‌తో అదరగొట్టిన యాన్సెన్.. బౌలింగ్‌లోనూ చెలరేగి షార్ట్ బాల్స్‌తో భారత మిడిలార్డర్ వెన్నువిరిచాడు. దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసిన చోట.. ఘనత వహించిన మన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. టెయిలెండర్ కుల్దీప్ చూపిన పట్టుదలను కూడా ప్రదర్శించలేకపోయారు. దీంతో సొంతగడ్డపైనే ఫాలో-ఆన్‌లో పడిన ఘోర దుస్థితి..! ప్రత్యర్థి కెప్టెన్ వద్దనుకొన్నాడు కాబట్టి ఆ అవమానం తప్పింది. అయితే, భారత గడ్డపై టెస్ట్ మ్యాచ్ గెలవడమే అద్భుతం అనుకొన్న సఫారీలకు.. అరుదైన క్లీన్‌స్వీప్ ఊరిస్తోంది..!!


సాయి సుదర్శన్ (15)


పంత్ (7)

యాన్సెన్ వేట

మన బ్యాట్లు బోల్తా

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 ఆలౌట్

రాణించిన జైస్వాల్, సుందర్ • 314 రన్స్ ఆధిక్యంలో దక్షిణాఫ్రికా

రెండో టెస్ట్


జడేజా (6)


యాన్సెన్ (6/48)

గువాహటి: బ్యాటర్ల నిర్లక్ష్యంతో సొంతగడ్డపై భారత్‌కు మరో ఘోర పరాభవం తప్పేట్టు లేదు. మార్కో యాన్సెన్ (6/48) షార్ట్ బాల్స్ వ్యూహానికి మనోళ్లు బెంబేలెత్తారు. దీంతో భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకొన్న పర్యాటక దక్షిణాఫ్రికా రెండో టెస్ట్‌లో పట్టుబిగించింది. మరో రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో ఏదో అద్భుతం జరిగితే తప్ప టీమిండియా క్లీన్‌స్వీప్‌ను తప్పించుకోవడం కష్టమే..! ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 9/0తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 201 పరుగులకు కుప్పకూలింది. జైస్వాల్ (58), వాషింగ్టన్ సుందర్ (48) మినహా మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. సైమన్ హార్మర్ మూడు వికెట్లు పడగొట్టాడు. మార్‌క్రమ్ ఏకంగా ఐదు క్యాచ్‌లు పట్టి భారత పతనంలో కీలక భూమిక పోషించాడు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరు 489కి భారత్ 288 పరుగులు వెనుకబడింది. అయితే, ప్రత్యర్థిని ఫాలో-ఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 26/0 స్కోరు చేసింది. సోమవారం ఆట ఆఖరుకు ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (13), మార్‌క్రమ్ (12) క్రీజులో ఉన్నారు. మొత్తంగా సఫారీలు 314 పరుగుల ఆధిక్యంలో ఉన్నారు. సుమారు ఇంకో 40-50 ఓవర్లు ఆడి 500 రన్స్‌కు దగ్గర్లో లక్ష్యాన్ని టీమిండియా ముందుంచే అవకాశం ఉంది.

ఆరంభం నిలకడగా..: తొలి సెషన్‌లో భారత్ నిలకడగా స్కోరు చేసినా.. యాన్సెన్ దెబ్బకు ఒక్కసారిగా తడబడింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్ (22) జట్టుకు శుభారంభాన్ని అందించారు. అయితే, స్పిన్నర్ కేశవ్ బౌలింగ్‌లో బౌన్స్ అయిన బంతిని ఆడే క్రమంలో రాహుల్ స్లిప్స్‌లో క్యాచిచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, జైస్వాల్, సాయి సుదర్శన్ (15) రెండో వికెట్‌కు 30 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న జైస్వాల్.. హార్మర్ బౌలింగ్‌లో భారీషాట్ ఆడే క్రమంలో అవుటవడంతో టీమిండియా బ్యాటింగ్ కుదుపులకు లోనైంది. బ్యాటర్ల బాధ్యతారాహిత్యమైన షాట్ల కారణంగా కేవలం 27 పరుగుల తేడాతో.. అంటే 95/1 నుంచి 122/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. హార్మర్ బౌలింగ్‌లో పేలవ షాట్ ఆడిన సుదర్శన్ క్యాచవుట్ కాగా.. జురెల్ (0)ను డకౌట్ చేసిన యాన్సెన్ భారత్ పతనానికి నాందిపలికాడు. కెప్టెన్ రిషభ్ పంత్ (7), జడేజా (6) కొంతసేపు క్రీజులో నిలవడంతో టీ సమయానికి భారత్ 102/4తో నిలిచింది.

మిడిల్ ఢమాల్: టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టిన వేళ.. ఎనిమిదో వికెట్‌కు 72 పరుగులు జోడించిన సుందర్, కుల్దీప్ (19) టీమ్ స్కోరును 200 మార్క్ దాటించారు. రెండో సెషన్ ఆరంభంలోనే యాన్సెన్‌పై ఎదురుదాడి చేద్దామనుకొన్న పంత్ చెత్తగా ఆడి వికెట్ పారేసుకొన్నాడు. ముందుకు వచ్చి ఆడే క్రమంలో మిస్ టైమ్ కావడంతో ఎడ్జ్ తీసుకొన్న బంతి కీపర్ చేతుల్లో పడింది. నితీశ్ (10), సీనియర్ బ్యాటర్ జడేజాను యాన్సెన్ షార్ట్ బాల్స్‌తో బోల్తా కొట్టించాడు. అయితే, సుందర్, కుల్దీప్ ఎదురు నిలవడంతో టీమిండియా 174/7తో లంచ్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో మరో 27 పరుగులు జోడించిన టీమిండియా మిగతా మూడు వికెట్లు చేజార్చుకొంది. ఫిఫ్టీకి చేరువలో ఉన్న సుందర్‌ను హార్మర్ క్యాచవుట్ చేయగా.. కుల్దీప్, బుమ్రా (5)ను వెనక్కిపంపిన యాన్సెన్ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489 ఆలౌట్;

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 58, రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 22, సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) హార్మర్ 15, జురెల్ (సి) కేశవ్ (బి) యాన్సెన్ 0, పంత్ (సి) వెరిన్నే (బి) యాన్సెన్ 7, జడేజా (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 6, నితీశ్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 10, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 48, కుల్దీప్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 19, బుమ్రా (సి) వెరిన్నే (బి) యాన్సెన్ 5, సిరాజ్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 83.5 ఓవర్లలో 201 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-65, 2-95, 3-96, 4-102, 5-105, 6-119, 7-122, 8-194, 9-194; **బౌలింగ్:** యాన్సెన్ 19.5-5-48-6, ముల్డర్ 10-5-14-0, కేశవ్ మహరాజ్ 15-1-39-1, హార్మర్ 27-6-64-3, మార్‌క్రమ్ 10-1-26-0, ముత్తుసామి 2-0-2-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (బ్యాటింగ్) 13, మార్‌క్రమ్ (బ్యాటింగ్) 12; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 8 ఓవర్లలో 26/0; బౌలింగ్:** బుమ్రా 3-0-13-0, సిరాజ్ 3-1-8-0, జడేజా 1-0-2-0, కుల్దీప్ 1-0-2-0.



కబడ్డీ కిరీటం

మళ్లీ మనదే

మహిళల ప్రపంచకప్ విజేత భారత్

ఢాకా: డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుసగా రెండోసారి మహిళల కబడ్డీ వరల్డ్‌కప్ ట్రోఫీని కైవసం చేసుకొంది. సోమవారం ఇక్కడ జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో భారత్ 35-28 స్కోరుతో చైనీస్ తైపీని ఓడించి విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన తైపీ ఆహ్వానం మేరకు భారత్ తొలి రైడ్‌కు వెళ్లి శుభారంభం చేసింది. ఆట ప్రథమార్ధం ముగింపు వరకు నువ్వా-నేనా అన్నట్టు సాగగా, చివరిలో సంజు చేసిన సూపర్ రైడ్‌తో భారత్ 20-16తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్ధంలో భారత డిఫెండర్లు పూనమ్, సొనాలీ అద్భుతమైన ట్యాకిల్స్‌తో ప్రత్యర్థి దూకుడుకు కళ్లెం వేశారు. తైపీ ఒక దశలో గట్టి పోటీ ఇచ్చినా భారత్ పాయింట్ల అంతరం మాత్రం తగ్గకుండా ఆటను ముందుకు తీసుకెళ్లింది. భారత స్టార్ రైడర్ సంజూదేవి చివర్లో మరోసారి మెరవడంతో దేశానికి వరల్డ్‌కప్ దక్కింది. ఈ వరల్డ్‌కప్‌లో అద్భుత ఆటతీరు కనబర్చిన సంజూదేవికి 'అత్యంత విలువైన క్రీడాకారిణి అవార్డు' లభించింది. 2012లో భారత్ తొలిసారి వరల్డ్‌కప్ నెగ్గింది. ఆ తర్వాత ఈ టోర్నీ జరగడం ఇప్పుడే. మొత్తం 12 దేశాలు పాల్గొన్న ఈ లీగ్‌లో గ్రూప్ దశలో థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండాపై నెగ్గిన భారత్ సెమీస్‌లో ఇరాన్‌ను ఓడించింది.



పసిడి ప్రాంజలి

బధిర ఒలింపిక్స్

టోక్యో: బధిర ఒలింపిక్స్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత షూటర్ ప్రాంజలి ప్రశాంత్ ధూమల్ అదరగొట్టింది. ఫైనల్లో ఆద్యంతం ఆధిపత్యం చెలాయించిన ప్రాంజలి స్వర్ణ పతకం దక్కించుకుంది. ఉక్రెయిన్, కొరియా రజత, కాంస్య పతకాలు గెలుపొందాయి. ఈ ఒలింపిక్స్‌లో ధూమల్‌కిది మూడో పతకం. ఇంతకుముందు పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో స్వర్ణం, 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత కేటగిరీలో రజతం నెగ్గింది.

పెళ్లి వేడుకల ఫొటోలు తొలగించిన స్మృతి

ముంబై: తండ్రి శ్రీనివాస్ అస్వస్థతకు గురవడంతో టీమిండియా క్రికెటర్ స్మృతీ మంధాన.. బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో వివాహాన్ని చివరి నిమిషంలో వాయిదా వేసుకుంది. అయితే, ఇప్పుడు స్మృతి తన పెళ్లి ముందస్తు వేడుకలకు సంబంధించిన అన్ని ఫొటోలను సోషల్ మీడియా ఖాతా నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. రెండ్రోజుల క్రితం డీవై పాటిల్ స్టేడియంలో పలాష్ రింగ్ తొడిగి ఎంగేజ్‌మెంట్ చేసుకున్న వీడియో కూడా స్మృతి ఖాతా నుంచి మాయమైంది. అంతేకాదు.. హల్దీ, మెహందీ, సంగీత్ వేడుకల్లో పాల్గొని సందడి చేసిన సహచర క్రికెటర్లు జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ తదితరులు కూడా తమ సోషల్ మీడియా నుంచి ఫొటోలను తొలగించడం గమనార్హం. దీంతో ఏం జరిగిందోనంటూ అనేకమంది నెట్టింట పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ ఫొటోలు, వీడియోలను స్మృతి కావాలనే తొలగించిందా లేదంటే హైడ్‌లో ఉంచిందా? అంటూ చర్చించుకుంటున్నారు. మరోవైపు స్మృతి కాబోయే భర్త పలాష్ ముచ్చల్ కూడా ఇన్‌ఫెక్షన్, ఎసిడిటీతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స అనంతరం అతడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు.

శ్రీకాంత్, ప్రణయ్ సత్తా చాటేనా?

నేటినుంచి సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. ఈ టోర్నీలో సత్తాచాటి సీజన్‌ను ఘనంగా ముగించాలని సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్ భావిస్తున్నారు. భారత్ నుంచి సింగిల్స్‌లో ఉన్నతి, ఆకర్షి, డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, అర్జున్/హరిహరన్ బరిలో ఉన్నారు.

చెస్ వరల్డ్‌కప్ ఫైనల్ తొలి గేమ్ డ్రా

పనాజీ: చెస్ వరల్డ్‌కప్ ఫైనల్లో జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), వీ యి (చైనా) మధ్య సోమవారం జరిగిన తొలి క్లాసికల్ గేమ్ డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరికి చెరో అర పాయింట్ లభించింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో నోడిర్బెక్ యకుబ్బెవ్(ఉజ్బెకిస్థాన్)పై ఆండ్రీ ఎసిపెంకో (రష్యా) గెలిచాడు.

భారత్-బెల్జియం మ్యాచ్ నేటికి వాయిదా

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భాగంగా భారత్, బెల్జియం జట్ల మధ్య సోమవారం జరగాల్సిన మ్యాచ్ ప్రతికూల వాతావరణం వల్ల మంగళవారానికి వాయిదా పడింది. ఆట మొదలైన మూడు నిమిషాల తర్వాత భారీవర్షం కురియడంతో వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,130 ▼	1,14,700 ▼	1,71,000 ▲
విజయవాడ	1,27,000 ▼	1,20,000 ▲	1,58,000 ▼
విశాఖపట్నం	1,27,150 ▲	1,15,350 ▲	1,71,000 ▼
రాజమండ్రి	1,25,130 ▼	1,14,700 ▼	1,56,000 ▼
ప్రొద్దుటూరు	1,24,400 ▲	1,14,450 ▲	1,57,700 ▲
ముంబై	1,23,310 ▲	1,12,950 ▲	1,53,650 ▲

పైలట్ల శిక్షణలోకి అదానీ!



ఎఫ్ఎస్‌టీసీ కొనుగోలుపై ఫోకస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పైలట్ల శిక్షణ వ్యాపారంలో ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం, అదానీ గ్రూప్‌నకు చెందిన డిఫెన్స్, ఏరోస్పేస్ అనుబంధ విభాగం పైలట్లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్‌ను (ఎఫ్ఎస్‌టీసీ) కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన చర్చలు పురోగతిలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2012లో ప్రారంభమైన ఎఫ్ఎస్‌టీసీ.. హైదరాబాద్, ముంబై, గురుగ్రామ్ నగరాల్లో సిమ్యులేటర్ సెంటర్లను కలిగి ఉంది.. హర్యానా, సూరత్, షోలాపూర్‌లలో ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీలు కూడా నిర్వహిస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ (ఏడీఎస్‌టీ), ఫ్లైమ్ ఏరోల సమ భాగస్వామ్య సంస్థ హొరిజాన్ ఏరో సొల్యూషన్స్ ద్వారా ఎఫ్ఎస్‌టీసీ కొనుగోలు జరిపే అవకాశం ఉన్నదంటున్నారు. ఏడీఎస్‌టీకి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రమోటర్‌గా ఉండగా.. ఎన్‌సీపీ నాయకుడు, పౌర విమానయాన శాఖ మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్ కుమారుడైన ప్రజయ్ పటేల్ నిర్వహణలోని సంస్థ ఫ్లైమ్ ఏరో. గత ఏడాది డిసెంబరులో ఎయిర్‌వర్క్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలు ద్వారా విమానాల నిర్వహణ, మరమ్మతు విభాగంలోకి ప్రవేశించిన ఏడీఎస్‌టీ.. ఆ తర్వాత కాలంలో ఇదే విభాగానికి చెందిన మరో సంస్థ ఇండామెర్ టెక్నిక్స్‌లోనూ 50 శాతం వాటా కొనుగోలు చేసింది. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో ఇప్పటికే రూ.5,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టిన అదానీ గ్రూప్.. మున్ముందు సంవత్సరాల్లో ఈ మొత్తాన్ని మూడింతలకు పెంచాలనుకుంటోంది.

ప్రథమార్ధంలో రికార్డు పనితీరు

సెప్టెంబరుతో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో అదానీ గ్రూప్ కంపెనీలు బలమైన పనితీరు కనబరిచాయి. రికార్డు స్థాయి ఆదాయాలను ఆర్జించడంతోపాటు మూలధన వ్యయాలను భారీగా పెంచడం ఇందుకు తోడ్పడింది. ఈ ప్రథమార్ధంలో అదానీ గ్రూప్ రూ.67,870 కోట్ల పెట్టుబడులు పెట్టింది. దాంతో గ్రూప్ స్థూల ఆస్తులు రూ.6.77 లక్షల కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి గ్రూప్ రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రథమార్ధంలో అదానీ కంపెనీల మొత్తం ఎబిటా వార్షిక ప్రాతిపదికన 11.2 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి రూ.92,943 కోట్లకు చేరుకుంది.

'రెపో' మరింత తగ్గుతుంది

ఆర్‌బీఐ గవర్నర్



ముంబై: దేశంలో కీలక రెపోరేటు మరింతగా తగ్గించేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. మరిన్ని రెపో కోతలకు పరిస్థితి సానుకూలంగా ఉన్న విషయం అక్టోబరు ఎంపీసీ సమావేశ సమయంలోనే ప్రకటించిన విషయం ఒక చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తు చేశారు. ఆ పరిస్థితి ఏమీ మారలేదన్న విషయం ఆ తర్వాత వచ్చిన గణాంకాలు నిరూపించాయని ఆయన అన్నారు. అయితే డిసెంబరు మొదటి వారంలో జరుగబోయే ఎంపీసీ ఆ విషయం పరిగణనలోకి తీసుకుంటుందా, లేదా అనేది కమిటీయే నిర్ణయిస్తుందని చెప్పారు. 2024 సంవత్సరం ప్రథమార్ధంలో ఒక శాతం మేరకు రెపో రేటును తగ్గించిన ఎంపీసీ అక్టోబరులో మాత్రం విరామం ఇచ్చింది. అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతానికి దిగి రావడం మరో విడత రెపోరేటుకు సానుకూల అంశమని విశ్లేషకులంటున్నారు.

ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయ్

ఈ ఏడాది ఇప్పటివరకు తీసుకున్న ఆర్థిక, ద్రవ్య, నియంత్రణా పరమైన చర్యలతో ప్రైవేటు పెట్టుబడుల పునరుజ్జీవానికి అనుకూల వాతావరణం ఏర్పడినట్టు ఆర్‌బీఐ తాజా బులెటిన్‌లో తెలిపింది. ప్రపంచ దేశాల నుంచి వీస్తున్న ప్రతికూల పవనాలను కూడా తట్టుకుని మన ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకునే సంకేతాలనే వెలువరించిందని పేర్కొంది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో కొంత ఉత్సాహం కనిపిస్తోందని, అయితే ఆ జోరు నిలదొక్కుకుంటుందా...ఆర్థిక స్థిరత్వంపై దాని ప్రభావం ఏమిటి అనేవి ప్రశ్నార్థకంగా ఉన్నాయని తెలిపారు.

ఈ ఏడాది వృద్ధి 6.5%: ఎస్ అండ్ పీ

ఇటీవల ప్రకటించిన పన్ను రేట్ల కోతలు, ద్రవ్య విధాన సడలింపులు వినియోగ వృద్ధికి ఊతం ఇస్తాయని, ఫలితంగా వృద్ధిరేటు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 6.5%, వచ్చే ఏడాది 6.7% ఉంటుందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో ఇది 7.8% ఉండగా రెండో త్రైమాసిక అధికారిక గణాంకాలు వచ్చే శుక్రవారం వెలువడనున్నాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టయితే అస్థిరతలు తొలగిపోయి, విశ్వాసం పెరగడంతో పాటు కార్మిక ఆధారిత రంగాలు మరింత ఉత్తేజితం కాగలవన్న ఆశాభావం ప్రకటించింది.

చైనా 'ఎఫ్‌డీఐ'కి గ్రీన్‌సిగ్నల్!

సిద్ధమైన కేబినెట్ నోట్

న్యూఢిల్లీ: చైనా నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై (ఎఫ్‌డీఐ) బెట్టు సడలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ వస్తువుల విషయంలో కొద్దిగా సడలింపు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. దీని కోసం అధికార వర్గాలు ఇప్పటికే కేంద్ర కేబినెట్ పరిశీలన కోసం ఒక నోట్ కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. 2020లో జరిగిన గల్వాన్ సరిహద్దు ఘర్షణ తర్వాత చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐని ప్రభుత్వం కట్టడి చేసిన సంగతి తెలిసిందే. దీంతో మన దేశంలోని ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ వస్తువుల తయారీ కంపెనీలతో పాటు అనేక కంపెనీలు కీలక యంత్రాలు, విడి భాగాలను చైనా నుంచి దిగుమతి చేసుకోలేకపోతున్నాయి. దీని వల్ల మేకిన్ ఇండియా లక్ష్యం కూడా దెబ్బతింటుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో కొన్ని రంగాల్లో చైనా ఎఫ్‌డీఐని అనుమతించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ కంపెనీల్లో చైనా ఎఫ్‌డీఐని పరిమిత స్థాయిలోనే అనుమతిస్తూ, ఆయా కంపెనీల కీలక ఉద్యోగులు అందరూ భారతీయులే అయి ఉండాలని ప్రభుత్వం షరతులు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

26,000 దిగువకు నిఫ్టీ

- లాభాల స్వీకరణతో కుంగిన మార్కెట్
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఫట్

ముంబై: ఆఖరి అరగంటలో మదుపరులు భారీ స్థాయిలో లాభాల స్వీకరణకు పాల్పడటం, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా స్టాక్ మార్కెట్ సోమవారం నష్టాల బాట పట్టింది. సూచీలు ఇంట్రాడే లాభాలను కోల్పోయి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 331.21 పాయింట్లు క్షీణించి 84,900.71 వద్దకు జారుకుంది. నిఫ్టీ 108.65 పాయింట్లు పతనమై 25,959.50 వద్ద స్థిరపడింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రెండు సెషన్లలో రూ.7 లక్షల కోట్లు తగ్గి రూ.469.68 లక్షల కోట్లకు (5.27 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

తేజస్ క్రాష్.. హెచ్ఏఎల్ షేరు డౌన్: గత వారాంతంలో జరిగిన దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ యుద్ధ విమానం కుప్పకూలిన సంఘటన ఆ విమానాల తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) షేరు ధరపై ప్రభావం చూపింది. బీఎస్ఈలో ఈ షేరు ఒక దశలో 8.48% క్షీణించింది. మళ్లీ కాస్త కోలుకున్నప్పటికీ, చివరికి 3.31% నష్టంతో రూ.4,443 వద్ద ముగిసింది.

రూపాయికి స్వల్ప ఊరట : భారత కరెన్సీ ఆల్‌టైం రికార్డు కనిష్ఠం నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 50 పైసలు పెరిగి రూ.89.16 వద్ద ముగిసింది. దిగుమతిదారులు, బ్యాంక్‌లు భారీగా డాలర్ల అమ్మకాలకు పాల్పడటంతో పాటు క్రూడ్ ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది.

భారత్‌లో ఐపీఓకు సెంబ్‌కార్ప్: సింగపూర్‌కు చెందిన విద్యుత్ ఉత్పత్తి సంస్థ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తన భారత అనుబంధ విభాగమైన సెంబ్‌కార్ప్ గ్రీన్ ఇన్‌ఫ్రా ఐపీఓకు మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందుకోసం సిటీ, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ సహా మూడు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లను నియమించుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2019 జనవరిలో సెబీ నుంచి ఐపీఓ పత్రాలను ఉపసంహరించుకున్న సెంబ్‌కార్ప్.. ఐపీఓకు వచ్చేందుకు చేస్తున్న రెండో ప్రయత్నమిది.

3 ఐపీఓలకు సెబీ ఆమోదం: కృత్రిమ మేధ(ఏఐ) సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్, సాస్ సేవల సంస్థ అమాగీ మీడియా ల్యాబ్స్‌తో పాటు గుండెలో అమర్చే స్టెంట్ల తయారీదారు సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ ఐపీఓలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది.

కెనరా బ్యాంక్ ఈడీగా సునీల్ కుమార్ చగ్



బెంగళూరు: కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సునీల్ కుమార్ చగ్ నియమితులయ్యారు. ఆయన నియామకం తక్షణం అమలులోకి వచ్చింది. ఆయన పదవీ కాలం మూడు సంవత్సరాలుంటుంది. ఈ పదోన్నతి పొందడానికి ముందు చగ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆయనకు మూడు దశాబ్దాలకు పైబడిన అనుభవం ఉంది.

ఎస్‌బీఐ వెంచర్స్ రూ.20,000 కోట్ల ఫండ్

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రమోటర్‌గా ఉన్న ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎస్‌బీఐ వెంచర్స్ తన మూడో క్లైమెట్ ఫోకస్డ్ ఫండ్ కోసం రూ.20,000 కోట్లు సమీకరించనుంది. ఈ నిధులను స్టార్టప్‌లలో పెట్టుబడిగా పెట్టాలనుకుంటోంది. ఇది దేశంలో పర్యావరణహిత వ్యాపారాల వృద్ధికి తోడ్పడటంతో పాటు కొత్త ఆర్థిక అవకాశాలను కల్పించనుందని ఎస్‌బీఐ వెంచర్స్ ఎండీ, సీఈఓ ప్రేమ్ ప్రభాకర్ అన్నారు. వచ్చే ఏడాది జనవరి-మార్చి మధ్య కాలంలో ఈ ఫండ్‌ను ప్రారంభించనున్నట్లు ఐవీసీఏ గ్రీన్ రిటర్న్ సమ్మిట్‌లో సోమవారం పాల్గొన్న సందర్భంగా ఆయన వెల్లడించారు.

బీఎస్‌డీఏపై సెబీ సమీక్ష

మరింత మందిని సంఘటిత ఆర్థిక సేవల పరిధిలోకి తెచ్చేందుకు బేసిక్ సర్వీసెస్ డీమ్యాట్ అకౌంట్ (బీఎస్‌డీఏ) వసతులను సమీక్షించాలని సెబీ ప్రతిపాదించింది. బీఎస్‌డీఏ అర్హతను నిర్ణయించేందుకు ఉపయోగించే పోర్ట్‌ఫోలియో విలువ మదింపు ప్రక్రియ నుంచి జీరో కూపన్ జీరో ప్రిన్సిపల్ (జెడ్‌సీజెడ్‌పీ) బాండ్లను మినహాయించాలని సెబీ సూచించింది. చిన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించేందుకు సెబీ కనీస సేవలందించే బీఎస్‌డీఏను 2012లో ప్రవేశపెట్టింది.

డాక్టర్ రెడ్డీస్ ఔషధానికి ఈయూ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ 'ఏవీటీ03' అనే బయోసిమిలర్ ఔషధాన్ని మార్కెట్ చేసేందుకు యూరోపియన్ కమిషన్ ఆమోదం తెలిపింది. కేన్సర్ పేషెంట్లు, రుతు చక్రం ఆగిపోయిన స్త్రీలలో ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్ల బారటం, బలహీనపడడం) వ్యాధిని అరికట్టేందుకు ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారని కంపెనీ తెలిపింది. ఐర్లాండ్ కంపెనీ అల్వోటెక్ ఈ బయోసిమిలర్ ఔషధాన్ని అభివృద్ధి చేసి తయారు చేస్తోంది. డాక్టర్ రెడ్డీస్ ఈ ఔషధాన్ని ఈయూ, యూకే, అమెరికా తదితర దేశాల్లో మార్కెట్ చేయనుంది.

సౌదీ కంపెనీతో ఆర్ఎన్ఐటీ భాగస్వామ్యం

హైదరాబాద్: ఏఐ ఆధారిత గవర్నెన్స్, ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్ సొల్యూషన్స్ కంపెనీ ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ సౌదీ అరేబియాకు చెందిన ఎంటర్‌ప్రైజ్, డిజిటల్ పరివర్తన సొల్యూషన్లు అందించే అజ్నిహాట్ అల్నాజా గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం విలువ 30 కోట్ల డాలర్లు (రూ.2,640 కోట్లు). జీసీసీ ప్రాంతంలో ఆర్ఎన్ఐటీ లాంఛనంగా ప్రవేశించడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	100	అనంతపురం	97
గోదావరి	103		

ప్రేమించి.. పెళ్లికి నిరాకరిస్తే రేప్ కేసా?

» పరస్పర సమ్మతితో శారీరక సంబంధం అత్యాచారం కిందికి రాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 24: ప్రేమ బంధం పెళ్లికి దారి తీయని సందర్భాల్లో.. ప్రేమికుడిపై ప్రియురాలు రేప్ ఆరోపణలు చేయటం, కేసులు పెట్టటం వంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ తరహా కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది నేర న్యాయవ్యవస్థను (క్రిమినల్ జస్టిస్‌ను) దుర్వినియోగం చేయటం కిందికే వస్తుందని స్పష్టం చేసింది. కొన్నేళ్లపాటు బంధం కొనసాగించి, పరస్పర అంగీకారంతో శారీరంగా సన్నిహితమైన తర్వాత.. రేప్ అని ఎలా ఆరోపించగలరని ప్రశ్నించింది. ఇటువంటి కేసుల్లో రేప్ అభియోగాలను నమోదు చేయటం వల్ల.. అత్యంత తీవ్ర నేరమైన రేప్‌ను అపహాస్యం చేసినట్లవుతుందని పేర్కొంది. ఎదుటి వ్యక్తి సమ్మతి లేకుండా లైంగికదాడి జరిపినప్పుడు మాత్రమే రేప్‌గా పరిగణించాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ, ప్రేమ పేరుతో మోసగించిన నిజమైన కేసుల్లో చట్టం సున్నితంగా వ్యవహరించాల్సిందేనని తెలిపింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దాఖలు చేసిన కేసుపై ధర్మాసనం సోమవారం ఈ తీర్పునిచ్చింది. సదరు వ్యక్తితో మూడేళ్లుగా బంధం కొనసాగించిన ఓ మహిళ.. అతడి వల్ల గర్భం వచ్చిందని, దానిని విచ్ఛిత్తి చేసుకున్నానని, అతడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని పేర్కొంటూ.. రేప్ అభియోగాలు మోపింది.

నేవీలోకి సైలెంట్ హంటర్ ఐఎన్ఎస్ మాహే

ముంబై, నవంబరు 24: తీరప్రాంత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ (ఏఎస్‌డబ్ల్యూ) షాలో-వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్ఎస్ మాహే' భారత నౌకాదళంలో చేరింది. ముంబైలోని నేవల్ డాక్‌యార్డులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ నౌకను నేవీకి అప్పగించారు. 'సైలెంట్ హంటర్'గా పిలిచే ఈ యుద్ధ నౌకకు మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం 'మాహే' పేరు పెట్టారు. ఈ నౌక శిఖరంపై కలరియపట్టులో ఉపయోగించే సన్నని కత్తిలాంటి ఆయుధం 'ఉరుమి'ని ఏర్పాటు చేశారు. భారత్ నిర్మించే ఎనిమిది మాహే క్లాస్ నౌకల్లో ఇది మొదటిది. శత్రు జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీ నిర్వహించేందుకు దీన్ని ఉపయోగిస్తారు. ఐఎన్ఎస్ మాహే నీటిలో చాలా తక్కువ ధ్వని చేస్తూ కదులుతుంది. అందుకే దీన్ని 'సైలెంట్ హంటర్'గా పిలుస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ కింద కొచ్చి షిప్‌యార్డ్ లిమిటెడ్ 80 శాతం స్వదేశీ పరికరాలతో దీన్ని నిర్మించింది.

అసాధారణ పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన

» షేర్లు పతనంతో 'తేజస్' ఘటనపై హెచ్ఏఎల్ వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 24: ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఎయిర్‌షోలో తేజస్ యుద్ధ విమానం కూలిన ఘటనపై దాని తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) స్పందించింది. అది 'అసాధారణ పరిస్థితుల వలన జరిగిన ప్రత్యేక దుర్ఘటన'గా పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రమాదం తేజస్ యుద్ధ విమానం మొత్తం పనితీరును ప్రతిబింబించదని తెలిపింది. అదేవిధంగా సంస్థ వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపబోదని స్పష్టం చేసింది.కాగా, తేజస్ విమానం కూలిన ఘటన తర్వాత హెచ్ఏఎల్ షేర్లు 8% మేర పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో 3.14 శాతం తగ్గి రూ.4,450 వద్ద ట్రేడైంది..

మీ సిమ్ దుర్వినియోగానికి మీదే బాధ్యత:డీవోటీ

న్యూఢిల్లీ, నవంబరు 24: మీ పేరుపై తీసుకున్న సిమ్ కార్డు సైబర్ మోసాలు, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దుర్వినియోగమైనట్లు తేలితే.. అందుకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని టెలికాం శాఖ (డీఓటీ) హెచ్చరించింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ట్యాంపర్ చేసిన ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) మొబైల్ పరికరాలను కూడా వాడకూడదని ఓ ప్రకటనలో సూచించింది. ఐఎంఈఐ ట్యాంపర్ చేసిన మోడెమ్‌లు, మాడ్యుల్స్, సిమ్ బాక్స్‌లను కొనుగోలు చేయడం.. వాటిని వాడటం నేరమేనని తెలిపింది. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు కొనడం.. మీ పేరు మీద తీసుకున్న సిమ్ కార్డులను వేరొకరికి ఇవ్వడమూ నేరమేనని స్పష్టం చేసింది. సైబర్ నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మీ పేరుపై తీసుకున్న సిమ్ వినియోగించినట్లు తేలితే తీవ్ర చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని.. ఇలా నేరాలకు పాల్పడిన వారితో పాటు మీపై కూడా చర్యలుంటాయని పేర్కొంది. మొబైల్స్, ఇతర పరికరాల్లోని ఐఎంఈఐని ట్యాంపర్ చేస్తే చట్ట ప్రకారం మూడేళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా ఉంటుందని హెచ్చరించింది. సంచార్ సాథి పోర్టల్ ద్వారా మీ పేరుపై తీసుకున్న సిమ్ కార్డుల వివరాలతో పాటు ఐఎంఈఐ వివరాలను ధ్రువీకరించుకోవాలని డీఓటీ సూచించింది.

మలేషియాలో పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

కౌలాలంపూర్(మలేషియా), నవంబరు 24: పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు మలేషియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి 16ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా నిషేధం విధించనుంది. ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్ శాఖ మంత్రి ఫాహ్మి ఫడ్జిల్ తెలిపారు. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడేందుకు.. ఆస్ట్రేలియా, డెన్మార్క్, నార్వే వంటి దేశాలు ఇప్పటికే ఈ తరహా బ్యాన్‌ను అమలులోకి తేవాలని పరిశీలిస్తున్నాయి. వయసు ధ్రువీకరణ కోసం ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఢిల్లీలో 260 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ, నవంబరు 24: దేశ రాజధాని ఢిల్లీలో మరో డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టయింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్' పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఛతర్‌పూర్ ప్రాంతంలోని ఓ ఇంటిపై మెరుపు దాడి చేసిన అధికారులు ఈ భారీ డ్రగ్స్ నిల్వను కనుగొన్నారు. ఈ కేసులో నాగాలాండ్‌కు చెందిన ఓ మహిళతో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సేల్స్ మేనేజర్‌ను అరెస్టు చేశారు.


హెచ్-1బీ వీసా ఉన్నా ప్లాన్-బీ అవసరం!

న్యూఢిల్లీ, నవంబరు 24: అమెరికాకు వెళ్లే విదేశీయులకు హెచ్-1బీ వీసా అంటే ఒక భరోసా!. ఈ వీసా దొరికితే చాలు తమను ఎవరూ కదిలించలేరని భావిస్తారు. కానీ, అలాంటి భరోసా ఏమీ లేదని, అందువల్ల ప్లాన్-బీతో ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్లాన్-బీలో నాలుగు అంశాలను వారు పేర్కొంటున్నారు. హెచ్-1బీ వీసా ద్వారా పొందిన ఉద్యోగం కోల్పోయిన వారు.. వెంటనే బీ-2 పర్యాటక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. తద్వారా అమెరికాలో కొన్నాళ్లు ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఎఫ్-1 విద్యార్థి వీసా కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలి. తద్వారా వేరే ప్రోగ్రాం చేసేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా ఎక్కువ సమయం లభిస్తుంది. అదేవిధంగా హెచ్-4 వీసా(డిపెండెంట్)కు మరలే అవకాశం ఉంటుంది. భార్యాభర్తల్లో ఎవరికి హెచ్-1బీ వీసా ఉన్నా.. రెండో వ్యక్తి హెచ్-4కు దరఖాస్తు చేసుకుంటే.. ఉద్యోగం సంపాదించుకునే వరకు అమెరికాలో ఉండే అవకాశం ఉంటుంది. అదేసమయంలో దేశాన్ని వీడి వెళ్లే పరిస్థితి నుంచి కూడా తప్పించుకోవచ్చు.

ఢిల్లీలో కాలుష్యంపై నిరసనలు .. హిడ్మా అమరవీరుడంటూ నినాదాలు

న్యూఢిల్లీ, నవంబరు 24: ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదంటూ ఇండియా గేట్ సమీపంలో ఆదివారం ఆందోళన నిర్వహించిన వారిలో 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనకారులు రోడ్లను బ్లాక్ చేయడంతో పాటు అడ్డుకున్న తమపై పెప్పర్ స్ప్రే ఉపయోగించారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు హిడ్మా ఫొటో ప్రదర్శించడంతో పాటు హిడ్మా అమరవీరుడంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారని పోలీసులు తెలిపారు. ఆందోళనకారులపై బీఎన్ఎస్ 223ఏ, 132, 221, 121ఏ, సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు వాయు నాణ్యత క్షీణించిన నేపథ్యంలో ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగుల్లో 50 శాతం మంది ఇంటి వద్ద నుంచే పనిచేయాలని ఢిల్లీ ప్రభుత్వం సూచించింది.

సూర్యకాంత్ అను నేను..



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము. హాజరైన ప్రధాని మోదీ, స్పీకర్ ఓంబిర్లా, హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్ నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి.. ఏడు దేశాల (భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక, బ్రెజిల్) ప్రధాన న్యాయమూర్తులు తమ కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిశాక.. జస్టిస్ బీఆర్ గవాయి తన అధికారిక వాహనాన్ని రాష్ట్రపతి భవనంలోనే వదిలేసి వెళ్లారు. కాగా, జస్టిస్ సూర్యకాంత్ 2027 ఫిబ్రవరి 9 వరకూ.. అంటే సుమారు 15 నెలలపాటు సీజేఐగా కొనసాగనున్నారు.

నూతన నియమం..

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ తొలిరోజే విధానపరమైన ఒక నూతన నియమానికి శ్రీకారం చుట్టారు. అత్యవసర జాబితా కోసం కేసుల ప్రస్తావన విషయంలో మౌఖిక అభ్యర్థనలకు స్వస్తి పలికారు. ఆయా కేసులను రాతపూర్వకంగానే మెన్షన్ చేయాలని స్పష్టం చేశారు. మరణశిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి వాటి విషయంలో మౌఖిక అభ్యర్థనలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకారం తర్వాత రాష్ట్రపతి భవన్ నుంచి సీజేఐ హోదాలో సుప్రీంకోర్టుకు చేరుకున్న ఆయన.. కోర్టు ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ (ఎస్ సీఏఓఆర్ఏ) అధ్యక్షులు విపిన్ నాయర్ నూతన సీజేఐకి కోర్టు హాలులోకి స్వాగతం పలికారు. ఆ తర్వాత హెరిటేజ్ కోర్టు నంబర్ వన్‌లో.. జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనానికి అధ్యక్షత వహించారు. మొదటిరోజు 17 కేసులను విచారించారు. మధ్యాహ్నం తర్వాత.. హిమాచల్ ప్రదేశ్‌లో ఒక ప్రైవేట్ సంస్థకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సీజేఐ తీర్పును వెలువరించారు. కాగా.. ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడిన జస్టిస్ సూర్యకాంత్.. పెండింగ్ కేసులను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. "సుప్రీంకోర్టులో 90 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, దీనికి కారణాలు ఎంతో సంక్లిష్టంగా ఉన్నాయి. గత ఆరు నెలల్లో నమోదైన కేసుల సంఖ్యలో స్పష్టమైన పెరుగుదల కనిపించింది. కేసుల సంఖ్య నెలకు దాదాపు నాలుగైదు వేల నుంచి ఏడు వేలకు పెరిగింది. హైకోర్టులను దాటవేసి నేరుగా సుప్రీంకోర్టుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. దిగువ కోర్టులతోపాటు సుప్రీంకోర్టులో కేసులకు సంబంధించిన, చాలా కాలంగా నిలిచిపోయిన కేసులను పరిష్కరించడంపై శ్రద్ధ పెడతాం. పెండింగ్ కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి బెంచ్‌లు ఏర్పాటు చేస్తా" అని పేర్కొన్నారు.

జిల్లా కోర్టు వకీల్ నుంచి సీజేఐ స్థాయికి

సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణావాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఆయన.. 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1981లో హిసార్ ప్రభుత్వ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తి మొదలు పెట్టారు. 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టులో ప్రాక్టీసు చేయడం కోసం చండీగఢ్‌కు వెళ్లారు. 2000 జూలై 7న.. అత్యంత పిన్న వయస్సులో హరియాణా అడ్వొకేట్ జనరల్‌గా నియమితులు అయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2018 అక్టోబరు 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఢిల్లీ మద్యం కేసులో.. ఆ రాష్ట్ర మాజీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనానికి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వం వహించారు. సీబీఐకి.. తనపై ఉన్న 'పంజరంలో చిలుక' అనే భావనను తొలగించేలా పని చేయాలని సూచించారు.



కుటుంబ సభ్యులకు పాదాభివందనం చేస్తున్న జస్టిస్ సూర్యకాంత్

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరు



న్యాయ నిపుణుడిగా జస్టిస్ సూర్యకాంత్ అనుభవం దేశ న్యాయ వ్యవస్థకు మార్గదర్శకంగా నిలవాలని, దేశ న్యాయ వ్యవస్థలో సరికొత్త కాంతులు నిండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. "భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిష్ఠాత్మకమైన, అత్యున్నత పదవిని స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్‌కు అభినందనలు. మీ నాయకత్వంలో దేశంలోని ప్రజలందరికీ, ముఖ్యంగా కిందిస్థాయి వర్గాలకు న్యాయం దక్కుతుందని కోరుకుంటున్నాను." అని రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మరోవైపు.. ప్రధాని మోదీ కూడా ఎక్స్ వేదికగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాభినందనలు తెలియజేశారు. ఇక.. జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలో రాజ్యాంగ విలువలపైన, చట్టపాలనపైన ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నట్లు ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు.

లోకం తీరు



కీలక తీర్పులు..

- జమ్మూ కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370 నిర్వీర్యం నిర్ణయాన్ని సమర్థించిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరు.
- సెక్షన్ 124 ఏ (దేశద్రోహం) పై స్టే విధించారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని సమీక్షించే వరకూ దాన్ని అమలు చేయొద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిన ధర్మాసనంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు.
- పెగాసస్ కేసులో విచారణ కోసం సైబర్ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. జాతీయ భద్రత పేరుతో ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు ఇవ్వలేమని తేల్చి చెప్పారు.
- బిహార్ ఓటర్ల జాబితా వివాదంలో కీలకమైన నిర్ణయాన్ని వెల్లడించిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను బహిరంగపరచాలని ఈసీని ఆదేశించారు.

నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా జస్టిస్ విక్రమ్ నాథ్

న్యూఢిల్లీ, నవంబరు 24: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ విక్రమ్ నాథ్‌ను రాష్ట్రపతి ముర్ము నియమించారు. మరోవైపు సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) నూతన ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరిని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నియమించారు. సంప్రదాయం ప్రకారం నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవిలో సీజేఐ తర్వాత అత్యంత సీనియర్ న్యాయమూర్తి నియమితులవుతారు. ఇక ఎస్‌సీఎల్ఎస్‌సీ ఛైర్మన్ పదవిలో సుప్రీం కోర్టు రెండో అత్యంత సీనియర్ జడ్జిని నియమిస్తారు. కాగా ఈ నియామకాలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

అయోధ్య రామ మందిరంపై నేడు కాషాయ ధ్వజారోహణ

» ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ

» ఆలయ పనులు సంపూర్ణం

» త్రికోణం ఆకృతిలో కాషాయ జెండా

» మధ్యలో సూర్యుడు, ఓం, దేవకాంచనం చెట్టు చిహ్నాలు



అయోధ్య, నవంబరు 24: అయోధ్య రామ మందిర నిర్మాణ పనుల్లో చివరి ఘట్టం మంగళవారం పూర్తికానుంది. ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించనున్నారు. ఆలయ పనులు పూర్తయ్యాయనడానికి గుర్తుగా ఈ ధ్వజారోహణ చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆ జెండా 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవుతో లంబకోణ త్రిభుజం ఆకారంలో ఉంటుంది. జెండా మధ్యలో రాముని ప్రతిభ, ధైర్యానికి చిహ్నంగా ప్రకాశించే సూర్యుని బొమ్మ ఉంటుంది. ఓం చిహ్నంతో పాటు, కోవిదార వృక్షం(దేవ కాంచనం చెట్టు) బొమ్మ ఉంటుంది. ఈ పవిత్ర కాషాయ ధ్వజం.. ప్రతిష్ఠ, ఐక్యత, సాంస్కృతిక పరంపర, రామరాజ్య ఆదర్శాలకు చిహ్నంగా ఉంటుందని ఆ ప్రకటనలో వివరించింది. ఆలయం పైభాగాన ఉత్తర భారత సంప్రదాయ వాస్తు అయిన నగర శైలిలో శిఖరం నిర్మించారు. ఆ శిఖరంపై ఈ ధ్వజాన్ని అమర్చనున్నారు. 800 మీటర్ల చుట్టుకొలత ఉన్న ఆలయ ప్రాకారాన్ని దక్షిణాది శైలిలో నిర్మించడం విశేషం. అయోధ్య రామ మందిరంలో నిర్మించిన ఇతర ఆలయాలను కూడా ప్రధాని మోదీ సందర్శించనున్నారు. సప్త మందిర్‌గా వ్యవహరిస్తున్న మహర్షి వశిష్ఠ, మహర్షి విశ్వామిత్ర, మహర్షి వాల్మీకి, మహర్షి అగస్త్య, దేవీ అహల్య, మాతా శబరి, నిషాద్‌రాజు గుహుని మందిరాలను దర్శించి అనంతరం శేషావతార్ మందిర్‌కు వెళ్లనున్నారు. మాతా అన్నపూర్ణ, రామ దర్బార్ గర్భ గృహంలో పూజలు చేయనున్నారు. చివరగా రామ లల్లా గర్భ గృహాన్ని దర్శించి పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం ధ్వజారోహణ చేసిన అనంతరం అక్కడ నిర్వహించే సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వాల్మీకి రామాయణంలోని ఘట్టాలను ఆలయ గోడలపై 87 రాతి శిల్పాలుగా చెక్కారు. దేశ సంస్కృతిని 79 కాంస్య రేకులపై చిత్రీకరించారు. ఇవన్నీ కనువిందు చేయనున్నాయి. ధ్వజారోహణ ముహూర్తానికి కూడా విశేషం ఉంది. మార్గశిర మాస శుక్ల పక్ష పంచమి నాడు అభిజిత్ లగ్నంలో ఈ కార్యక్రమం జరగనుంది. పంచమినాడు అభిజిత్ లగ్నంలోనే సీతారాముల కల్యాణం జరిగింది. సిక్కుల తొమ్మిదవ గురువు తేగ్ బహాదుర్ ఇదే రోజున అమరుడయ్యారు. ఆయన 17వ శతాబ్దంలో అయోధ్య సమస్యపై 48 గంటల పాటు సంప్రదింపులు జరపడం గమనార్హం. ప్రధాని రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చేసిన ఏర్పాట్లపై యూపీ సీఎం యోగి సోమవారం సమీక్ష జరిపారు.

రష్యా చమురుపై మరింత రాయితీ!

» అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత రిఫైనరీలకు రష్యా కంపెనీల ఆఫర్

» ఒక్కో బ్యారెల్‌పై 7 డాలర్ల వరకు తగ్గింపు

న్యూఢిల్లీ, నవంబరు 24: రష్యా చమురు కొనుగోళ్ల అంశంలో పరిస్థితి మరోసారి తారుమారయ్యే అవకాశం కనిపిస్తోంది. రష్యా అతిపెద్ద చమురు సంస్థలు రాస్‌నెఫ్ట్, ల్యూకోయిల్‌లపై అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడం, ఆ దేశ చమురు కొనవద్దంటూ ఒత్తిడి చేయడంతో.. కొన్ని నెలలుగా భారత రిఫైనరీలు రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించాయి. బదులుగా పశ్చిమాసియా, అమెరికా నుంచి కొనుగోళ్లు పెంచాయి. చమురు కొనుగోళ్లు భారీగా తగ్గిపోవడంతో ఇబ్బందుల్లో పడిన రష్యా చమురు కంపెనీలు.. తాజాగా భారత్‌కు మరింత రాయితీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. డిసెంబర్‌లో లోడ్ చేసి జనవరి నాటికి డెలివరీ అందించే 'ఉరల్స్' చమురు ఒక్కో బ్యారెల్‌పై ఏడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఆఫర్ చేశాయి. గత రెండేళ్లలో ఇదే అతి ఎక్కువ రాయితీ కావడం గమనార్హం. ఆంక్షలకు ముందు ఈ రాయితీ ఒక్కో బ్యారెల్‌పై 3 డాలర్లే. రష్యా, భారత చమురు, రిఫైనరీ సంస్థలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ ఈ వివరాలతో కథనం ప్రచురించింది. కాగా, రష్యా చమురు సంస్థలు, ఆ దేశ చమురు రవాణా ట్యాంకర్లపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో.. భారత్, చైనా సహా పలు దేశాలు పశ్చిమాసియా, అమెరికాతోపాటు ఇతర దేశాల నుంచి చమురు కొనుగోళ్లు పెంచాయి. ఈ క్రమంలో చమురు రవాణా ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. పోటాపోటీ బుకింగ్స్‌తో చార్జీలు ఐదింతలకుపైగా పెరిగాయి.

అరుణాచల్ మాదేనంటూ..

» చైనా విమానాశ్రయంలో భారత మహిళ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకొని వేధింపులు

» మోదీకి లేఖలో వెల్లడించిన బాధితురాలు

ఢిల్లీ, నవంబరు 24: అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో భాగమంటూ షాంఘై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు భారత మహిళపై వేధింపులకు పాల్పడ్డారు. జన్మస్థలం అరుణాచల్‌ప్రదేశ్‌గా పేర్కొన్నందున ఆమె భారతీయ పాస్‌పోర్టు చెల్లదని, చైనా పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్రిటన్‌లో నివసిస్తున్న ప్రేమా వాంగ్జాం తాంగ్డోక్ లండన్ నుంచి జపాన్‌కు ప్రయాణిస్తూ 3 గంటల ట్రాన్సిట్ హాల్ట్ నిమిత్తం ఈనెల 21న షాంఘైలోని పుడోంగ్ విమానాశ్రయంలో దిగినప్పుడు ఎదురైన పరిస్థితి ఇది. 'అక్కడ దిగిన తర్వాత నన్ను ఇమ్మిగ్రేషన్ డెస్క్‌కు తీసుకెళ్లారు. నా పాస్‌పోర్టు చెల్లదన్నారు. ఎందుకని అడిగితే.. అరుణాచల్ చైనాలో భాగమని చెప్పారు. నా పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. చైనా పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేను ఎక్కాల్సిన జపాన్ వెళ్లే విమానం వచ్చినా.. నన్ను వెళ్లనివ్వలేదు. 18 గంటలపాటు మాటలతో వేధించారు' అని ఆమె ఒక ఆంగ్ల టీవీ చానల్‌కు వెల్లడించారు. బ్రిటన్‌లో ఉన్న ఒక స్నేహితుడి ద్వారా షాంఘైలోని భారత కాన్సులేట్ అధికారులకు విషయం తెలియజేయడంతో వారొచ్చి తనను ఆ నగరం నుంచి దాటించారని ఆమె తెలిపారు. దీనిపై ఆమె ప్రధాని మోదీతోపాటు సీనియర్ అధికారులకు ఒక లేఖ రాశారు.

బ్రిటన్‌ను వీడిన లక్ష్మీ మిత్తల్

తన వ్యాపార కేంద్రం స్విట్జర్లాండ్‌కు మార్పు

» కొత్త నివాసంగా దుబాయ్ ఎంపిక

» బ్రిటన్ కొత్త పన్ను చట్టాలకు నిరసనగానే

» కుబేరులపై భారీగా పన్నులు వేసిన బ్రిటన్

లండన్, నవంబరు 24: ప్రపంచ ఉక్కు వ్యాపార దిగ్గజం, ప్రవాస భారతీయుడు లక్ష్మీనివాస్ మిత్తల్.. బ్రిటన్‌ను వీడారు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ ప్రభుత్వం ఆ దేశంలోని పన్ను చట్టాల్లో సమూల మార్పులు చేసి, కుబేరులపై భారీగా పన్నులు వేస్తుండటంతో ఆయన తన వ్యాపార కేంద్రాన్ని స్విట్జర్లాండ్‌కు, నివాసాన్ని దుబాయ్‌కి మార్చారు. బ్రిటన్ కొత్త పన్ను చట్టాలను నిరసిస్తూ ఇప్పటికే చాలామంది ధనవంతులు ఆ దేశాన్ని వీడారు. బ్రిటన్‌లోని అత్యంత ధనవంతుల్లో 8వ స్థానంలో, ప్రపంచ కుబేరుల్లో 104వ స్థానంలో ఉన్న మిత్తల్.. ఇకపై దుబాయ్‌లో నివసించనున్నట్లు సండే టైమ్స్ వార్తా సంస్థ వెల్లడించింది. పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపార వ్యవహారాలను మాత్రం స్విట్జర్లాండ్‌కు మార్చినట్లు పేర్కొంది. మిత్తల్ యాజమాన్యంలోని ఆర్సెలార్ మిత్తల్ కంపెనీ ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తిలో రెండోస్థానంలో ఉంది. 2021 వరకు ఆ కంపెనీకి సీఈవోగా ఉన్న ఆయన.. తన కుమారుడు ఆదిత్య మిత్తల్‌కు ఆ పదవిని అప్పగించి ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. భారత్‌లోని రాజస్థాన్‌లో ఉక్కు వ్యాపార కుటుంబంలో జన్మించిన లక్ష్మీ మిత్తల్.. 1995 నుంచి లండన్‌లో నివసిస్తున్నారు.

కొత్త పన్ను చట్టాలపై నిరసనగానే..

బ్రిటన్‌లో చాలాకాలం తర్వాత అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రభుత్వం.. ధనవంతులపై భారీగా పన్నులు విధిస్తోంది. 226 ఏళ్లుగా ఉన్న నాన్-డోమ్ చట్టాన్ని రద్దు చేసింది. ఈ చట్టం ప్రకారం బ్రిటన్‌లో నివసించే వ్యక్తులు ఇతర దేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్‌లో పన్ను కట్టాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టం తెచ్చింది. దాని ప్రకారం ప్రపంచంలో ఎక్కడ ఆదాయం సంపాదించినా, బ్రిటన్‌లో నివసించే వాళ్లు ఆ సంపదపై బ్రిటన్ ప్రభుత్వానికి పన్ను కట్టాల్సిందే. దీంతోపాటు వారసత్వ పన్ను చట్టంలోనూ మార్పులు తెచ్చి, ప్రపంచంలో ఎక్కడ వారసత్వ సంపదపై ఆదాయం వచ్చినా బ్రిటన్ ప్రభుత్వానికి పన్ను కట్టాలని నిబంధన పెట్టింది. వీటికి అదనంగా బ్రిటన్ నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నవారిపై కూడా ఎగ్జిట్ టాక్స్ వేసే చట్టం తేవాలని ప్రయత్నించింది. ఈ పన్ను చట్టాలను నిరసిస్తూ రివల్యూట్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నిక్ స్టోరోన్‌స్కీ ఇప్పటికే తన మకాంను యూఏఈకి మార్చారు. కాగా, పారిశ్రామికవేత్తలు దేశాన్ని వీడి వెళ్లిపోవడంపై బ్రిటన్ విదేశాంగ మంత్రి కైల్ ఆందోళన వ్యక్తం చేశారు.



దూకుడైన వ్యాపారానికి పెట్టింది పేరు

లక్ష్మీ మిత్తల్‌ను ముద్దుగా 'కింగ్ ఆఫ్ స్టీల్' అని కూడా పిలుస్తారు. వ్యాపార విస్తరణలో అత్యంత దూకుడుగా వ్యవహరించే ఆయన.. ఉక్కు రంగంలో తనకు పోటీగా ఉన్న అనేక సంస్థలను కొనుగోలు చేసి తన యాజమాన్యం కిందికి తెచ్చుకున్నారు. 2006లో లగ్జంబర్గ్‌కు చెందిన ఆర్సెలార్ సంస్థను బలవంతంగా కొనేయటం అప్పట్లో సంచలనం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఆయన కంపెనీల్లో ప్రస్తుతం 1,25,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆర్సెలార్ కొనుగోలు తర్వాత తన కంపెనీకి ఆర్సెలార్ మిత్తల్ అని పేరు పెట్టారు. దాదాపు 60 దేశాల్లో ఆయనకు వ్యాపారాలున్నాయి. ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితా ప్రకారం ఆయన సంపద 21.4 బిలియన్ డాలర్లు. లండన్‌లోని 'బిలియనీర్స్ రో'గా పేరున్న కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్ వీధిలో ఆయనకు మూడు నివాసాలు ఉన్నాయి. 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 'తాజ్ మిత్తల్' భవన నిర్మాణానికి భారత్‌లోని చారిత్రక కట్టడం తాజ్‌మహల్ కోసం పాలరాయిని తెచ్చిన క్వారీ నుంచే తరలించటం విశేషం. యూఏఈలో కూడా మిత్తల్ ఖరీదైన భవనాలు ఉన్నాయి. ఎమిరేట్ హిల్స్‌లో ఈ ఏడాది 152.7 మిలియన్ పౌండ్లతో ఓ ఖరీదైన భవనాన్ని కొనుగోలు చేశారు.

మిథున్‌రెడ్డి ఢిల్లీ పిటిషన్ నేటికి వాయిదా

విజయవాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు ఢిల్లీ వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. మద్యం కుంభకోణంలో నిందితుడుగా ఉన్న మిథున్‌రెడ్డి బెయిల్‌పై బయట ఉన్నారు. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసే సమయంలో అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లరాదని షరతు పెట్టింది.

చెవిరెడ్డి సదుపాయాల పిటిషన్ నేటికి వాయిదా

జైల్లో సదుపాయాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి ప్రస్తుతం విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైల్లో డిష్ కనెక్షన్ ఉన్న టీవీ, మంచం, ఇంటి నుంచి భోజనం అనుమతించాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను న్యాయాధికారి భాస్కరరావు మంగళవారానికి వాయిదా వేశారు.

ఎయిమ్స్‌కు చెవిరెడ్డి

మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డిని వైద్యపరీక్షల కోసం జైలు సిబ్బంది సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. కాళ్ల వాపుల(వెరికోస్ వెయిన్స్)తో బాధపడుతున్న ఆయనను జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. చెవిరెడ్డి విజ్ఞప్తి మేరకు వైద్య పరీక్షలు నిర్వహించకుండానే మంగళగిరి ఎయిమ్స్‌కు రిఫర్ చేసినట్టు జీజీహెచ్ సూపరిండెంటెండ్ ఏ.వీ.రావు తెలిపారు.

ఆ మావోయిస్టులను కస్టడీకి ఇవ్వండి

- పిటిషన్లు వేసిన పటమట, పెనమలూరు పోలీసులు

విజయవాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేసిన మావోయిస్టుల్లో కొందరిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆయా కోర్టుల్లో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో 18న నలుగురు మావోయిస్టులను... పొడియా బీమా అలియాస్ రంగు, మడకం లక్మ అలియాస్ మదన్, మడవి చిన్మయి అలియాస్ మనీలా, మంగి డొక్కుపాడిలను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారంతా ప్రస్తుతం నెల్లూరు కేంద్ర కరాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలో కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పోలీసులకు చిక్కిన 28 మంది మావోయిస్టుల్లో ముగ్గురిని... ఉద్దే రఘు, ఓయం జ్యోతి, మడకం దివాకర్‌ను మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో సోమవారం పిటిషన్ వేశారు.

అది బూటకపు ఎన్‌కౌంటర్: ఈశ్వరయ్య

అమరావతి, నర్సీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వైద్య అవసరాల కోసం విజయవాడ వచ్చిన మావోయిస్టులను పట్టుకుని తీసుకుపోయి పోలీసులు కాల్చి చంపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కేంద్ర, రాష్ట్ర బలగాలు ఎన్‌కౌంటర్ జరిగిందని ప్రకటిస్తున్నాయి. అది వాస్తవం కాదు. నిరాయుధులుగా ఉన్న మావోయిస్టులను కాల్చి చంపారు. హిడ్మా కుటుంబ పరిస్థితి చూసిన తర్వాత ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. అడవుల్లోని ఖనిజ సంపదను దోచుకుపోవడానికి పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో 1,551 ఎంవోయుల చేసుకున్నామని, రూ.21 లక్షల కోట్లు పెట్టుబడులు, 20 లక్షలు ఉద్యోగాలు వచ్చేశాయని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గతంలో జరిగిన ఇటువంటి సదస్సులతో ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారు?' అని ఆయన ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మార్గం సుగమం కావడానికి కేంద్రానికి చంద్రబాబు ఇచ్చిన లేఖ కారణమని ఆరోపించారు. 'కడప స్టీల్‌ప్లాంటుకు శంకుస్థాపన చేసినా అతీగతీ లేదు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు 2,500 మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వస్తుంది. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ, లక్ష మందితో కవాతు నిర్వహిస్తాం' అని ప్రకటించారు. కాగా, మరో ప్రకటనలో.... రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో పెట్టిన రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబుకి ఆయన లేఖ రాశారు.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం అభినందనలు



అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి.. రాజ్యాంగ విలువల పరిరక్షణకు జస్టిస్ సూర్యకాంత్ తన పదవీకాలాన్ని వినియోగిస్తారన్న ఆశాభావాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్ కూడా జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కోకాపేటలో మళ్లీ కోట్లు..!

ఈసారి రూ.137 కోట్లు పలికిన ఎకరం భూమి ధర

హైదరాబాద్ సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోకాపేటలో భూముల ధర మళ్లీ కోట్లు పలికింది. రెండేళ్ల క్రితం ఇక్కడి స్థలాలను హెచ్ఎండీఏ విక్రయించగా ఎకరం రూ.100.75 కోట్లు పలికి తెలుగు రాష్ట్రాల్లో రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలోని నాలెడ్జి సిటీలో టీజీఐఐసీ భూములను వేలం వేస్తే ఎకరం ఏకంగా రూ.177 కోట్లు పలికింది. తాజాగా కోకాపేటలోనే మరోసారి రూ.100 కోట్ల మార్కు దాటింది. అక్కడి నియోపోలీస్ లేఅవుట్‌లోని 17, 18వ నంబర్ ప్లాట్లను హెచ్ఎండీఏ సోమవారం ఆన్‌లైన్‌లో (ఈ-వేలం) వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ కామర్స్ నిర్వహించింది. మొదటగా 5.31 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 18వ నంబర్ ప్లాట్‌ను ఎకరం రూ.137.25 కోట్ల చొప్పున ఎంఎస్ఎన్ అర్బన వెంచర్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ సొంతం చేసుకుంది. 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 17వ నంబర్ ప్లాట్‌ను ఎకరం రూ.136.50 కోట్ల చొప్పున వజ్ర హౌసింగ్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ దక్కించుకుంది. మొత్తం 9.90 ఎకరాల విస్తీర్ణంలోని ఈ రెండు ప్లాట్ల వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ.1,356 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 28న నియోపోలీస్ లేఅవుట్‌లోని 15, 16 నంబర్ ప్లాట్లను, డిసెంబర్ 3న 19, 20 నంబర్ ప్లాట్లను వేలం వేయనున్నారు.

సగటు ధరలో 87 శాతం వృద్ధి

రెండేళ్ల క్రితం కోకాపేటలో ఎకరానికి పలికిన సగటు ధరతో పోల్చితే ప్రస్తుతం 87 శాతం పెరుగుదల నమోదైంది. నాడు నియోపోలీస్ లేఅవుట్‌లోనే అత్యధికంగా ఎకరం రూ.100.75 కోట్లు, అత్యల్పంగా రూ.67.25 కోట్లు పలికింది. సగటున రూ.73.23 కోట్లు ఖరారైంది. తాజాగా ఎకరం సగటు ధర రూ.136.75 కోట్లు పలకటంతో 87 శాతం వృద్ధి నమోదైనట్లు అయ్యింది. భూములకు భారీ ధర పలకటంపై రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు, నిర్మాణ సంస్థల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒడిదుడుకులు లేకుండా దేశంలో అత్యంత చురుకుగా పురోగమిస్తున్న మార్కెట్‌లో ఒకటిగా హైదరాబాద్ నిలుస్తోందని చెబుతున్నారు.



లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



30 ఎకరాల భూమి తాలూకా పత్రాలను దేవదాయశాఖ కమిషనర్ సి.రామచంద్రమోహన్‌కు అందజేస్తున్న పవన్ కల్యాణ్

మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి శ్రీకారం

- ఆలయ ప్రదక్షిణ మండపం, రోడ్డు నిర్మాణానికి గతేడాది హామీ
- ఏలూరు జిల్లాలో పవన్ కల్యాణ్ సుడిగాలి పర్యటన

ఏలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల ఐఎస్ జగన్నాథపురంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రదక్షిణ మండపం, కొండపైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతిఏటా ఇక్కడి నారసింహుడికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో పవన్ పాల్గొంటూ వస్తున్నారు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 1 దీపం పథకం-2 ప్రారంభోత్సవానికి ఏలూరు జిల్లాకు విచ్చేసిన ఆయన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆలయ ప్రదక్షిణ మండపం నిర్మాణంతో పాటు గ్రామం నుంచి కొండపైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మించేలా చేస్తానని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా కొద్దినెలల క్రితమే ఈ దేవాలయానికి 30 ఎకరాల స్థలం మంజూరు చేయిస్తూ క్యాబినెట్‌లో చర్చించి జీవో తీసుకురావడానికి కృషి చేశారు. ప్రదక్షిణ మండపం, గుడి చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి దేవదాయశాఖ నిధులు రూ.3.50 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.3.70 కోట్లతో ఐఎస్ జగన్నాథపురం నుంచి ఆలయానికి రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ.7.20 కోట్లు మంజూరు చేయించారు. తాజాగా సోమవారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం... 30 ఎకరాల భూమి తాలూకా పత్రాలను దేవదాయశాఖ కమిషనర్ సి.రామచంద్రమోహన్, ఆలయ ధర్మకర్త ఎస్వీ నివృత్తిరావులకు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోనే ప్రదక్షిణ మండపానికి, రోడ్డు అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించారు. ధ్వజస్తంభం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుందరగిరిపై యాగశాలను ఆయన దర్శించుకున్నారు.

పవన్ సుడిగాలి పర్యటన.. ప్రజల నుంచి వినతులు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లా పర్యటన 75 నిమిషాల్లోనే ముగిసింది. తొలుత రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గాన కొయ్యలగూడెం మండలం రాజవరానికి చేరుకున్న పవన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన గ్రామంలో కొద్దిసేపు పాదయాత్రగా వెళ్లారు. గ్రామ పరిధిలో ఆరిపాటిల దిబ్బ-లక్కవరం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఐఎస్ జగన్నాథపురంలో 20.91 లక్షలతో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు. తర్వాత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బడేటి చంటి, చిర్రి బాలరాజు, విజయవాడ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ తదితరులు ఉన్నారు.

అందరి నమ్మకాన్నీ వమ్ము చేశారు

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించారు. సామాన్యుడి దగ్గర నుంచి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ప్రధాన న్యాయమూర్తితో సహా అత్యున్నత రాజ్యాంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, క్రీడలు, కళలు, సాహిత్య రంగాల ప్రముఖులు, ఎందరో భక్తితో నమస్కరిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి భక్తుడు మోసపోయాడు. గత టీటీడీ బోర్డు, అధికారులు మన భక్తికి ద్రోహం చేశారు. గత పాలకులు నియమాలను మాత్రమే ఉల్లంఘించలేదు. వారిపై ఉంచిన అందరి నమ్మకాన్ని వమ్ము చేశారు. మన విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

వేగంగా పరకామణి కేసు దర్యాప్తు

తిరుపతిలో సీఐడీ అధికారుల విచారణ

- నాటి విజిలెన్స్ అధికారి, ఏవీఎస్వో.. రవికుమార్ బంధువుల హాజరు
- రవికుమార్ ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ కేసు విచారణ వేగంగా సాగుతోంది. సోమవారం తిరుపతి పద్మావతి అతిథి గృహంలో సీఐడీ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలువురిని విచారించారు. పరకామణి చోరీ ఘటన జరిగినప్పుడు తిరుమల విజిలెన్స్ అధికారిగా ఉన్న గిరిధర్‌తో పాటు కీలక నిందితుడు రవికుమార్ బంధువులుగా భావిస్తున్న చెన్నైకి చెందిన ఇద్దరు వ్యక్తులు విచారణకు హాజరయ్యారు. అలాగే అప్పటి ఏవీఎస్వో పద్మనాభం, విజిలెన్స్, పోలీసు అధికారుల డ్రైవర్లుగా పనిచేసిన పన్నెండు మందిని కూడా సీఐడీ అధికారులు విచారించారు. పరకామణి కేసులో ఫిర్యాదుదారు, అప్పటి ఏవీఎస్వో సతీశ్ కుమార్ మరణించడంతో తిరుపతిలో విచారణ తాత్కాలికంగా ఆగిన సంగతి తెలిసిందే. సతీశ్‌కుమార్ మృతికి సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా అనంతపురం, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లిన సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్ తిరిగి తిరుపతి చేరుకోవడంతో విచారణ మళ్లీ మొదలైంది. మరోవైపు టీటీడీ పరకామణి కేసులో కీలక నిందితుడుగా ఉన్న రవికుమార్ ఆదాయానికి మించిన ఆస్తులపై తిరుపతి ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోంది. గతంలో టీటీడీకి దానం చేసిన చెన్నైలోని కోట్లాది రూపాయల ప్లాట్లు, తిరుపతి, చంద్రగిరిలో ఉన్న అపార్టుమెంట్లు వంటి వాటితో పాటు ఇంకా ఆస్తులు ఎక్కడ ఉన్నాయి అనే కోణంలో ఏసీబీ అధికారులు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. పలు నగరాలతో పాటు కర్ణాటక, తమిళనాడులో ప్లాట్లు, విల్లాలు, ఖరీదైన వ్యవసాయ భూములు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. రవికుమార్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల పేర్లమీద ఉన్న ఆస్తుల గురించి కూడా వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని కీలక రికార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాలు పరిశీలించి పాసుపుస్తకాలు, చెక్ బుక్‌లు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. కాగా రవికుమార్ ఆర్థిక లావాదేవీలపై కూపీ లాగుతున్న సీఐడీ అధికారులు కూడా తాజాగా బ్యాంకులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ఆరోగ్యాంధ్ర కోసం..

అంతర్జాతీయ నిపుణుల కమిటీ

- సీఎం నేతృత్వంలో 10 మంది సభ్యులతో ఏర్పాటు
- 'స్వర్ణాంధ్ర మిషన్-2047' లక్ష్యంగా సూచనలు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. బహుముఖ వ్యూహాలను సమీక్షించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు వీలుగా 10 మంది అంతర్జాతీయ నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఆమోదం తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించే లక్ష్యంగా 2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు సీఎం చంద్రబాబు ఇప్పటికే విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. వ్యాధుల వారీగా ప్రణాళికలు రూపొందించి ఆయా వ్యాధుల భారాన్ని తగ్గించడానికి నిపుణుల కమిటీ కృషి చేయాల్సి ఉంటుంది. కమిటీ డిసెంబరు మధ్యలో మొదటి సమావేశాన్ని సీఎం నేతృత్వంలో నిర్వహిస్తుంది. కమిటీ సభ్యులు.. పీటర్ పయట్; యూఎన్ ఎయిడ్స్ వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.. డాక్టర్ సౌమ్య స్వామినాథన్, డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త.. ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టేవ్; డీన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, సింగపూర్ యూనివర్సిటీ.. డాక్టర్ కాంగ్; బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ డైరెక్టర్.. డాక్టర్ నాగేశ్వరరెడ్డి, చైర్మన్ ఏఐజీ హాస్పిటల్స్, హైదరాబాద్.. ప్రొఫెసర్ మార్గరెట్ ఎలిజబెత్; హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్.. డాక్టర్ నిఖిల్ టాండన్, ప్రొఫెసర్ ఎయిమ్స్ (న్యూఢిల్లీ).. రిజ్వాన్ కొయిట్; చైర్మన్ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్... శ్రీకాంత్ నాదముని; ఖోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకులు.. ఆర్తి అహూజా; ఐఏఎస్, కేంద్ర మాజీ కార్యదర్శి.

ప్రొవిజనల్ అసైన్‌మెంట్‌పై

సైనికులకు సంపూర్ణ హక్కులు

అసైన్డ్ భూములపై హైకోర్టు స్పష్టత

మాజీ సైనికోద్యోగి భూమిని 22(ఏ) నుంచి తొలగించాలని కలెక్టర్‌కు ఆదేశం

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద సైనికోద్యోగులకు భూకేటాయింపులు, వాటి అమ్మకానికి సంబంధించి పలు అంశాలపై స్పష్టత ఇస్తూ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ప్రొవిజనల్ అసైన్‌మెంట్ చేసినప్పటికీ సైనికోద్యోగులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. భూమిని విక్రయించేందుకు అనుమతిస్తూ 2010 మార్చి 3న రెవెన్యూ కార్యదర్శి మెమో జారీ చేశారని గుర్తు చేసింది. ప్రొవిజనల్ అసైన్‌మెంట్ అనంతరం భూమిని సాగులోకి తీసుకొస్తే డీఫామ్ పట్టా జారీ లాంఛనప్రాయమేనని పేర్కొంది. డీఫామ్ పట్టా జారీలో జాప్యం చోటు చేసుకుందనే కారణంతో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద లభించే ప్రయోజనాలను సైనికోద్యోగులకు దూరం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో (మాజీ) సైనికోద్యోగి(అప్పీల్‌దారు) గత 40 ఏళ్లుగా భూమిని సాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో భూమిని విక్రయించేందుకు అతనికి హక్కులు ఉన్నాయని స్పష్టం చేసింది. ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని అసైన్ చేయడానికి వీల్లేదన్న అధికారుల వాదనను తిరస్కరించింది. అప్పీల్‌దారుకు భూకేటాయింపు చేసిన సర్వే నం.75లోనే ఇతరులకు కూడా భూమిని అసైన్ చేశారని గుర్తు చేసింది. వారు ఆ భూమిని ల్యాండ్ పూలింగ్ కింద వీఎంఆర్‌డీఏకు అప్పగించారని, అందుకు బదులుగా వారు ప్లాట్లు పొందారని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని ఎందుకు అసైన్ చేయకూడదనే విషయంపై స్పష్టత లేదని పేర్కొంది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, సర్వీసులో ఉన్న సైనికోద్యోగులు అసైన్‌మెంట్‌కు అర్హులేనని మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇందుకు సంబంధించి గతంలో తీర్పులు ఉన్నాయని గుర్తు చేసింది. మాజీ సైనికోద్యోగి అప్పారావుకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని, తీర్పు ప్రతి అందిన నాటి నుంచి ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం జారీ చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆలోపు నిషేధిత జాబితా నుంచి భూములు తొలగించకుంటే భూముల బదిలీ/విక్రయం నిమిత్తం దస్త్రాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉంచవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. వాటిని పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. విశాఖపట్నానికి చెందిన పీసీ అప్పారావు ఇండియన్ నేవీలో చీఫ్ పెట్టి ఆఫీసర్ (ఎలక్ట్రీషియన్) హోదాలో 1989 నవంబరు 6న పదవీ విరమణ చేశారు. 1978 డిసెంబరులో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద అప్పారావుకు భీమునిపట్నం మండలం కొత్తవలస గ్రామం పరిధిలోని సర్వే నం. 75-2లో 5.10 ఎకరాల భూమిని అసైన్ చేశారు. గత 40 ఏళ్లుగా ఆ భూమిలో అప్పారావు జీడి సాగుచేస్తున్నారు.

నల్లమలసాగర్‌పై ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేదీలోపు బిడ్లు సమర్పించాలి. పోలవరం-బనకచర్ల అనుసంధానం స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రక్రియను రూ.58,700 కోట్లతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి బిడ్లను ఖరారు చేస్తారు. తయారుచేసిన డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం పరిశీలన, ఆమోదానికి పంపి.. మార్చి నెలాఖరులోగా దాని పరిధిలోని సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఆమోదం పొందాలని.. ఏప్రిల్ నెలాఖరులోగా కేంద్ర జలశక్తి, అటవీ పర్యావరణ శాఖల ఆమోదం కూడా తీసుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పోలవరం కుడి కాలువ నుంచి 175.40 కిలోమీటర్ల అటవీయేతర భూముల ద్వారా ఇప్పటికే నిర్మించిన ఓపెన్ కెనాల్ ద్వారా నీటిని తరలిస్తారు. ఈ జలాలను గోదావరి ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం వద్ద అక్విడెక్టును నిర్మించి నాగార్జున సాగర్ కుడి కాలువలో ఎత్తిపోయాలని మొదట భావించారు. ఇలా అక్విడెక్టును నిర్మిస్తే రూ.1,500 కోట్లు అదనపు వ్యయమవుతుందన్న ఉద్దేశంతో.. అక్విడెక్టు ద్వారా కాకుండా బుడమేరు కాలువ ద్వారా పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలోకి పంపితే గోదావరి ట్రైబ్యునల్ ఆదేశాలు వర్తించే ఆస్కారం లేదని నిపుణులు సూచించారు. దీంతో.. అక్విడెక్టును నిర్మించకుండానే కృష్ణా నదిలోకి రోజుకు 2 టీఎంసీల చొప్పున తరలించాలని నిర్ణయించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మూసీ, మన్నేరు బేసిన్ల పరిధిలో కొత్తగా ఏడు లక్షల ఎకరాలకు నీరివ్వడమే గాక.. వెలిగొండ, గుండ్లకమ్మ, ఇతర చిన్న ప్రాజెక్టుల పరిధిలోని 6 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని.. 60 లక్షల మందికి తాగునీటి సరఫరా, పరిశ్రమలకు 20 టీఎంసీల నీరు సరఫరా ఈ ప్రాజెక్టు లక్ష్యాలు. ప్రాజెక్టు తొలి దశను రూ.13800 కోట్లు, రెండోదశను రూ.35750 కోట్లతోనూ.. మూడో దశను 9150 కోట్లతోనూ మొత్తంగా రూ.58,700 కోట్లతో పూర్తి చేయాలని జల వనరుల శాఖ అంచనా వేసింది.

తెలంగాణకు నష్టం ఉండదు: నిపుణులు

పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం కోసం తయారు చేసిన హైడ్రాలజీ రిపోర్టును, ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను కూడా రాష్ట్రప్రభుత్వం ఇదివరకే జల సంఘానికి పంపింది. దీనిపై తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో విరమించుకుని.. నల్లమలసాగర్ వరకే వరద నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించింది. తాజా స్కీంతో తెలంగాణ సహా ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ ఉండదని నిపుణులు చెబుతున్నారు. దిగువ రాష్ట్రమైన ఏపీ వాడుకునే వరద జలాలతో ఎగువనున్న ఈ రాష్ట్రాలకు ఇబ్బంది ఉండదని స్పష్టం చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి ఏటా 3,000 టీఎంసీలు సముద్రంలో వృధాగా కలుస్తున్నాయని.. ఈ ఏడాది ఇప్పటికే 4,500 టీఎంసీలు కడలిపాలయ్యాయని గుర్తుచేస్తున్నారు. వరద సమయంలోనే రోజుకు రెండు టీఎంసీల చొప్పున నల్లమలసాగర్‌కు తరలిస్తారని చెబుతున్నారు.

వ్యాక్సిన్‌కు కరోనా వైరస్ మస్కా!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేశాయా.. వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో విజయం సాధించాయా..? అంటే.. లేదు అని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు చెబుతున్నారు..! వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో పనిచేయలేదని, వైరస్ జన్యువుల్లో మార్పులే దీనికి కారణమని ఏయూ విద్యార్థుల బృందం చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. ఈ పరిశోధనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కూడా లభించింది. టీ క్యాబ్స్-ఇ ల్యాబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రవికిరణ్ యేడిది నేతృత్వంలో విద్యార్థుల బృందం సుమారు రెండేళ్లపాటు సాగించిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కొవిడ్ వైరస్‌ను నిరోధించే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వాలు వివిధ రకాల వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. భారత్‌లోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వ్యాక్సిన్ అందించాయి. అయితే, కొవిడ్ వైరస్‌ను అరికట్టడంలో, వ్యాప్తిని నిరోధించడంలో వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో పనిచేయలేదని, దీనికి కారణం వైరస్ స్పైక్ ప్రొటీన్లు (జన్యువులు) కారణమని వర్సిటీకి చెందిన విద్యార్థుల బృందం తేల్చింది. 2021 నుంచి 2023 మధ్య కాలంలో నిర్వహించిన ఈ పరిశోధనలో కీలక విషయాలను నిర్ధారించారు.

జన్యు మార్పులతో గందరగోళం..

కొవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా శరీరంలో యాంటీబాడీస్ అభివృద్ధి చెందుతాయి. ఈ యాంటీబాడీస్ శరీరంలోకి వచ్చే వైరస్‌ను చంపి బాధితులకు ఇబ్బందులు కలగకుండా చేస్తాయి. అయితే, యాంటీబాడీస్‌ను అయోమయానికి గురిచేసేలా కరోనా వైరస్ స్పైక్ ప్రొటీన్స్ (జన్యువులు) వ్యవహరించినట్టు విద్యార్థుల పరిశోధనలో తేలింది. ఈ పరిశోధన కోసం అమెరికా నుంచి వైరస్ స్పైక్ ప్రొటీన్‌ను తెప్పించి ల్యాబ్‌లో పరీక్షించారు. ఈ స్పైక్ ప్రొటీన్ ఒకసారి లిక్విడ్ రూపంలోకి, మరోసారి ఘనపదార్థంలోకి మారుతున్నట్టు గుర్తించారు. వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా వచ్చే యాంటీబాడీస్.. వైరస్ ఘనపదార్థంగా ఉన్నప్పుడు మాత్రమే దాడి చేసి నాశనం చేయగలిగాయి. ద్రవ పదార్థంలోకి మారినప్పుడు వైరస్‌ను గుర్తించలేక వాటిని ఏమీ చేయలేకపోయినట్టు పరిశోధనలో గుర్తించారు. దీంతో వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ చాలామందిలో వైరస్ ప్రభావాన్ని నియంత్రించే పరిస్థితి లేకుండా పోయిందని ఈ అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధనను ప్రతిష్ఠాత్మక ఎల్సేవియర్ అంతర్జాతీయ పత్రిక బీబీఏలో ప్రచురితమైంది.

ఇదీ పరిశోధన బృందం..

డాక్టర్ రవికిరణ్ ఏడిది నేతృత్వంలో ఎం.ఫార్మసీ విద్యార్థి మణికంత పోడసాని, అభినవ్ గ్రంధి (ఫార్మాడి), నిహారిక మూకల (ఎమ్మెస్సీ), జాహ్నవి చింతలపాటి (ఎమ్మెస్సీ), మాధురి విస్సాప్రగడ (ఎమ్మెస్సీ), మధుమిత అగ్గున్న (ఎమ్మెస్సీ) పరిశోధన సాగించారు. బయో ఫిజిక్స్, కంప్యూటర్ సిమ్యులేషన్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ, జీనోక్లోనింగ్, ఇతర సాఫ్ట్‌వేర్ పద్ధతుల్లో ప్రయోగాలు నిర్వహించారు. ఈ పరిశోధన బృందాన్ని వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర అధికారులు అభినందించారు.

ఇస్రో-జపాన్ సంయుక్తంగా

'చంద్రయాన్-5'

- ఇస్రో చైర్మన్‌ను కలిసిన జపాన్ అంతరిక్ష విధాన కమిటీ ఉపాధ్యక్షుడు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), జపాన్... రెండు దేశాలూ సంయుక్తంగా చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్ జాతీయ అంతరిక్ష విధాన కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సాకు సునేటా ప్రతినిధుల బృందం రెండు రోజుల క్రితం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. అనంతరం ఆయన ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌తో బృందం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జపాన్-ఇస్రో ఉమ్మడిగా చేపట్టబోయే చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం, ఉమ్మడి కార్యకలాపాలు, సహాయ సహకారాల గురించి చర్చించారు. అనంతరం జపాన్ ప్రతినిధుల బృందం బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహ తయారీ కేంద్రంతో పాటు అక్కడే ఉన్న ఇస్రో శాటిలైట్ ఇంటిగ్రేషన్ టెస్ట్ ఎస్టాబ్లిస్‌మెంట్ (ఐఎస్ఐటీఈ) కేంద్రాన్ని సందర్శించింది. అక్కడున్న సాంకేతిక సౌకర్యాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రెండు దేశాలూ కలిసి పనిచేసే విషయమై చర్చించినట్లు ఇస్రో తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది.

ధర్మేంద్ర మృతికి సీఎం సంతాపం

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతికి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. తన నటనతో లక్షలాది మందిని అలరించిన ధర్మేంద్ర భారతీయ సినిమాకు చేసిన సేవను కొన్ని తరాలు గుర్తించుకుంటాయని పేర్కొన్నారు. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా ధర్మేంద్ర మృతికి సంతాపం తెలిపారు.

6న డాలస్‌లో లోకేశ్ పర్యటన

- గార్లాండ్‌లో భారీ సభ.. 8 వేల మంది హాజరవుతారని అంచనా
- 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ
- ఏపీఎన్నార్టీ చైర్మన్ రవికుమార్ వెల్లడి

(డాలస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)



రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ డిసెంబరు 6న అమెరికాలోని డాలస్‌లో పర్యటించనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు సంఘీభావంగా నిలబడడమే గాక.. గత ఏడాది ఎన్నికల్లో కూటమి విజయానికి శ్రమించిన ప్రవాసాంధ్రులను కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు.. ఇదే సమయంలో రాష్ట్రాభివృద్ధికి వారి నుంచి మరింత చేయూతను అభ్యర్థించే నిమిత్తం ఆయన పర్యటించనున్నట్లు ఈ కార్యక్రమం సమన్వయకర్త, ఏపీఎన్నార్టీ చైర్మన్ వేమూరు రవికుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఎన్నారై టీడీపీ-బీజేపీ-జనసేన శ్రేణులు ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆరో తేదీన డాలస్ పరిసర ప్రాంతమైన గార్లాండ్‌లోని కర్టిస్ కల్వెల్ సెంటర్‌లో జరిగే భారీ సభలో ప్రవాసులను ఉద్దేశించి లోకేశ్ ప్రసంగిస్తారని చెప్పారు. అమెరికా, కెనడాల నుంచి 8 వేల మంది ప్రవాసులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఎగుమతుల వర్తకం సుమారు రూ.17.92 లక్షల కోట్లు ఉండగా.. దిగుమతులు రూ.11.65 లక్ష కోట్లకు చేరాయని, దీనిని మరింత విస్తరించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసేందుకు తన అమెరికా పర్యటనను వ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నారని వెల్లడించారు. డాలస్ పర్యటన అనంతరం 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో పలు కంపెనీల ప్రతినిధులతో ఆయన భేటీ అవుతారని చెప్పారు.

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసం

- జేసీకి కార్పొరేటర్ల లేఖ

నెల్లూరు(సిటీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతి (వైసీపీ)పై కార్పొరేటర్లు తిరుబాటు బావుటా ఎగురవేశారు. ఆమెను మేయర్ పదవి నుంచి దించేయాలని సోమవారం జేసీ వెంకటేశ్వర్లుకు లేఖ అందించారు. నెల్లూరు కార్పొరేషన్‌లో 54 స్థానాలుండగా, ఒకరు రాజీనామా చేశారు. కాగా 53 స్థానాలున్నాయి. ఇందులో టీడీపీకి 40 స్థానాలుండగా, వైసీపీకి 12 స్థానాలు ఉన్నాయి. మరొకరు తటస్థంగా ఉన్నారు. అధికార టీడీపీ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసాన్ని పెట్టాలని కోరుతూ లేఖపై సంతకాలు చేసి జేసీకి అందచేశారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తవడంతో న్యాయపరమైన చిక్కులు తొలగినందున ఆమెపై అవిశ్వాసం పెట్టి, తొలగించాలని కోరారు. ఆమె అవినీతిపైనా విచారణ చేపట్టాలని వారు మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు.

సీమలో ఆదాయం పెరగాలి

- పారిశ్రామికాభివృద్ధితోపాటు ఉద్యానసాగు పెంచాలి
- అధికారులకు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సూచన

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతులకు ఆదాయం మరింత పెరగాలన్నా, సిరులు పండించాలన్నా ఉద్యానవన సాగును మరింత విస్తృతంగా చేపట్టడమే సరైన మార్గమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. సీమప్రాంత అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ..'రాయలసీమ ప్రాంతానికి అద్భుతమైన అభివృద్ధి జరిగేందుకు అవసరమైన అన్ని వనరులు ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వివిధ రకాల పరిశ్రమలు, కంపెనీలు పెడుతున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు పరిశ్రమల వైపు నుంచే కాకుండా ఉద్యానవనసాగు ద్వారా మరింత ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలి. పొరుగురాష్ట్రాలతో మెరుగైన కనెక్టివిటీ ఉండటం రాయలసీమకున్న పెద్ద వరం. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలకు సీమతో కనెక్టివిటీ ఉంది. ఇలాంటి అవకాశాలను వినియోగించుకుని ఉద్యాన ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. అంతేకాకుండా కొన్ని రకాల ఉద్యానపంటలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఇతర దేశాలకూ ఎగుమతులు చేసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఉద్యాన పంటల అభివృద్ధికి కావాల్సిన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కియా పరిశ్రమతో అనంతపురం జిల్లాకు ఆదాయం పెరిగింది. జిల్లా జీఎస్డీపీ పెరిగింది. జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో విశాఖ తర్వాత అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పుడు సీమప్రాంతానికి పరిశ్రమలు ఎక్కువగా వస్తున్నాయి. అయితే పరిశ్రమలకు మించిన స్థాయిలో ఉద్యాన పంటల ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగాలి. సీమలో 2 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేస్తే లక్షలు, కోట్ల రూపాయల్లో ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ పంటలు పండిస్తే ఆదాయం మరింత పెరుగుతుంది. సంపద సృష్టి పరిశ్రమల ద్వారానే కాదు పంటల ద్వారా కూడా చేయవచ్చని రాయలసీమ రైతులు నిరూపించాలి' అన్నారు.

డేటా సెంటర్ వివరాలు వెల్లడించాలి: రాఘవులు

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సమీపంలోని తర్లువాడలో పెడుతున్న గూగుల్ డేటా సెంటర్ వివరాలను బయట పెట్టాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ డేటా సెంటరుకు భారీ స్థాయిలో విద్యుత్తు, నీరు అవసరం. వాటిని ఎక్కడ నుంచి తీసుకొస్తారో చెప్పాలి. రూ.1.50 లక్షల కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటరు కోసం 49 మంది దళిత రైతుల నుంచి 100 ఎకరాల డి.ఫారం పట్టా భూములను బలవంతంగా తీసుకుంటున్నారు. వారికి ప్రత్యామ్నాయంగా భూమిని ఎందుకు ఇవ్వరు? దీనిపై సామాజిక పర్యావరణ అధ్యయన నివేదికను కూడా బయటపెట్టలేదు. అసలు పర్యావరణ ప్రభావం అంచనా వేశారా? లేదా? చెప్పాలి. డేటా సెంటరు వల్ల లక్షల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు. కానీ స్థానికులకు ఉపాధి కల్పించడం లేదు. సీఎం ప్రకటించిన సంజీవని పథకానికి సంబంధించిన విషయాలను కూడా ప్రభుత్వం దాస్తోంది. సంజీవని ద్వారా ఆరోగ్య సేవలంటే వాటిని ప్రైవేటుపరం చేయడమే. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం అప్రజాస్వామికం. కార్మికుల హక్కులను కాలరాచే ఈ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 26న కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనలకు సీపీఎం పూర్తి మద్దతు ఇస్తుంది. ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన ప్రజానీకంపై యుద్ధం చేస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను కాల్చి చంపుతున్నారు. ఏపీ ప్రభుత్వం.. కేంద్రంలోని బీజేపీ క్రూరత్వానికి ప్రతినిధిగా నిలుస్తోంది' అని రాఘవులు విమర్శించారు.

29 నుంచి భారీవర్షాలు

- రైతులు పంటలను జాగ్రత్త చేసుకోవాలి
- వాతావరణ అధికారుల సూచన

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మలక్కా జలసంధి, దానికి ఆనుకుని మలేషియా పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం నాటికి దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించి వాయుగుండంగా మారనుంది. ఆ తర్వాత 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, కామరూన్ పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శ్రీలంకకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో మంగళవారం మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది బలపడి తమిళనాడు తీరం వైపు వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రెండు అల్పపీడనాలు బలపడి ఈ నెల 29 నాటికి తమిళనాడు, దానికి ఆనుకుని కోస్తా తీరం వైపు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ 29వ తేదీన దక్షిణ కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా, అక్కడక్కడ భారీగా, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ఈ నెల 30న రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీవర్షాలు, ఉత్తర కోస్తాలో భారీవర్షాలు కురుస్తాయి. ఆ తర్వాత రెండు రోజుల్లో కోస్తాలో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనాల ప్రభావంతో ఈ నెల 25 నుంచి 28 వరకూ దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. రైతులు ముందు జాగ్రత్త చర్యగా కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వెంటనే కోసి, నూర్పిళ్లు చేసుకోవాలని అమరావతి వాతావరణ కేంద్రం అధికారిణి స్టెల్లా సూచించారు.

జూన్‌లోగా 1.4 కోట్ల

స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు

- మెరుగైన సంక్షేమం, సేవల కోసమే
- కార్డులో సమస్త సమాచారమూ ఉండాలి
- డేటా లేక్ నుంచి తీసుకోవాలి: ముఖ్యమంత్రి

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను(ఎఫ్‌బీఎంఎస్) అమలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుటుంబ సాధికారత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని ఆయన సూచించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై సోమవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... 'ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందిస్తున్న పౌర సేవల్ని, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి పర్యవేక్షించాలి. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలి. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలి. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలి. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలి. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధ్రువీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలి. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయవద్దు. పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలి. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించడంతో పాటు సులభంగా పౌరసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలి. ఒకే కార్డు ద్వారా పౌరులు అన్ని ప్రభుత్వ సేవల్ని, పథకాలను పొందేలా చూడాలి. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారా తెలిసేలా రూపొందించాలి. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి జూన్‌లోగా కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు.



కాలుష్య నియంత్రణపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్లాస్టిక్ వ్యర్థాలు కనపడొద్దు!

త్వరలో ఒక విధాన నిర్ణయం

- 'నెట్ జీరో' కాలుష్యం లక్ష్యం
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తగ్గాలి: సీఎం

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను డిస్పోజ్ చేసేందుకు ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)తో సహా వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలని నిర్దేశించారు. గాలి, నీరు, పరిశ్రమలు, ప్లాస్టిక్, బయో వ్యర్థాల వంటి విషయాలపై వివిధ రకాల అధ్యయనాలు చేయాలని, ఇందుకోసం టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. ఎవరైనా నియమాలను అతిక్రమిస్తే.. సదరు సంస్థలు, వ్యక్తులకు ముందుగా హెచ్చరికలు జారీ చేసి, తర్వాత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య పరిరక్షణ కేంద్రాల్లో బయో వ్యర్థాల డిస్పోజల్స్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని, 48 గంటల్లోగా వాటిని డిస్పోజ్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీని పర్యవేక్షణకు టెక్నాలజీ, సీసీ టీవీలను వినియోగించాలని అధికారులకు సూచించారు.

వాయు నాణ్యతను విశ్లేషించాలి

రాష్ట్రంలో వాయు నాణ్యతను అన్ని కోణాల్లో విశ్లేషించాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఎయిర్ క్వాలిటీ సిస్టం మానిటరింగ్ కోసం సరికొత్త సాంకేతికతను వినియోగించాలని, ఈ డేటాను అవేర్-2.0కు లింక్ చేయాలని నిర్దేశించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దృష్టిలో పెట్టుకుని, పరిశ్రమలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన మార్పులు చేయాలని ఆదేశాలు జారీచేశారు. రెడ్ జోన్ పరిధిలోని పరిశ్రమలకు 12 రోజులు, ఆరెంజ్ జోన్‌లోని పరిశ్రమలకు 10 రోజులు, గ్రీన్ జోన్‌లోని పరిశ్రమలకు 3 రోజుల్లో అనుమతివ్వాలని పేర్కొన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు అన్నింటినీ త్వరలో అందుబాటులోకి తేవాలన్నారు. మైనింగ్ కాలుష్యం విషయంలోనూ దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు రోజుల్లో కాలుష్యం అంశాన్ని కూడా 'అవేర్'లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్‌లోనూ పంట పొలాల్లో ప్లాస్టిక్ షీట్ల వినియోగం వల్ల దీర్ఘకాలంలో రైతులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని, దీని కోసం బయో షీట్లు వేసేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలని, దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలికి అవసరమైన సిబ్బంది కావాలని పీసీబీ చైర్మన్ కృష్ణయ్య కోరగా.. సీఎం అందుకు సానుకూలంగా స్పందించారు.

'ఉమ్మీద్'లో వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంచండి

కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు చంద్రబాబు లేఖ.. సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూక్, అజీజ్, షరీఫ్

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల వివరాలను 'ఉమ్మీద్' పోర్టల్‌లో నమోదు చేసే గడువును 12 నెలలు పొడిగించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ మంత్రి ఫరూక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వక్ఫ్ ఆస్తుల వివరాలను ఉమ్మీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి గడువు డిసెంబరు 5తో ముగియనుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,748 రిజిస్టర్డ్, పదివేల దాకా అన్ రిజిస్టర్ వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని.. ఇప్పటి వరకు 3,100 ఆస్తుల వివరాలను విజయవంతంగా అప్‌లోడ్ చేసినప్పటికీ, సాంకేతిక సమస్యలు, స్టేక్ హోల్డర్ల సమస్యల కారణంగా తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల రక్షణను దృష్టిలో పెట్టుకుని మరో ఏడాదిపాటు గడువు పెంపు కోసం లేఖ రాసిన సీఎంకు మంత్రి ఫరూక్‌తోపాటు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఎంఏ షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల్లోకి వెళ్లండి

మెరుగ్గా పౌర సేవలను అందించండి

- సుపరిపాలనపై ఎమ్మెల్యేలు, ఎంపీలకు వచ్చే నెల ప్రత్యేక వర్క్‌షాప్
- వాతావరణం సహా 42 అంశాలతో అవేర్ యాప్
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లోకి వెళ్లి మెరుగైన సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సుపరిపాలనపై వచ్చే నెలలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబ్బందిలో పాలనాసామర్థ్యాలు పెరిగేలా, వారికి కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాతావరణం సహా 42 అంశాలతో త్వరలోనే అవేర్ యాప్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. సచివాలయంలో సోమవారం రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సేవలను మరింత మెరుగ్గా, సులభంగా, విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ప్రజామోదం మేరకే మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సభల ఆమోదం తీసుకున్నాకే పనులు పూర్తి చేయాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో కెపాసిటీ బిల్డింగ్ జరగాలని తెలిపారు. మొక్క జొన్న, పత్తి, అరటి పంటల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించి రైతులకు ధర దక్కేలా చూస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు సంబంధించిన పనులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతరం డేటా ఆధారంగా ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని, పౌర సేవలను అందించడంలో నిర్లక్ష్యం చూపేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. వాతావరణ హెచ్చరికలు సహా 42 అంశాలపై నిరంతర సమాచారం అందించడం కోసం అవేర్ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ల్యాండ్ బ్రిడ్జి కనెక్టివిటీని పెంచాలని, సంక్షేమ హాస్టళ్లలోని తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రతపై పర్యవేక్షణ నిరంతరం ఉండాలని, దీనిపైనా యాప్‌ను సృష్టించాలంటూ అధికారులకు సూచించారు. టీటీడీ తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలు, రద్దీ నిర్వహణ, భద్రత వంటి అంశాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ఇతర దేవాలయాల్లో కూడా వర్తింపజేయాలన్నారు. వాయు కాలుష్యం తగ్గించేలా క్వాలిటీ సెన్సార్‌లను కాలుష్య నియంత్రణ మండలితో కలసి ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

పట్టణ కాలువలపై నేడు సీఎం సమీక్ష

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ చేపడుతున్న వరద నివారణ యాజమాన్య విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణాల్లోని కాలువల నిర్వహణపై సూచనలు చేయనున్నారు. వరద కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల అకస్మాత్తుగా భారీ వరదలతో పట్టణాలు ముంపునకు గురవుతున్నాయి. క్లౌడ్‌బర్స్ట్‌తో అనూహ్యంగా వర్షాలు కురుస్తుండటంతోనూ పట్టణాలు, నగరాలు వరదలో చిక్కుకుంటున్నాయి. దీనివల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. వీటని దృష్టిలో ఉంచుకుని వరద నీటి యాజమాన్య విధానాలపై సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు.

మరో రూ.21,793 కోట్ల


పెట్టుబడులు!

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం పొందిన ప్రతిపాదనలకు సీఎం ఆధ్వర్యంలోని రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఈ నెల 28వ తేదీన వాటిని మంత్రిమండలి ముందుంచుతారు.

ఆమోదం పొందిన ప్రతిపాదనలివీ..

- శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, గుడిబండ మండలాల్లో రూ.8,500 కోట్లతో 1,700 మెగావాట్ల ఏసీ/2,125 మెగావాట్ల డీసీ సోలార్ ఎనర్జీ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు చేసిన ప్రతిపాదనకు ఆమోదం. దీనిద్వారా 5,800 మందికి ఉపాధి.
- అనంతపురం జిల్లా కనేకల్, బొమ్మనహళ్ మండలాల్లో రూ.2,140 కోట్లతో గనేకో త్రీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదించిన 300 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుకు ఆమోదం. వెయ్యి మందికి ఉద్యోగాలు.
- రూ.850 కోట్లతో ప్రకాశం జిల్లా దొనకొండలో 130 మెగావాట్ల డీసీ, 150 మెగావాట్ల డీసీ సోలార్‌పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు క్రెడిబుల్ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు లిమిటెడ్‌కు గ్రీన్‌సిగ్నల్.
- రూ.2,926 కోట్లతో శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలో ఎంవీఆర్ టెర్రా వెంట్ ప్రతిపాదించిన 640 మెగావాట్ల ఏసీ, 770 మెగావాట్ల డీసీ ప్రాజెక్టుకు ఆమోదం. 1,300 మందికి ఉపాధి.
- సిఫ్పా టెక్ ఇండియా (రూ.1,140 కోట్ల పెట్టుబడి, 1,251 మందికి ఉద్యోగాలు), శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ (రూ.62 కోట్లు-500 మందికి ఉపాధి), ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ (రూ.30 కోట్లు-600 మందికి ఉద్యోగాలు) నాన్‌రెల్ టెక్నాలజీస్ (రూ.51 కోట్లు-567 మందికి ఉద్యోగాలు), పీవీఆర్ హాస్పిటల్స్ (రూ.225 కోట్లు-1,230 మందికి ఉద్యోగాలు), మెగ్లాన్ లీజర్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ (రూ.348 కోట్లు-1,700 మందికి ఉపాధి)లకు 2025-29 పారిశ్రామిక విధానం మేరకు భూములను కేటాయించడంతో పాటు ప్రోత్సాహకాలివ్వాలని ఎస్ఐపీసీ తీర్మానం.
- రామాయపట్నం పోర్టుకు సమీపంలో చేవూరు వద్ద మల్టీ మోడల్ కార్గో హ్యాండ్లింగ్‌ను రూ.1,615 కోట్లతో చేపట్టేందుకు రామాయపట్నం కార్గో రైల్‌కు అనుమతి. దీనిద్వారా 1,300మందికి ఉద్యోగాలు. ఈ సంస్థకు 429 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వానికి సిఫారసు.
- ఎర్లీబర్డ్ ప్రతిపాదనల కింద మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ తిరుపతిలో రూ.343 కోట్లతో 355 మందికి ఉద్యోగాలను కల్పిస్తామని ప్రతిపాదించింది. ఈ సంస్థకు 30 శాతం క్యాపిటల్ సబ్సిడీ.
- బాపట్ల జిల్లాలో రూ.163 కోట్లతో 415 మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎమెర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనకు ఆమోదం. దీనికి కూడా 30 శాతం పెట్టుబడి రాయితీ. ఇదే జిల్లాలో జెడ్‌ఈఐటీ ఎనర్జీ రూ.305 కోట్లతో 300 మందికి ఉద్యోగాలను కల్పించే ప్రాజెక్టుకూ 30 శాతం పెట్టుబడి రాయితీ. ఏలూరు జిల్లాలో రూ.141 కోట్లతో 600 మందికి ఉద్యోగాలిచ్చే రామన్‌సింగ్స్ గ్లోబల్ ఫుడ్ పార్కుకు 30 శాతం పెట్టుబడి సబ్సిడీ.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్ రూ.1,225 కోట్లతో 2,000 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం.





ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సన్మానిస్తున్న మంత్రి లోకేశ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమ, పట్టాభి తదితరులు, చాగంటి పాదాలకు నమస్కరిస్తున్న లోకేశ్

విలువలకు తొలి బడి కుటుంబం!

(మొదటి పేజీ తరువాయి)

గొప్పగా చెప్పారు. 'పేదరికం అంటే తెలియకుండా మా అమ్మ పెంచింది' అని చెప్పారు. అలాగే సీఎం చంద్రబాబు తన తల్లి అమ్మణమ్మ గురించి ఓ వ్యాసంలో గొప్పగా రాశారు. 'మా అమ్మ చెప్పిన మాటల స్ఫూర్తితోనే కష్టపడటం నేర్చుకున్నా'నని ఆయన రాశారు. జీవితంలో తల్లి తర్వాత తండ్రి అంతటి గొప్ప వ్యక్తి. తల్లిదండ్రులకు గౌరవం ఇస్తే నైతికత, విలువలు పెరుగుతాయి. ఆ తర్వాత తోబుట్టువులతో ప్రేమగా మెలగాలి. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా మీకు స్నేహితులు దొరుకుతారు. కానీ తోబుట్టువులు దొరకరు. అలాగే మన కంటే తక్కువగా ఉన్నవారిని చిన్నచూపు చూడడం, పరిహసించడం మంచి విధానం కాదు. ఏదైనా తొలుత ఇంటి నుంచి నేర్చుకుంటే అదే సమాజంలోనూ అమలు చేస్తాం. నైతిక విలువలు లేని విద్య వల్ల ఉపయోగం ఉండదు. తల్లిదండ్రుల తర్వాత పిల్లలను ప్రేమించేవారు గురువులే. గురువులను అపహాస్యం చేయడం, విమర్శించడం తగదు. గొప్పవారి జీవిత చరిత్రలను చదవడం విద్యార్థులు నేర్చుకోవాలి." అని చాగంటి తెలిపారు.

అదనంగా క్రీడలు, కళల అభ్యాసం

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు చాగంటి కోటేశ్వరరావు సమాధానాలిచ్చారు. ఆత్మవిశ్వాసం, ప్రణాళికాబద్ధమైన జీవితం ద్వారా ఒత్తిడి దూరమవుతుందని, పరీక్షలను సులభంగా రాయగలమే నమ్మకం విద్యార్థులకు ఉండాలని తెలిపారు. చదువుతో పాటు ప్రతి పనికీ ఒక ప్రణాళిక ఉండాలని, సమయపాలన పాటిస్తే ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా చేయగలమని, అందు కోసం పరిశుభ్రంగా ఉండటం, వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ పనులు తాము చేసుకోవడం అలవర్చుకోవాలని, కీర్తనలు ఆలపించడం, క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం లాంటివాటిని చదువుకు అదనంగా నేర్చుకోవాలని కోరారు. "మనం ఇతరుల నుంచి ఎలాంటివి వద్దు అనుకుంటామో, అవి మనం ఇతరులకు చేయకూడదు. రామాయణం, మహాభారతం, భాగవతం చదవడం వల్ల విలువలు పెరుగుతాయి. ఆ గ్రంథాల్లోని విలువలను నేర్చుకుంటే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతాం. విద్యార్థులకు స్వీయ నియంత్రణ అవసరం. ఉదాహరణకు సెల్‌ఫోన్‌ను ఎంతవరకు వాడాలో అంతవరకే వాడితే అది ఉపయోగపడుతుంది. అతిగా వాడితే నష్టాలు వస్తాయి. అవసరంలేని విషయాల జోలికి వెళ్లకూడదు." అని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.

విజయానికి దగ్గరి దారి లేదు

అన్ని జిల్లాల్లో విలువల సదస్సులు: లోకేశ్



అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయానికి దగ్గరి దారి ఉండదని, అందరూ తప్పులు చేసి ముందుకెళ్తున్నారని, మనం కూడా వాటిని చేయకూడదని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. ఒకవేళ దగ్గరి దారిలో ఎదిగినా ఆ స్థానం నిలబడదన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన 'విలువల విద్యా సదస్సు'లో ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు పైవిధంగా స్పందించారు. "నైతిక విలువలు పాటించేవారు ఏం చేయలేకపోతున్నారనే అభిప్రాయం ఉంది. జీవితంలో ఏం సాధించారని అలాంటివారిని అడుగుతుంటారు. దీనిపై మీరేం అంటారు?.' అని ఓ విద్యార్థి అడిగాడు. దానికి స్పందిస్తూ...తాను మంగళగిరి నియోజకవర్గంలో ఓడిపోయినప్పుడు చాలా మంది అవమానించారని, తొలుత బాధపడినా, ఆ తర్వాత లోపాలు ఎక్కడున్నాయో గుర్తించి మళ్లీ అక్కడినుంచే భారీ మెజారిటీతో గెలిచానని తెలిపారు. సినిమాలు, సోషల్ మీడియాలో మహిళలను కించపరిచే వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించగా, చట్టాల కంటే కూడా మహిళలను గౌరవించడం అనేది మొదట ఇంటినుంచే మొదలవ్వాలని లోకేశ్ అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన... మహిళలే మహిళలను కించపరిచేలా మాట్లాడటం బాధ కలిగిస్తోందని చెప్పారు. తనకు గురువులే స్ఫూర్తి అని, పాఠశాల స్థాయిలో మంజుల టీచర్, రమామణి టీచర్, ఇంటర్మీడియట్‌లో మంత్రి పి.నారాయణ, యూనివర్సిటీలో రాజిరెడ్డి తనకు ఇష్టమైన గురువులని తెలిపారు.

ప్రజల్లోకి విలువల ప్రచారం

ఎవరైనా క్యాబినెట్ ర్యాంకు కావాలని కోరుకుంటారని, కానీ చాగంటి కోటేశ్వరరావు కనీసం తాము ఇచ్చిన కాఫీ కూడా తీసుకోలేదని, ప్రభుత్వ వాహనం వాడటం లేదని, సెల్‌ఫోన్ బిల్లు కూడా ఆయన కట్టుకుంటున్నారని లోకేశ్ తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలనే చర్చ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు...చాగంటి పేరు సూచించారన్నారు. ఆయన మార్గనిర్దేశంలో విలువల సాధన కోసం పనిచేస్తున్నామని తెలిపారు. విలువల విద్యా సదస్సులను ఇకపై అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని, ఆ తర్వాత ప్రజల కోసం నియోజకవర్గాల స్థాయిలో కూడా నిర్వహిస్తామని వెల్లడించారు. సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో మహిళలను కించపరిచే డైలాగులు లేకుండా ప్రయత్నిస్తున్నామని, ఇందుకోసం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడానని అన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమ, ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

చకచకా రాజధాని పనులు

ఊపందుకున్న ఐకానిక్ భవనాల నిర్మాణం.. రేయింబవళ్లు జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల పనులు

- 5 టవర్లలో ఏకకాలంలో పనుల కొనసాగింపు
- ఆరు నెలల్లో బేస్‌మెంట్ దాటి బయటకు
- జడ్జిలు, ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల్లోనూ పురోగతి
- మరో మూడు నెలల్లో ఇంటీరియర్ దశకు..
- వేగంగా మంచినీటి పైపుల ఏర్పాటు



రాజధాని అమరావతిలో కొనసాగుతున్న ఐకానిక్ టవర్ పనులు



అమరావతిలో ఐఏఎస్ క్వార్టర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రాష్ట్ర రాజధానిలో కీలకమైన ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచారు. బేస్‌మెంట్ నుంచి రెండు ఫ్లోర్ల పనులు స్పీడ్‌గా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలు భావిస్తున్నాయి. త్వరగా ఎగువ బేస్‌మెంట్ పనులు చేపడితే వర్షాల వల్ల పనులు నిలిచే అవకాశం ఉండదని చెబుతున్నారు. దీంతో రాత్రింబవళ్లూ పనులు చేస్తున్నారు. మొత్తం 5 ఐకానిక్ టవర్లలో ప్రధానమైనది జీఏడీ టవర్. బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్ సహా మొత్తం 47 అంతస్తుల భవనం ఇది. ప్యాకేజీ-1లో రూ. 1,126 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ముఖ్యమంత్రి కార్యాలయం, టవర్ పైన హెలిప్యాడ్‌ను కూడా నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం దీని బేస్‌మెంట్ చుట్టూ మిగిలిపోయిన బ్యాలెన్స్ కాంక్రీట్ పనులు చేపడుతున్నారు. బేస్‌మెంట్‌పై ఐరన్ బ్యారికేడింగ్ పను లు పూర్తయ్యాయి. నిరంతరాయంగా కాం క్రీట్ పను లు చేస్తే 2, 3 నెలల్లో జీఏడీ టవర్ పనుల పురోగతి బయటకు కనిపిస్తుందని కాం ట్రాక్టు సంస్థ అంచనా వేస్తోంది.

40 అంతస్తుల్లో సెక్రటేరియట్ టవర్లు

ఇక సెక్ర టేరియట్ టవర్ల విషయానికి వస్తే.. ఒకటి, రెండు టవర్లను ప్యాకేజీ-2లో భాగం గా రూ. 1,897 కోట్లతో, మూడు, నాలుగు టవర్లను ప్యాకేజీ-3లో భాగం గా రూ.1,664 కోట్లతో నిర్మించడానికి టెండర్లు పిలిచారు. ఈ భవంతులు 40 అంతస్తుల ఎత్తున నిర్మించాల్సి ఉంటుంది. ఈ నాలుగు టవర్ల పనులు కూడా ఏకకాలంలో మొదలయ్యాయి. కొన్నింటికి టవర్ల నాలుగు వైపులా అదనంగా పైలింగ్ పనులు చేయాల్సి ఉండటంతో వాటిని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. వాటికి సం బంధించిన కాంక్రీటింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. మిగిలిన టవర్ల బ్యాలెన్స్ పనుల కోసం బ్యారికేడింగ్ పను లు చేపట్టారు. నిరంతరాయంగా ఈ పనులు కొన సాగుతున్నాయి. కాంక్రీట్ మిక్సింగ్ ప్లాం ట్లు రాత్రింబవళ్లూ పనిచేస్తున్నాయి. అన్ని టవర్లను కూడా గతంలోనే రాఫ్ట్ టెక్నాలజీ విధానంలో చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ టెక్నాలజీ వల్ల భూ కంపాలను కూడా తట్టుకునే సావ ర్థ్యం ఉంటుంది. ఐదు ఐకానిక్ టవర్ల నిర్మా ణ పను లు ఇదే రీతిన జరిగి తే ఆరు నెలల్లోనే పనుల పురోగతి కనిపి స్తుంది.



ఒక రూపునకు వచ్చిన జడ్జిలు, ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల్లో కొన్ని

వేగంగా పైపులైన్లు, మొక్కలు నాటే పనులు

అమరావతిలోని రోడ్ల వెంబడి ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైపులైన్ల పనుల్లో వేగం పెరిగింది. ఈ పనుల్లో ప్రస్తుతం 30 శాతం పనులు ఊపందుకున్నాయి. భారీ ఐరన్ పైపులను ఏర్పాటు చేసి వెల్డింగ్ పనులు చేస్తున్నారు.

ఇదే సందర్భంలో ఏడీసీఎల్ అభివృద్ధి పరిచిన మొక్కలను కూడా పైపులకు సమీపంలో రెండువైపులా నాటుతున్నారు. పనులకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాల్సి వచ్చిన సందర్భంలో వాటిని నరకకుండా ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో నర్సరీకి తరలించి అక్కడ బతికిస్తున్నారు. తిరిగి వాటినే మళ్లీ పైపులైన్లు వేసిన చోట ట్రాన్స్‌లోకేట్ చేస్తున్నారు.

జడ్జిల భవనాల్లోనూ పురోగతి


ఐకానిక్ టవర్లు కాకుండా జడ్జిలు, ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల పనులు పురోగతిలో ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్ధంతరంగా ఆగిపోయిన పనులన్నీ ఇప్పుడు చకచకా జరుగుతున్నాయి. గతంలో పిల్లర్లతో కనిపించినవి ప్రస్తుతం బంగళా ఆకారం సంతరించుకున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ ఒక్కటే పూర్తయిన వాటిలో ఇప్పుడు మొదటి అంతస్తు పనులు కొనసాగుతున్నాయి. కొన్ని భవనాల పనులు ఇప్పుడు మొదలై వేగంగా జరుగుతున్నాయి. మరో మూడు నెలల్లో వీటిలో చాలా వరకు ఇంటీరియర్ దశకు చేరుకునే అవకాశాలు ఉన్నాయి.



ఎన్జీవో టవర్ల వద్ద అధికారులు, ఇంజనీర్ల బృందం



మంచినీటి పైప్‌లైన్ పనులతో పాటు మొక్కలు నాటుతున్న దృశ్యం



రోడ్లను ఆనుకుని కొనసాగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులు

కార్మికుల భద్రతలో 'అమరావతి' ఘనత

- ఎన్జీఓ టవర్ల నిర్మాణంలో 10 లక్షల సురక్షితమైన పనిగంటల నమోదు
- భద్రతా ప్రమాణాలకు ఇదే నిదర్శనమన్న అధికారులు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల్లో సురక్షితమైన పనిగంటల విషయంలో రాజధాని అమరావతి ఓ కొత్త ఘనత సాధించింది. ఏపీసీఆర్డీఏ నిర్మిస్తున్న ప్రభుత్వోద్యోగుల గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో భాగంగా చేపట్టిన ఎన్జీఓ ఉద్యోగుల టవర్ల నిర్మాణ సంస్థ 9, 12 అపార్టుమెంట్ల పనుల్లో సురక్షితమైన పనిగంటల రికార్డు సాధించింది. ఈ ప్రాజెక్టులో ఈనెల 18వ తేదీనాటికి 10 లక్షల సురక్షితమైన పనిగంటలను నమోదు చేసింది. పని ప్రదేశంలో భద్రతను లెక్కించే 'లాస్ట్ టైమ్ ఇంజురీ (ఎల్‌టీఐ)' రేట్ విషయంలో అన్ని పని గంటలను విజయవంతంగా పూర్తిచేసింది. అంటే అన్ని పనిగంటల పాటు ఏ కార్మికుడూ గాయపడకుండా ఉండి, విధులకు హాజరైనట్లు. కాగా, ఇది సీఆర్డీఏ పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనమని అధికారులు చెబుతున్నారు. నిర్మాణ ప్రాంతంలో సురక్షిత విధానాలు, కార్మికులకు క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, ముందస్తు భద్రతా చర్యల కారణంగా ప్రమాదాలు జరగకుండా నిర్మాణ పనులు నిర్వహించి ఈ మైలురాయిని చేరుకున్నామని వివరించారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ ఈఎస్ఎం విభాగం డైరెక్టర్ నితిన్ శర్మ సోమవారం మాట్లాడారు. అమరావతి నిర్మాణ ప్రాజెక్టుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యమిస్తున్నామని, జాగ్రత్తగా పనిచేస్తే ఎలాంటి ప్రమాదాన్నైనా నివారించగలమన్న నమ్మకాన్ని ఈ ఘనత చాటిచెప్పిందని అన్నారు. ఈసందర్భంగా సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, హార్టీకల్చర్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పీబీఎస్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీ. అనితావాణి తదితర అధికారలు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పండుగ వాతావరణంలో ధాన్యం కొనుగోళ్లు!

రాష్ట్రంలో 51 లక్షల టన్నుల సేకరణకు నిర్ణయం


- ఇప్పటికే 14 లక్షల టన్నుల సేకరణ
- ఆందోళన వద్దు.. 28 తర్వాతే వర్షాలు!
- రైతులకు మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా



తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండుగ వాతావరణంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ జరుగుతోందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో తొలిసారి 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇదొక చరిత్ర అని తెలిపారు. ఇప్పటికే 14 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేశ్‌తో కలసి సోమవారం ఆయన తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. చాగల్లు, కొవ్వూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందన్నారు. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు ప్రపంచవ్యాప్తంగా రాష్ట్రానికి అన్నపూర్ణగా కీర్తి తెచ్చాయని చెప్పారు. అటువంటి అన్నదాతల కోసం ధాన్యం కొనుగోలు చేసిన 4 లేదా 5 గంటల్లోపే డబ్బును వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 4.9 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, అందులో 4 టన్నులు కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే 1.35 లక్షల టన్నులు కొనుగోలు చేసి, రూ.400 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రవాణా, గోనె సంచుల విషయంలో ఎక్కడ పొరపాటు దొర్లినా వెంటనే సమస్యను లోతుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. 17 శాతం తేమ విషయంలో అధికారులు సక్రమంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈనెల 28, 29వ తేదీల తర్వాతే వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు ఆందోళన చెందకుండా ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, లేఅవుట్లలో కూడా ధాన్యం ఎండబోసుకోవచ్చన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుకు పూర్తిగా అండగా ఉంటుందన్నారు. మంత్రుల వెంట కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

2 కొత్త జిల్లాలు!



(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేసిన మంత్రుల బృందం నివేదికను రూపొందించింది.

27వ జిల్లాగా మదనపల్లె..

విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం కొత్తగా ఉమ్మడి చిత్తూరులో ఉన్న మదనపల్లెను, ప్రకాశం జిల్లాలో ఉన్న మార్కాపురాన్ని జిల్లాలుగా ఏర్పాటు చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. మదనపల్లె ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉంది. ఈ ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలన్నది అక్కడి ప్రజల చిరకాల కోరిక. జిల్లా ఏర్పాటు చేస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారు కూడా. ఈ మేరకు ఉపసంఘం కూడా 21 మండలాలతో మదనపల్లెను 27వ జిల్లాగా ప్రతిపాదించింది. ఇందులో మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 9 మండలాలు(మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెర్వు, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట).. కొత్తగా ఏర్పాటుచేసే పీలేరు డివిజన్‌లో 12 మండలాలు (సదుం, సోమల చౌడేపల్లి, పుంగనూరు, రొంపిచర్ల, పులిచెర్ల, పీలేరు, గుర్రంకొండ, కలకాడ, కంభంవారిపల్లె, కలకిరి, వాల్మీకిపురం) ఉంటాయి. కొత్త జిల్లా పరిధిలో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండాలని ప్రతిపాదించారు.

28వ జిల్లాగా మార్కాపురం..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురం పెద్ద రెవెన్యూ డివిజన్. ఈ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్నది ఇక్కడి ప్రజల దీర్ఘకాలిక డిమాండ్. తాము అధికారంలోకి వస్తే జిల్లాను చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగానే ఉపసంఘం సిఫారసు చేసింది. ప్రతిపాదిత మార్కాపురం జిల్లాలో యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండాలని సూచించింది. ఇందులో మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఉంటాయి. గిద్దలూరును కొత్త డివిజన్‌గా ప్రతిపాదించినా.. ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో రెండు డివిజన్లకే పరిమితం కానున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే జిల్లాలో 21 మండలాలను ప్రతిపాదించారు. వీటిలో మార్కాపురం డివిజన్‌లోని 9 మండలాలు (యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, డోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు).. కనిగిరి డివిజన్‌లోని 12 మండలాలు (హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెద్ద చెర్లోపల్లె, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు).. ఉంటాయి. గిద్దలూరు డివిజన్‌పై వెనుకడుగు వేసిన నేపథ్యంలో గిద్దలూరు నియోజకవర్గంలోని మండలాలను ఏ జిల్లాలో ఉంచాలో మంగళవారం ఉపసంఘం ఖరారు చేయనుంది.

కొత్తగా 4 రెవెన్యూ డివిజన్లు..

రాష్ట్రంలో ప్రస్తుతం 77 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. వీటికి అదనంగా నక్కపల్లి, అద్దంకి, పీలేరు, మడకశిరను డివిజన్లుగా ఏర్పాటు చేయాలని ఉపసంఘం సిఫారసు చేసింది. పక్షం రోజుల క్రితం జరిగిన సమావేశంలో కొత్తగా 9-10 డివిజన్ల కోసం ప్రతిపాదలు వచ్చాయి. ఉపసంఘం సభ్యులుగా ఉన్న కొందరు మంత్రుల నియోజకవర్గ కేంద్రాలను కూడా డివిజన్లుగా ఏర్పాటు చేయాలన్న సూచనలూ వచ్చాయి. అయితే అధికారులు, ఉద్యోగుల కొరత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేవలం 4 డివిజన్లనే ఉపసంఘం ప్రతిపాదించినట్లు తెలిసింది. నక్కపల్లి అనకాపల్లి జిల్లాలోది. పాయకరావుపేట నియోజకవర్గ మండలాలు ఇందులో ఉండనున్నాయి. వీటి ఏర్పాటుతో మొత్తం 81 రెవెన్యూ డివిజన్లు అవుతాయి. అయితే గిద్దలూరు డివిజన్ విషయంలో పునరాలోచన చేసి ప్రభుత్వం ఆమోదిస్తే అప్పుడు అది కూడా కొత్త డివిజన్ కానుంది. కాగా.. రాష్ట్రంలో ప్రస్తుతం 679 మండలాలున్నాయి. కర్నూలు జిల్లాల ఆదోని మండలాన్ని పునర్వ్యవస్థీకరించి కొత్తగా పెద్దహరివనం మండలం ఏర్పాటు చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది.

'ముంపు' అథారిటీపై పునరాలోచన:

పోలవరం ముంపు మండలాలతో ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలని ఉపసంఘం సిఫారసు చేసిన ట్లు తెలిసింది. అయితే దీనిపై మంత్రుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కూడా ఈ ప్రతిపాదనపై విముఖత చూపినట్లు సమాచారం. ప్రత్యేక అథారిటీతో ఏం ఉపయోగం ఉంటుందని ఆయన ప్రశ్నించగా.. అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదని తెలిసింది. పైగా.. తమను వేరు చేశారన్న భావన ముంపు ప్రాంతాల ప్రజలకు వచ్చే అవకాశం ఉందని, ఇది సరైనది కాదని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం. ముంపు మండలాలను నిర్దిష్ట జిల్లాలోనే కొనసాగించాలని.. అయితే అది ఏ జిల్లా అయితే బాగుంటుందో తగిన నిర్ణయం తీసుకోవాలని ఉపసంఘానికి సూచించారు. ఏలూరులో కలుపుతారా.. లేక వాటి పూర్వపు జిల్లాల్లోనే కొనసాగిస్తారా అనేది ఆలోచన చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉపసంఘం సభ్యులు సీఎం కార్యాలయ ప్రాంగణంలోనే మరోసారి సమావేశమయ్యారు. ముంపు మండలాల స్థితిగతులపై చర్చించారు. కొన్ని ప్రతిపాదనలు చర్చకొచ్చినా మరోసారి మంగళవారం సీఎంను కలిసి ఆ సమావేశంలోనే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

జిల్లా కేంద్రాల మార్పు..

అన్నమయ్య జిల్లాకు రాజంపేట ప్రధాన కేంద్రంగా ఉండాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. కానీ జగన్ సర్కారు నాడు రాయచోటిని జిల్లా కేంద్రం చేసింది. ఇప్పుడు రాజంపేటనే జిల్లా కేంద్రంగా మార్చాలని ఉపసంఘం సిఫారసు చేసినట్లు తెలిసింది. అలాగే పశ్చిమ గోదావరికి భీమవరం బదులు నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం.

నేడు నోటిఫికేషన్లు..

పోలవరం ముంపు మండలాల అంశంపై రెవెన్యూ శాఖ మంగళవారం ఉదయానికి ఉపసంఘానికి నివేదిక ఇవ్వనుంది. అనంతరం ఉపసంఘం సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం ముఖ్యమంత్రికి నివేదించనుంది. అన్ని ప్రతిపాదనలకూ ఆయన ఆమోదం తెలిపాక వెంటనే రెవెన్యూ శాఖ కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలం ఏర్పాటుపై ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం పరిధిలో వీటిని జారీ చేయనుంది. వీటితోపాటు జిల్లాల పునర్వ్యవస్థీకరణపైనా నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిపై ప్రజల నుంచి నెల రోజుల వ్యవధిలో అభ్యంతరాలు, సూచనలు, సలహాలను ప్రభుత్వం స్వీకరిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 26 జిల్లాలు, 77 రెవెన్యూ డివిజన్లు, 679 మండలాలు ఉండగా.. ఉపసంఘం సిఫారసులను ఆమోదిస్తే మొత్తం 28 జిల్లాలు, 81 డివిజన్లు, 680 మండలాలు అవుతాయి.

బాపట్ల జిల్లా నుంచి అద్దంకి మళ్లీ ప్రకాశంలోకి!

- నూజివీడు, గన్నవరం నియోజకవర్గాల్లోని నాలుగేసి మండలాలు ఎన్టీఆర్ జిల్లాలో విలీనం?
- కైకలూరులోని 4 మండలాలు కృష్ణా జిల్లాలోకి
- గూడూరు డివిజన్‌లో 4 మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాకు
- కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలు మళ్లీ ప్రకాశంలో విలీనం!
- పలు డివిజన్లు, మండలాల పునర్వ్యవస్థీకరణకు ఉపసంఘం ప్రతిపాదన

భౌగోళిక, సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలు డివిజన్లు, మండలాలను జిల్లాల నడుమ పునర్వ్యవస్థీకరించాలని ఉపసంఘం కీలక ప్రతిపాదనలు చేసింది. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం ఆ ప్రతిపాదనల్లో కొన్ని కీలకమైనవి ఇవీ..

- అద్దంకి నియోజకవర్గం ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆ నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయాలి. అలాగే అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి.
- అల్లూరి జిల్లా చింతూరు, రంపచోడవరం డివిజన్లను తూర్పుగోదావరిలోకి తీసుకురావాలి (ఈ ప్రతిపాదనపై సీఎం భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది)
- మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలను తూర్పుగోదావరిలో విలీనం చేయాలి.
- కాజులూరు మండలాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కలపాలి.
- ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు, అగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో, ఏలూరు జిల్లాలోనే కైకలూరు నియోజకవర్గంలోని మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాలను కృష్ణా జిల్లాలో కలపాలి.
- కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్ గన్నవరం నియోజకర్గ పరిధిలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి.
- తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిత్తమూరు మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాకు తేవాలి.
- కందుకూరు డివిజన్‌లోని రెండు మండలాలు, ఆత్మకూరులోని రెండు మండలాలను కావలి డివిజన్‌లో విలీనం చేయాలి. దీనివల్ల ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది.
- కందుకూరు డివిజన్‌లోని కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాలను తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయాలి.
- చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలోని నింద్ర, విజయపురం, నగరి మండలాలను తిరుపతి జిల్లాలోకి తీసుకురావాలి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.